నవచేతన పబ్లిషింగ్ హౌస్
2015 11 Anniversary
NBH
www.navachethanabooks.in
Navachethana Vignana Samithi



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



వ్యవసాయ... పాడి రంగాలకు ద్వారాలు తెరవద్దు
భారత్ కంటే ఎవరూ ముఖ్యం కాదు 05
బడ్జెట్‌లో గణాంకాల గారడీ వద్దు



సంపుటి 09, సంచిక: 46 | మంగళవారం | 13-01-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## దురాక్రమణ, బెదిరింపుదారులతో

# ప్రపంచ శాంతికి ముప్పు

**వెనిజులా అధ్యక్షుడు,ఆయన భార్య అపహరణ అత్యంత ఖండనీయం**

- వారితో అందరికీ ప్రమాదమే, సమష్టిగా ఎదుర్కోవాలి
- అమెరికా దుర్మార్గాలు, కుట్రలు తిప్పికొట్టాలి
- వామపక్షాల అగ్రనేతలు, వివిధ పార్టీల ఎంపిలు పిలుపు

**వెనిజులాకు సంఘీభావంగా ఢిల్లీలో వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో బహిరంగ సభ**

**న్యూఢిల్లీ:** ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆ దేశ ప్రథమ మహిళ, ఆయన సతీమణి సిలియా ఫ్లోర్స్‌లను కుట్రపూరితంగా అపహరించిన అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణను వామపక్షాలు సహా వివిధ రాజకీయపార్టీల అగ్రనేతలు, పార్లమెంటు సభ్యులు, ప్రజాసంఘాలు, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల జాతీయ నాయకులు తీవ్ర నిరసనను ప్రకటించారు. దురాక్రమణదారులు, బెదిరింపుదారులతో ప్రపంచ శాంతికి ముప్పు వాటిల్లుతుందని, అలాంటి వారు అందరికీ ప్రమాదమేనని హెచ్చరించారు. ఇలాంటి దురాక్రమణలను వ్యతిరేకించటం, సార్వభౌమత్వానికి అండగా నిలబడడం మనందరి సమష్టి బాధ్యత అని స్పష్టం ఉద్ఘాటించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి లొంగిపోయిందని, దక్షిణార్ధ భూగోళం హక్కుల తరువాయి 2లో


### అమెరికాకు లొంగిన కేంద్ర ప్రభుత్వం

భారత ప్రజలు తమ స్వేచ్ఛ, సార్వభౌమత్వాన్ని గౌరవిస్తారు. అన్ని దేశాల ప్రజలు కూడా అలాగే ఉండాలని కోరుకుంటున్నారు. ఇలాంటి గర్వించదగిన వారసత్వాన్ని గతంలో భారతదేశ విదేశాంగ విధానం ప్రతిబింబించేది. అయితే, ప్రస్తుత బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం ఈ సంప్రదాయం నుండి వైదొలిగింది. ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి లొంగిపోయింది. దక్షిణార్ధగోళం (గ్లోబల్ సౌత్ ) హక్కుల రక్షణలో నిలబడటానికి సుముఖంగా లేదు. ప్రభుత్వం ఈ విధేయ విదేశాంగ విధానాన్ని మార్చుకోవాలని, తన స్వాతంత్ర్యతను నొక్కి చెప్పాలని డిమాండ్ చేస్తున్నాము. వెనిజులా, క్యూబా, పాలస్తీనా ప్రజలతో తన సంఘీభావాన్ని స్పష్టంగా వ్యక్తం చేయాలని, అమెరికా దురాక్రమణను ఖండించాలని మేము భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాము.


– బహిరంగ సభ ఏకగ్రీవ తీర్మానం

# సివిల్ సూట్‌తో రండి

- పోలవరం-నల్లమల సాగర్ వివాదంపై సిజెఐ సూచన
- సుప్రీంలో రిట్ పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ
- నీటి విషయంలో ఎపి ప్రభుత్వం పలు ఉల్లంఘనలు
- వాటిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లాం
- స్టాప్ వర్క్ ఆర్డర్‌ను కూడా అమలు చేయడం లేదని వివరించాం
- ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**న్యూఢిల్లీ / హైదరాబాద్ :** సుప్రీంకోర్టులో పోలవరంనల్లమ ల సాగర్ ప్రాజెక్టుపై దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీంతో పిటిషన్ డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ప్రధాన న్యాయమూర్తి ప్రకటించా రు. అంతకుముందు నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభం కాగా, తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు తరువాయి 2లో



## సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు రండి

ఖమ్మంలో ఈ నెల 18న జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగసభకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని సిపిఐ తరఫున జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యం ఆహ్వానించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో సోమవారం కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. సిపిఐ సభకు హాజరయ్యేందుకు సిఎం రేవంత్ రెడ్డి సుముఖతను వ్యక్తం చేశారని పల్లా వెంకట్ రెడ్డి, నెల్లికంటి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు నూతన చట్టాలు

చలానాలు తగ్గించే ప్రసక్తేలేదు

'అరైవ్ అలైవ్' ప్రచార కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి

**హత్యలకంటే ఎక్కువ ప్రాణాలు పోవడానికి కారణమౌతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు నూతన చట్టాలు తీసుకువస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైడ్రా, ఈగల్, సైబర్ క్రైమ్ విభాగాలను బలోపేతం చేసినట్టే ట్రాఫిక్ నియంత్రలోనూ పోలీస్ వ్యవస్థను సిద్ధం చేయాల్సి ఉందని సిఎం అభిప్రాయపడ్డారు.**



'అన్వేష' ప్రయోగం

## మళ్లీ విఫలం

పిఎస్‌ఎల్‌వి–సి62 అంతరిక్ష వాహకనౌక మూడోదశ గమనంలో సాంకేతిక లోపం

**బెంగళూరు:** ఇస్రో ప్రయోగించిన పిఎస్‌ఎల్‌వి–సి62 అంతరిక్ష వాహకనౌక మూడోదశ గమనంలో సాంకేతిక లోపం ఏర్పడటంతో దేశ భద్రతకు సంబంధించిన కీలక ఉపగ్రహ 'అన్వేష'' (ఇఓఎస్–ఎన్1) ప్రయోగం మరోసారి విఫలమైంది. దీంతోపాటు మరో 14ఉప గ్రహాలు కూడా వాహకనౌకలో ఉన్నాయి. శ్రీ హరికోట సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక తరువాయి 2లో

# జిల్లాల పునర్విభజనకు రిటైర్డ్ జడ్జితో ప్రత్యేక కమిటీ



- గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా విభజించారు
- జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయ్
- రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే మార్పు

**సికింద్రాబాద్‌పై కక్ష కట్టి ఆరోపణలు చేస్తున్నారు**
**అది హైదరాబాద్‌లో అంతర్భాగమే**

- ప్రభుత్వ ఉద్యోగులే సారధులు వారధులు
- ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా
- తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణలో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

'గత ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు అడ్డగోలుగా జరిగింది. జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. అందుకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేస్తాం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో సోమవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీని ఆయన ఆవిష్కరించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన కోసం రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక కమిటీ వేస్తామని తెలిపారు. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తుందన్నారు. జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్‌లలో జనాభా ఎంత ఉన్నారు? అని కమిషన్ అధ్యయనం చేసి నివేదిక ఇస్తుందని, దాని ఆధారంగా జిల్లాలు, రెవన్యూ డివిజన్లు సరి చేస్తామని చెప్పారు. ఆరు నెలల్లో రిపోర్టు ఇవ్వాలని కమిటీని కోరుతామన్నారు. ఈ అంశంపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించినట్లు సిఎం వెల్లడించారు. ఈ క్రమంలోనే కొత్త జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని సిఎం స్పష్టం చేశారు. మరోవైపు రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదని, అందుకే మార్చినట్లు పేర్కొన్నారు. రాచకొండ పేరు రాచరిక పాలనకు గుర్తుగా ఉందని తరువాయి 2లో



## ఉద్యమాలను నడిపేది కలాలే

- ప్రజలను అలోచింపజేసేది సరైన కవిత్వం
- కమ్యూనిస్టులంటే సమాజ మార్పును కోరుకునేవారు

**'నూరేళ్ల అరుణ కేతనం' ఆవిష్కరణ సభలో సుద్దాల అశోక్ తేజ**

ప్రజాపక్షం/ ఖమ్మం

పీడన నిర్బంధాల నుంచి ప్రజా ఉద్యమాలు పుట్టుకొస్తాయని ఆ ఉద్యమాలను నడిపించేది కవుల కలాలేనని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ తెలిపారు. ప్రజలే ఇతివృత్తంగా నిర్బంధాలకు వ్యతిరేకంగా ప్రజలను ఆలోచింపజేసేదే సరైన కవిత్వమని ఆయన ఉద్బోధించారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం డిపిఆర్‌సి భవనంలో అభ్యుదయ రచయితల సంఘం, సిపిఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది కవులు రచించిన కవితా సంకలనం నూరేళ్ల అరుణ కేతనాన్ని సుద్దాల అశోక్‌తేజ ఆవిష్కరించారు. ఇదే సభలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) బాధ్యులు కోంపెల్లి రామయ్య రచించిన నా గమనం కవితా సంపుటిని సైతం సుద్దాల అశోక్ తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరసం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కెవిఎల్ అధ్యక్షతన జరిగిన సభలో సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ కమ్యూనిస్టుల త్యాగాలు వెలకట్టలేనివని ఆ త్యాగాలను ప్రజలకు వివరించాలని ఆయన తరువాయి 12లో

## ఉపాన్యాసాలకంటే పాటకే పదునెక్కువ



ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించేది కళారూపాలే : కూనంనేని 12



వెనిజులా తాత్కాలిక

## అధ్యక్షుణ్ణి నేనే

**తనకుతానే ప్రకటించుకున్న ట్రంప్**

**వాషింగ్టన్:** వెనిజులా దేశానికి తానే తాత్కాలిక అధ్యక్షుడిని అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తనకు తానే స్వీయ ప్రకటన చేశారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం ఆయన సోషల్ మీడియాలో ఈ మేరకు పోస్టింగ్ చేసి అందరినీ దిగ్భ్రాంతికి గురి చేశారు. ఈ మేరకు ఆయన అమెరికా అధ్యక్ష పదవికి ప్రకటించిన అధికారిక ఫొటోను పోస్టింగ్ చేశారు. దీనిపై వెనిజులా నాయకత్వం వెంటనే ప్రతిస్పందించలేదు. అమెరికా మీడియా కూడా చాలా తరువాయి 2లో

14న భోగిమంటల్లో

# బిల్లుల కాపీలు దహనం

- 'నాలుగు లేబర్ కోడ్, విబి జిరామ్ జి, విద్యుత్ సవరణ చట్టం-2025,జాతీయ విత్తన బిల్లు'లకు వ్యతిరేకంగా 16న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు
- ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, రైతు, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ బో గీమంటల సందర్భంగా ఈ నెల 14న 'నాలుగు లేబర్ కోడ్, విబి జిరామ్ జి,విద్యుత్ సవరణ చట్టం 2025, జాతీయ విత్తన బిల్లు' కాపీలను దహనం చేస్తామని, ఈ నెల 16న రాష్ట్ర తరువాయి 12లో





కేరళ హక్కులను

# కేంద్రం హరిస్తోంది

- ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ధ్వజం
- రుణ పరిమితిపై బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంత్రులతో కలిసి ఎల్‌డిఎఫ్ 'సత్యాగ్రహం'

**తిరువనంతపురం :** కేరళకు రుణ పరిమితులకు సంబంధించి ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ కేంద్ర సర్కార్‌పై మండిపడ్డారు. రుణ పరిమితులపై చివరి నిమిషంలో, వివక్షాపూరిత కోతలను విధించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం సమాఖ్య సూత్రాలను బలహీనపరుస్తోందని, రాష్ట్ర రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. కేంద్ర వైఖరికి నిరసనగా లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) వీధుల్లోకి ఆందోళనకు దిగింది. సోమవారం ఎల్‌డిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సత్యాగ్రహంలో విజయన్ మాట్లాడుతూ కేరళ తరువాయి 12లో


ప్రశ్నించే గొంతుకలను నొక్కుతూ అధికార సుస్థిరతకు బిజెపి యత్నం
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు 03

తుది దశకు నూతన విత్తన చట్ట ముసాయిదా
తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి 03

రాముడికి బిజెపి సభ్యత్వం ఇచ్చిందా?
టిపిసిసి చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్ గౌడ్

# సూకీ నియోజకవర్గం మాదే అంటున్న మయన్మార్ జుంటా



**ప్యాంగ్‌యాంగ్ :** మయన్మార్‌లో జరుగుతున్న ఎన్నికల్లో దేశ మాజీ ప్రధాన మంత్రి, జైలులో మగ్గిపోతున్న ప్రజాస్వామ్య ఉద్యమనాయకురాలు ఆంగ్ సాన్ సూకీ పార్లమెంటు స్థానాన్ని ఎన్నికల్లో తామే స్వాధీనం చేసుకున్నట్లు జుంటా సైనిక పాలకుల అనుకూల పార్టీ యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ (యుఎస్‌డిపి) ప్రతినిధి ఒకరు ప్రకటించారు. సూకీకి చెందిన నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ (ఎన్ఎల్‌డి)పార్టీ ఒకప్పుడు ఆధిక్యత ప్రదర్శించిన యాంగోన్‌లో 16 స్థానాలను సైన్యం అనుకూల యుఎస్‌డిపి గెలుచుకుంది. ఐతే అధికారికంగా ఈ ఫలితాలన్నీ తర్వాత ప్రకటిస్తారు. మొదటిదశలో జరిగిన ఎన్నికల్లో సైనిక అనుకూల యుఎస్‌డిపి పార్టీ దాదాపు 90 శాతం సీట్లు గెలుచుకున్నట్లు సమాచారం. ఐతే సైనిక అనుకూల యుఎస్‌డిపి ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తే ఎవరూ ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని ఐక్యరాజ్యసమితి హక్కుల నిపుణుడు టామ్ ఆండ్రూస్ అన్నారు. మయన్మార్‌లో ఐదు సంవత్సరాలుగా కొనసాగుతున్న జుంటా సైనిక పరిపాలనలో భాగంగా పార్లమెంటుకు దశలవారీగా జరుగుతున్న ఎన్నికల్లో రెండోవిడత పోలింగ్ ప్రక్రియ ఆదివారం పూర్తయింది. అర్హులైన ఓటర్లు తమ తమ సమీప పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు ఉపయోగించుకున్నారన ఎన్నికల వర్గాలు తెలిపాయి. రిపబ్లిక్ ఆఫ్ యూనియన్ ఆఫ్ మయన్మార్ తాత్కాలిక అధ్యక్షుడు, స్టేట్ సెక్యూరిటీ అండ్ పీస్ కమిషన్ ఛైర్మన్ సీనియర్ జనరల్ మిన్ ఆంగ్ హ్లైంగ్ పోలింగ్ తీరును పరిశీలించేందుకు యాంగాన్‌లోని పోలింగ్ కేంద్రాలలో ఆదివారం పర్యటించారు. ఆదివారం ఉదయం ఆరు గంటల నుండి పలు రాష్ట్రాలు, రీజియన్‌లలో ఉన్న 100 టౌన్‌షిప్‌లలో ఈ పోలింగ్ జరిగింది. డిసెంబరు 28న మొదటి దశ పోలింగ్ పూర్తిచేశారు. సైనిక పాలకుల అనుకూల పార్టీ సూకీ పార్లమెంటరీ నియోజకవర్గాన్ని గెలుచుకున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఐతే దీనిని ఏకపక్ష సైనిక కుట్రలో భాగమని సూకీవర్గీయులు విమర్శించారు. 2021లో సైనిక కుట్రద్వారా మరోసాని ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని సైన్యం కూలదోసి అధికారం చేజిక్కించుకుని అంతర్జాతీయ ఒత్తిడి భరించలేక తమకు అనుకూలంగా ఈ ఎన్నికల ప్రక్రియ నడిపిస్తున్నారని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. తుది విడత ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జనవరి 25వ తేదీతో ముగియనున్నది. ఫిబ్రవరి రెండోవారంలోపు ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# గ్రోక్ ఛాట్‌బోట్‌ను స్తంభింపజేసిన మలేసియా, ఇండోనేసియా

**కౌలాలంపూర్:** మలేసియా, ఇండోనేసియా ప్రభుత్వాలు తాత్కాలికంగా కృత్రిమ మేధ ఛాట్‌బోట్ 'గ్రోక్'ను స్తంభింపజేశాయి. అసభ్యకరమైన, అశ్లీల కంటెంట్‌ను ఇష్టానుసారంగా సృష్టించేందుకు ఈ గ్రోక్ ఛాట్‌బోట్‌ను దుర్వినియోగం చేస్తున్నారన్న కారణంగా మలేసియా ప్రభుత్వం దీనిని ప్రజలకు అందుబాటులో లేకుండా స్తంభింపజేసింది. రీల్స్ చేసే వినియోగదారులు దీనిని తీవ్రస్థాయిలో దుర్వినియోగం చేస్తున్నారని, పూర్తిగా దుస్తులు లేకుండా అశ్లీకరమైన కంటెంట్‌ను సృష్టిస్తున్నారని ఈ రెండుదేశాల ప్రభుత్వాలు విమర్శించాయి. దాదాపు బ్రిటన్‌లో కూడా ఈ ఛాట్‌బోట్‌ను స్తంభింపజేయాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి.

2023లో ఎక్స్ వేదికగా ఎలాన్‌మస్క్ దీనిని మొదట అందుబాటులోకి తీసుకువచ్చారు. మనిషి కంటే చాలా ఎక్కువ జ్ఞానం ఈ ఛాట్‌బోట్‌కు ఉందని మస్క్ తొలుత ప్రచారం చేశారు. లైంగిక చిత్రాలను తయారుచేయడానికి, వాటిని అప్‌లోడ్ చేయడానికి మహిళలు, మైనర్లను కూడా భాగస్వామ్యంచేసి వినియోగదారులను అనుమతించినందుకు మస్క్ ప్రపంచవ్యాప్తంగా ఇంతకుముందే విమర్శలు ఎదుర్కొన్నారు. ఇలా విమర్శలు చేసిన జాబితాలో భారతదేశం కూడా ఉంది. బోట్ దుర్వినియోగమవుతోందని, ఇది చాలా తీవ్ర ప్రమాదకరమైన విషయమని మలేసియా కమ్యూనికేషన్స్, మల్టీ మీడియా విభాగం ఆందోళన వ్యక్తం చేసింది.

# యుద్ధానికైనా చర్చలకైనా సిద్ధమే

### ఇరాన్ ప్రకటన
### అదుపులోకి వచ్చిన అల్లర్లు
### వేలాదిమంది ప్రభుత్వ అనుకూల ప్రదర్శనలు

**టెహ్రాన్:** యుద్ధానికైనా, శాంతి చర్చలకైనా ఇరాన్ సిద్ధంగా ఉందని ఆ దేశ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రకటించారు. ఇరాన్ అంతర్గత సంక్షోభంలో అమెరికా సైనిక జోక్యం చేసుకుంటుందన్న వార్తలమధ్య, ఏ దేశంతోనూ తాము శత్రుత్వాన్ని కోరుకోవడంలేదని, ఐనప్పటికీ తమ దేశం పూర్తిస్థాయిలో యుద్ధానికి సన్నద్ధంగా ఉందని అన్ని ఏర్పాట్లూ చేసుకుందని అన్నారు. కాగా ఇరాన్‌లో పరిస్థితి అదుపులోకి వచ్చిందని విదేశీమంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఒకరు ప్రకటించారు. మరోవైపు దేశంలోని అనేక రాష్ట్రాలలో ప్రభుత్వ అనుకూల ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. వేలాదిమంది ప్రదర్శకులు ఈ ర్యాలీల్లో పాల్గొంటున్నారని ప్రభుత్వం తెలియజేసింది. దేశ సంరక్షణ కోసం ప్రాణత్యాగాలు చేసిన భద్రతాదళాలకు నివాళులు అర్పించేందుకు మూడు రోజులు జాతీయ సంతాప దినాలు పాటిస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ టీవీలో సోమవారం విదేశీ రాయబారులతో అరాఘ్చి మాట్లాడుతూ, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అమెరికాతో చర్చలకు సిద్ధంగా ఉందని, కానీ ఈ చర్చలు న్యాయబద్ధంగా, పరస్పర మర్యాదపూర్వకస్థాయిలో ఉండాలన్నారు. ఇరాన్ దేశం యుద్ధాన్ని కోరుకోవడంలేదని, కానీ స్వీయ సంరక్షణ కోసం యుద్ధం చేసేందుకు పూర్తి సన్నద్ధంగా ఉందని అన్నారు.

ఇరాన్‌లో డిసెంబరు 28వ తేదీన ఒక బజారులోని చిన్న దుకాణం వద్ద మొదలైన ఘర్షణ బ్రహ్మాస్త్రంలా మారి దేశం అంతటా హింసాకాండకు పురిగొల్పింది. 16 రోజులుగా ఇరాన్‌లో జరిగిన అల్లర్లు, హింసాకాండలో 538 మంది ప్రదర్శకులు మరణించగా, ప్రభుత్వ దళాలు 10,670 ప్రదర్శకులను అరెస్టు చేశాయి. 100 మంది భద్రతా దళాలు ఈ సంక్షోభ సమయంలో ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ఇతర దేశాల్లో కూడా ఇరాన్ రాయబార కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. బ్రిటన్ రాయబార కార్యాలయంవద్ద ఇరాన్ జెండాను పీకేసి ప్రదర్శకులు నిరసన తెలియజేసిన తర్వాత ఆస్ట్రేలియా రాధాని కాన్‌బెర్రాలో కూడా సోమవారం ప్రదర్శకులు ఇరాన్ జాతీయ జెండాను తొలగించ నిరసన ప్రకటించారు. జెనీవా నుండి ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్‌లో పరిణామాలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయన్నారు.



దేశంలో ప్రస్తుతం జరుగుతున్న అల్లర్లకు, ఉగ్రవాదులు చేస్తున్న చర్యలకు ప్రజలుదూరంగా ఉండాలని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ పిలుపు ఇచ్చారు. ఆదివారం సాయంత్రం ఆయన ఇరాన్ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. దేశ వినాశనానికి అల్లర్లు, సంఘర్షణలను రెచ్చగొట్టి అశాంతి సృష్టించేందుకు అమెరికా ప్రయత్నం చేస్తోందని, ఈ అల్లర్లకు, ఉగ్రవాదుల చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రజల డిమాండ్లను, సమస్యలను ప్రభుత్వం ఆలకించి పరిష్కరిస్తుందని, అదేసమయంలో సమాజాన్ని ధ్వంసం చేసే మూకలను సహించబోమని హెచ్చరించారు. విదేశాల నుండి ఉగ్రవాదులను తీసుకువచ్చారని, వారంతా దేశంలో మసీదులను తగలబెట్టి కొంతమంది తలలు నరుకుతున్నారని, అమాయకులైన ప్రజలను హతమార్చి విద్వేషం సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు, అల్లరిమూకల వలలోపడి మోసపోవద్దని యువతరానికి పిలుపు ఇచ్చారు. ప్రజల నిజమైన ఆందోళనను, నిజమైన సమస్యలను పరిశీలించి వాటిని ప్రభుత్వం పరిష్కరిస్తుందని పెజెష్కియన్ భరోసా ఇచ్చారు.

**భయపడి చర్చలకు వచ్చిన ఇరాన్: ట్రంప్**

ఇరాన్ ప్రభుత్వం అమెరికా చేసిన హెచ్చరికలతో భయపడి దిగి వచ్చిందని, తమదేశంతో చర్చలకు సంసిద్ధత వ్యక్తం చేసిందని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌లో ప్రదర్శనలు చేస్తున్న ప్రజలను కాపాడేందుకు చాలా బలమైన సైనిక చర్యకు చాలా బలమైన ప్రత్యామ్నాయాల గురించి అమెరికా అమెరికా ఆలోచిస్తోందని ఆయన మరోసారి ప్రకటించారు. ఇరాన్ అణు కార్యక్రమంపై ఆ దేశ నాయకత్వంతో చర్చలకు ట్రంప్ అంగీకరించారని వైట్‌హౌస్ జర్నలిస్టులు సోమవారం వార్తలు రాశారు. జనవరి 10వ తేదీన ఇరాన్ నాయకులు ట్రంప్‌తో ఫోన్ సంభాషణలు చేశారని, చర్చలు జరుపుదామని ప్రతిపాదించారని చెప్పినట్లు రాయిటర్స్‌ను ఉటంకిస్తూ టాస్ వార్తాసంస్థ ప్రకటించింది. "ఇరాన్ పాలకులు సంప్రదింపులు కోరుతున్నారు, ఔను, మేం అంగీకరించాం, వారితో సమావేశమయ్యే అవకాశం ఉంది, మా ఉద్దేశం, ఆ ఏర్పాట్లు జరుగుతున్నాయి,ఐతే దీనికి ముందుగా మా సమావేశం జరుగుతుంది" అని ట్రంప్ చెప్పినట్లు వైట్‌హౌస్ జర్నలిస్టులు రాశారు. ఇరాన్‌పై దాడి చేసే విషయంపై సీనియర్ అధికారులతో మంగళవారం ట్రంప్ సమావేశం కానున్నారు.

ఇరాన్ అణ్వస్త్రాలు తయారు చేస్తోందని పశ్చిమ దేశాలు ప్రకటించడతో 2002లో సంక్షోభం మొదలైంది. ఈ సంక్షోభం ముగించేందుకు బ్రిటన్, జర్మనీ, చైనా, రష్యా, అమెరికా, జర్మనీ దేశాలు 2015లో జెసిపిఓఎ ఒప్పందంపై సంతకాలు చేశా యి. ఐతే 2018లో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందం నుండి వైదొలగుతున్నట్లు ప్రకటించి ఇరాన్‌పై తిరిగి ఆంక్షలు అమలు చేశా రు. గత ఏడాదిట్రంప్ మళ్ళీ అధికారంలోకి వచ్చా క ఇరాన్‌తో చర్చలకు ఒత్తిడి చేశారు. ఈ చర్చలు విఫలమయ్యాయి. అమెరికా చేతలో దెబ్బలు తినీ.. తినీ ఇరాన్ విసిగిపోయిందని, దిగి వచ్చిందని ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో చర్చలకు అవకాశం ఉందని చెప్పారు. ఆ దేశ నాయకులు ఆదివారం తనకు ఫోన్ చేశారని, చర్చల ప్రతిపాదన చేశారన్నారు. కేవలం హింసద్వారానే ఆ నాయకులు దేశాన్ని పాలిస్తున్నారని విమర్శించారు.

### అమెరికా–ఇజ్రాయెల్ జోక్యానికి ఆధారాలున్నాయ్ : ఇరాన్

ఇరాన్‌లో జరుగుతున్న అల్లర్లు, హింస, ఉగ్రవాద చర్యల్లో అమెరికా, ఇజ్రాయెల్ జోక్యం ఉన్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి చెప్పారు. ప్రభుత్వ టీవీలో సోమవారం ఆయన మాట్లాడుతూ, ఇటీవలి రోజుల్లో ఈ రెండు దేశాలూ ఇరాన్‌లో ఉగ్రవాద, కుట్ర చర్యలకు పాల్పడినట్లు భారీసంఖ్యలో లిఖితపూర్వక ఆధారాలున్నాయన్నారు. ఇజ్రాయెల్ నిఘా సంస్థ "మొస్సాద్' ఇరాన్‌లో అల్లరిమూకలతో కలిసి ఉగ్రవాద చర్యలు నడిపిస్తున్నట్లు అమెరికా విదేశాంగశాఖ మాజీమంత్రి మైక్ పాం పియో కూడా అంగీకరించారన్నారు. ఈ ఘటనలపై మేం దర్యాప్తు చేస్తాం, కానీ మా దేశంలో ప్రాణ నష్టాలకు కారకులైన దేశాలు చేస్తున్న ప్రకటనలే దీనికి ప్రధాన సాక్ష్యాలని, వాటిని ప్రామాణికంగా తీసుకుంటామన్నారు. గాజాలో 70,000 మంది పౌరులు మరణిస్తే అమెరికా, ఇజ్రాయెల్ ఖండించలేదు, ఇరాన్‌లో 1000 మంది ప్రజలు మరణించారని వారు అంటున్నారు, శాంతి భద్రతలు కాపాడుతున్న ఇరాన్ పోలీసులను వారు తప్పుపడుతున్నారని అబ్బాస్ అరాఘ్చి విమర్శించారు.




## ప్రపంచ శాంతికి ముప్పు (మొదటి పేజీ తరువాయి)

రక్షణలో నిలబడటానికి ఇష్టపడటం లేదని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా, వెనిజులాకు సంఘీభావంగా '@హ్యాండ్స్ ఆఫ్ వెనిజులా– ఫ్రీ నికోలస్ మదురో'' పేరుతో దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం వామపక్షాల సహా అనేక ఇతర పార్టీల ఆధ్వర్యంలో హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో విస్తృత స్థాయి బహిరంగ సభ జరిగింది.

సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ఎస్‌పి, సమాజ్‌వాది పార్టీ, ఆర్‌జెడి, ఆప్, డిఎంకె, విసికె నేతలు పాల్గొన్న ఈ సభ వెనిజులా సార్వభౌమాధికారాన్ని కాపాడటంలో వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల సమిష్టి సంకల్పాన్ని సమావేశం ప్రతిబింబించింది.సభలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యుడు రవి రాయ్, ఫార్వర్డ్‌బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి. దేవరాజన్ ,ఆర్ఎస్‌పి కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.ఎస్. డాగర్ , రాజ్యసభలో డిఎంకె పక్ష నాయకుడు, ఎంపి తిరుచ్చి శివ, విసికె జాతీయ అధ్యక్షుడు, ఎంపి థోల్. తిరుమావళవన్, సమాజ్‌వాది పార్టీ ఎంపి జావేద్ అలీ ఖాన్, ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి సందీప్ పాఠక్‌లు ప్రసంగించారు. వెనిజులాలో అమెరికా జోక్యాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. వెనిజులా ప్రజలు, వారి చట్టబద్ధమైన ప్రభుత్వానికి సంపూర్ణ సంఘీభావాన్ని పునరుద్ఘాటించింది. వెనిజులా సార్వభౌమత్వాన్ని గౌరవించాలని, సామ్రాజ్యవాద దురాక్రమణను అంతం చేయాలని పిలుపునిచ్చింది. సభకు సిపిఐ(ఎం) సీనియర్ నేత ప్రకాశ్ కారాట్ అధ్యక్షత వహించగా, సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా వందన సమర్పణ చేశారు. వారితో పాటు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బాల్‌చంద్ర కాంగో, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ దినేష్ వర్షణే, క్యూబా రాయబారి, పాలస్తీనా రాయబార కార్యాలయ కౌన్సెలర్ యాసర్ దుల్హాన్, వెనిజులా రాయబార కార్యాలయ కౌన్సెలర్, ఇతర విశిష్ట ప్రతినిధులు హాజరై ప్రసంగించారు.

ఇంకా ఎఐటియుసి, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు, ఇతర వామపక్షాల ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

*అమెరికాది ఆధునిక గుండాయిజం*

*సభలో వెనిజులాకు సంఘీభావంగా ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. తీర్మానం వివరాలిలా ఉన్నాయి.*

* భారతదేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలుగా వెనిజులాపై అమెరికా దురాక్రమణను, ఆ దేశానికి ఎన్నికైన అధ్యక్షుడు నికోలస్ మదురో, ప్రథమ మహిళ సిలియా ఫ్లోర్స్ అపహరణను బహిరంగ సభ నిర్ద్వంద్వంగా ఖండించింది.
* క్యూబా, మెక్సికో, కొలంబియా, ఇరాన్ గ్రీన్‌ల్యాండ్ దేశాలకు అమెరికా బెదిరింపులను సైతం ఖండించింది.
* జాతీయ సార్వభౌమత్వాన్ని గౌరవించాలని, సార్వభౌమ దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని పిలుపునిచ్చే ఐక్య రాజ్య సమితి చార్టర్‌ను అమెరికా పాల్పడిన చర్యలు ఉల్లంఘించాయి.
* వెనిజులా గొప్ప సహజ వనరులను, ముఖ్యంగా దాని చమురును స్వాధీనం చేసుకునేందుకు అమెరికా దురాక్రమణ ఒక దుస్సాహస ప్రయత్నం. వెనిజులాలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలను స్వాధీనం చేసుకుని నియంత్రించాలని అమెరికా ప్రయత్నిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే అమెరికా చమురు అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. వాటి స్వాధీనం కోసం ప్రణాళిక వేస్తున్నట్లు సమాచారం.
* లాటిన్ అమెరికన్ ప్రాంతం మొత్తాన్ని ఆధిపత్యం చేయాలనే లక్ష్యంతో, అప్రసిద్ధ మన్రో సిద్ధాంతం అమలు చేయాలనే ట్రంప్ ఉద్దేశ్యం పర్యవసానంగా అమెరికా జాతీయ భద్రతా వ్యూహం, 2025 ప్రకటించింది. లాటిన్ అమెరికన్ దేశాలు తమ ప్రాంతం వెలుపలి దేశాలతో వ్యాపారం చేయడానికి అనుమతించబోమని అమెరికా బహిరంగంగా ప్రకటించింది. ఇది ఆధునిక గ్యాంగ్‌స్టారిజం(గుండాయిజం), బెదిరింపు తప్ప మరొకటి కాదు. లాటిన్ అమెరికాలోని సార్వభౌమ దేశాల హక్కుల ఉల్లంఘనను తీవ్రంగా ఖండిస్తున్నాము.
* అమెరికా దురాక్రమణను ప్రతిఘటిస్తూ వీధుల్లోకి వచ్చి తమ అధ్యక్షురాలు మరియు ప్రథమ మహిళను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న వెనిజులా ప్రజలకు మేము మా అచంచల సంఘీభావాన్ని ప్రకటిస్తున్నాము.
* అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆధ్వర్యంలో అత్యంత అమానవీయ దిగ్బంధనకు గురైన, తాజాగా ప్రత్యక్ష సైనిక దాడి ముప్పు ఎదుర్కొంటున్న క్యూబా ప్రజలకు కూడా సంఘీభావాన్ని తెలియజేస్తున్నాము.
* అమెరికా, ఇజ్రాయెల్ సహా దాని మిత్రదేశాల దురాక్రమణను ప్రతిఘటిస్తున్న పాలస్తీనా ప్రజలు, అన్ని ఇతర దేశాలతో సంఘీభావంగా నిలబడతాం.
* భారత ప్రభుత్వం విధేయ విదేశాంగ విధానాన్ని మార్చుకొని, వెనిజులా, క్యూబా మరియు పాలస్తీనా ప్రజలతో తన సంఘీభావాన్ని స్పష్టంగా వ్యక్తం చేయాలి.
* వెనిజులాతో సంఘీభావంగా నిలబడాలని, అమెరికా దురాక్రమణను ఖండించాలని భారత దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము.
* దురాక్రమణదారులు, బెదిరింపుదారులు ప్రపంచ శాంతికి ముప్పు. వారు అందరికీ ప్రమాదం. ఇది మన సమిష్టి బాధ్యత.

## అధ్యక్షుణ్ణి నేనే (మొదటి పేజీ తరువాయి)

ప్రముఖంగా ఈ వార్తలను ప్రచురించింది. ట్రంప్ తానే వెనిజులా అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారని దిగ్భ్రాంతి చెందుతూ కథనాలు రాశాయి. చైనా అధికారిక పత్రికలు కూడా వార్తకు అధికప్రాముఖ్యతను ఇచ్చాయి. గత వారం ట్రంప్ ఫాక్స్‌న్యూస్ ప్రతినిధి సీన్ హన్నిటీతో మాట్లాడుతూ, వెనిజులాలో ఎన్నికలకు అనుమతి ఇస్తామని, ఎన్నికల తర్వాత ఆ దేశంలో చమురు రంగాన్ని పునర్నిర్మిస్తామని, ఆ దేశ ప్రజల నుదుటి రాత మార్చేస్తామని ప్రకటించారు. గడచిన శుక్రవారం ట్రంప్ వెనిజులా చమురు ఆదాయాన్ని అమెరికా అకౌంట్లలోకి బదిలీ చేసి భద్రపరచి విదేశీ విధాన ప్రయోజనాలకు ఉపయోగించేవిధంగా ఒక ఉత్తర్వుపై సతకం చేశారు.

వెనిజులాలో తన పెత్తనాన్ని స్థిరీకరించుకునేందుకు ట్రంప్ ఇప్పటికే ఆ దేశానికి దౌత్యవేత్తలను పంపారు. కారకస్‌లో దౌత్యకార్యాలయం తెరచేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ప్రతిపక్ష నాయకురాలు మచాడో కూడా ఇప్పుడు ట్రంప్ చేతిలో కీలుబొమ్మగా మారారు. తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను మిగిలిన ఖైదీలందరినీ విడుదల చేయాలని ట్రంప్ ఒత్తిడి చేస్తున్నారు.

ఇప్పటికే 21 మంది ఖైదీలు విడుదలయ్యారు. వెనిజులా జైళ్ళలో 1200 మంది రాజకీయ ఖైదీలు ఉన్నారని అమెరికా హక్కుల సంఘాలు అంచనావేశాయి.

## పత్యేక కమిటీ (మొదటి పేజీ తరువాయి)

మార్చామన్నారు. సికింద్రాబాద్ విషయంలో తాను వచ్చాక చేసిందేమీ లేదని, సికింద్రాబాద్ గతంలోనే జిహెచ్‌ఎంసిలో భాగంగా ఉందని స్పష్టం చేశారు. ఉద్యోగులే ప్రభుత్వ సారథులు, వారధులని అన్నారు. తాను పదవి చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని, సెలవు తీసుకోవాలని అనుకున్నప్పటికీ ఏదో ఒక పని వచ్చిపడుతోందని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది ప్రజాప్రతినిధులు మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, పదిన్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని, ఉద్యోగుల్లో కూడా తనను ఇష్టపడని వారు ఉండొచ్చని, తాను వచ్చిన తరువాత ఉద్యోగుల వేతనాలు ఎలా అందుతున్నాయో గమనించాలని కోరారు. సంక్రాంతి కానుకగా ఉద్యోగుల డిఎ ఫైళ్లపై సంతకం చేసి ఇక్కడికి వచ్చానని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.1 కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయని, పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సిన నిధులు వస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం రూ.18వేల కోట్లు అయి తే, గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోపి వెళ్లిందని, ప్రతీ నెలా రూ. 22 వేల కోట్లు అప్పులకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. పన్నులు పెంచాల్సిన అవసరం లేదని, సరిగా వసూలు చేస్తే చాలని వ్యాఖ్యానించారు. సికింద్రాబాద్‌పై తాను కక్ష కట్టినట్టు ఆరోపణలు చేస్తున్నారని, సికింద్రాబాద్ గతంలోనూ జిల్లాగా లేదని, హైదరాబాద్‌లో అంగర్భాగంగానే ఉందని చెప్పారు. రాచకొండ అనే దొరల పేర్లు ఎందుకనే భావనతోనే మల్కాజిగిరిగా మార్చామని చెప్పారు. ఒక శుక్రచార్యుడు ఫామ్ హౌస్‌లో ఉండి అసెంబ్లీకి మారీచుడు లాంటి వాళ్లను పంపిస్తున్నారని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి సిఎం విమర్శలు చేశారు. ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరం కలిసికట్టుగా బాధ్యతను నిర్వహిస్తేనే పరిపాలన పరుగులు పెడుతుందని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యు దు అనిల్‌కుమార్ యాదవ్, ఎంఎల్‌ఎ రాజ్ ఠాకూర్, గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు పాల్గొన్నారు.

## సివిల్ సూట్‌తో రండి (మొదటి పేజీ తరువాయి)

వినిపించారు. తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్ వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని న్యాయస్థానం సూచించింది. సూట్ దాఖలు చేస్తే గోదావరి నది పరీవాహక రాష్ట్రాల అభిప్రాయాలు పరిగణనలోకి వస్తాయని ధర్మాసనం పేర్కొంది. ఇంకా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల వాదనలు కూడా వినాల్సి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. గోదావరి నదిపైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరంనల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో సూట్ దాఖలు చేయబోతున్నామని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం తరపున సూట్ వేయలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రిట్ పిటిషన్ కంటే సూట్ ద్వారానే గోదావరి జలాలపై అంతర్ రాష్ట్రలతో సమగ్ర విచారణకు ఆస్కారం ఉంటుందన్న సుప్రీంకోర్టు సూచనల మేరకే రాష్ట్ర ప్రభుత్వం సూట్ వేస్తున్నామని వివరించారు. పోలవరంనల్లమల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై సోమవారం జరిగిన వాదనలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా హాజరయ్యారు. విచారణ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సుప్రీంకోర్టు వెలుపల మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంతర్ రాష్ట్ర జల నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నందున తెలంగాణ రాష్ట్రానికి చెందాల్సిన న్యాయమైన నీటి వాటాను కాపాడుకోవడంలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయం తీసుకుందన్నారు.

తెలంగాణ రాష్ట్రానికి చెందాల్సిన ప్రతీ నీటి బొట్టును పరిరక్షించుకోవడమే రాష్ట్ర ప్రభుత్వం ముందున్న కర్తవ్యమని,తెలంగాణా హక్కులను కాపాడుకోవడంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. గోదావరి జలాశయాలలో అంతర్ రాష్ట్రల ప్రభావాన్ని పరిగణలోకి తీసుకోవడంతో పాటు తెలంగాణ రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్ల కుండా సమగ్రమైన సమాచారంతో తెలంగాణా రాష్ట్రం తరపున వాదిస్తున్న సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ సంఘ్వి కోర్టు సూచనలకు సూట్ దాఖలు వెయ బోతున్నారని, సుప్రీంకోర్టు ధర్మాసనం సూచనలకు అనుగుణంగానే రిట్ పిటిషన్ ను ఉపసంహరించుకున్నామని ఉత్తమ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు ముమ్మాటికీ నిబంధనలను ఉల్లంఘించడమేనని ఆరోపించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే తెలంగాణ రాష్ట్రంలోని దిగువ ప్రాంతాలలో నీటి వనరులను కోల్పోయే పరిస్థితి ఉత్పన్నం కావొచ్చని ఆయన చెప్పారు.

# ఖమ్మం భారీ ప్రదర్శనలో ఎర్ర చొక్కాలు ధరించాలి

### ఎఐటియుసి బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో ఈ నెల 18న చేపట్టనున్న' చలో ఖమ్మం'లో భాగంగా చేపట్టనున్న భారీ ప్రదర్శనలో అన్ని రంగాలకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. ఈ ప్రదర్శనకు ఎర్ర చొక్కాలు, మహిళా కార్మికులు కూడా ఎర్ర చీరలు, జాకెట్లు ధరించాలని సూచించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు పిలుపు మేరకు ఖమ్మంలో జరుగు భారీ ప్రదర్శన, సభలో ఎఐటియుసి అనుబంధ సంఘాల సభ్యులందరూ పాల్గొనాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులు, సంఘటిత, అసంటితరంగ కార్మికులు, ఆశా, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఆర్‌టిసి, వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న రెగ్యులర్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు అన్ని మున్సిపాల్టీలలో పని చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, మిషన్ భగీరథ, గ్రామ పంచాయితీలలో పని చేస్తున్న కార్మికులు, సివిల్ సప్లయిస్ హమాలీలు, ఎస్‌డబ్ల్యుసి, సిడబ్ల్యుసి, వ్యవసాయ మార్కెట్ యార్డు, గిరిజన కార్పొరేషన్లలో పని చేస్తున్న హమాలీలు, ట్రాన్స్‌పోర్ట్ , గ్యాస్ డెలివరీ, ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్, వంట కార్మికులు స్కావెంజర్లు, అన్ని రంగాలలో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, మెడికల్ కాంట్రాక్ట్, బిడి, సింగరేణి వర్కర్స్ యూనియన్, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్మికులు అన్ని రంగాలలో పని చేస్తున్న ఎఐటియుసి అనుబంధ సంఘాల నాయకులు 'చలో ఖమ్మం' 'సిపిఐ వందేళ్ళ పండుగను విజయవంతం చేసేందుకు ప్రతి కార్మిక సంఘం అధిక సంఖ్యలో సిపిఐ సభకు బయల్దేరి రావాలని బాల్‌రాజ్ కోరారు.

## మళ్లీ విఫలం (మొదటి పేజీ తరువాయి)

నుండి నిర్ణీత ప్రకారం సోమవారం ఉదయం 10.17 గంటలకు పిఎస్ఎల్‌వి–సి62 వాహకనౌక బయలుదేరింది. మూడు దశల ప్రయాణం సాఫీగా సాగింది. మూడోదశ దాటి నాలుగోదశలోకి ప్రవేశించే సమయంలో అంతరాయం ఏర్పడి అనుకున్నమార్గంలో వెళ్ళలేదు. దీంతో 'అన్వేష్‌తోపాటు దేశీయ,అంతర్జాతీయస్థాయి ఉపగ్రహాలను సాఫీగా స్థిరకక్ష్యలలోకి ప్రవేశపెట్టే లక్ష్యాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈ వాహకనౌకలో 'అన్వేష'తోపాటు దేశ అంకుర సంస్థలు తయారు చేసిన ఏడు ఉపగ్రహాలతోపాటు విదేశీ కంపెనీలకు చెందిన మరో ఎనిమిది ఉపగ్రహాలు కూడా ఉన్నాయి. స్పెయిన్‌కు చెందిన కిడ్ (కేస్ట్రల్ ఇనీషియల్ టెక్నాలజీ డిమాన్‌స్ట్రేటర్) అనే చిన్న ఉపగ్రహం కూడా ఇందులో ఉంది.

జాతీయ భద్రతకు సంబంధించి రక్షణ,పరిశోధనా సంస్థ (డిఆర్‌డిఓ) ప్రతిష్ఠాత్మకంగా తయారు చేసిన ఖరీదైన కీలక ఉపగ్రహాన్ని కొత్త సంవత్సరం చేసిన ప్రయోగంలోనే ఇస్రో కోల్పోవడం ఆందోళన కలిగించింది. భూమికి 511 కి.మీ ఎత్తున ఈ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టాల్సి ఉంది. ఈ ఉపగ్రహం ఎంతో శక్తి మంతమైనది. దీనిలోన కెమేరా ద్వారా మన భూభాగంలో ఉన్న నిర్మాణాలు, సరిహద్దులు, ప్రాంతాలు, మట్టి,నీరు వంటివన్నీ చాలా స్పష్టంగా కనిపిస్తాయి. జాతీయ భద్రత, సరిహద్దుల రక్షణకు సంబంధించిన ఈ ఉపగ్రహాన్ని ఇస్రో ఇప్పటివరకూ ఐదుసార్లు ప్రయోగించింది. 2017 నుండీ 2026 వరకూ ఇస్రో మొత్తం 44 ప్రయోగాలు చేసింది. వీటిల్లో జాతీయ భద్రతకు సంబంధించిన ఐదు ప్రయోగాలు మాత్రమే విఫలమయ్యాయి. ఈ ఐదు ప్రయోగాలలో 2025 జనవరి నుండి 2026 జనవరి వరకూ ఏడాదికాలంలో చేసిన ఒకే ప్రయోగం మూడుసార్లు విఫలమైంది. గత ఏడాది మే నెలలో పిఎస్ఎల్‌వి–సి61 వాహకనౌక మూడోదశ గమనంలో ఛాంబర్ ఒత్తిడిలో మార్పు రావడమనే సాంకేతిక లోపం వల్ల విఫలమైంది. దీనిపై సమీక్ష జరిపి తదుపరి వివరాలు తెలియజేస్తామని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ చెప్పారు. ఐతే జరిగిన ప్రతి వైఫల్యం నుండీ ఇస్రో శాస్త్రవేత్తలు విలువైన గుణపాఠాలు నేర్చుకుంటున్నారని ఇస్రో వర్గాలు పేర్కొన్నాయి. 63 సార్లు విజయవంతంగా పిఎస్ఎల్‌వి చేసిన అంతరిక్ష ప్రయాణాలలో చంద్రయాన్–1, మార్స్ ఆర్బిట్ మిషన్, ఆదిత్య–11, ఆస్ట్రోశాట్ వంటివన్నీ ఉన్నాయి. అదేవిధంగా ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించి పిఎస్ఎల్‌వి ప్రపంచ రికార్డు సృష్టించింది.

# ప్రశ్నించే గొంతులను నొక్కుతూ అధికార సుస్థిరతకు బిజెపి యత్నం

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** బిజెపి పాలనలో నిర్బంధం పెరుగుతుందని బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో ఒక పక్క హతమారుస్తూ మరో పక్క ప్రశ్నించే వారిని అర్బన్ నక్సల్స్ పేరుతో నిర్బంధాలకు గురి చేస్తున్నారని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కడం ద్వారా అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని బిజెపి భావిస్తుందని కూనంనేని తెలిపారు. ఖమ్మంలో జనవరి 18న జరగబోయే సభ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఓ మైలురాయిగా నిలవనుందని ప్రజా ఉద్యమాలకు కీలక మలుపు కానుందని ఆయన తెలిపారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ వందేళ్ల పోరాట చరిత్ర ఏ పార్టీకి లేదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆ తర్వాత తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు కీలక భూమిక పోషించారని ఆయన తెలిపారు. సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది అమరులయ్యారన్నారు. దేశంలో రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థి, యువజనులు, ఉద్యోగులు, ఇప్పటి సాఫ్ట్‌వేర్‌లు సహా ఎవరికి అన్యాయం జరిగినా వారి పక్షాన ఆలోచించేది, ఆందోళన చేపట్టేది కమ్యూనిస్టులేనన్నారు. దోపిడీ, పీడన వివక్షలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడుతున్నారన్నారు. ఇప్పుడు దోపిడీ తీరు మారిందని ఒకప్పుడు బ్లాక్ కాలర్ నేరాలు ఉంటే ఇప్పుడు వైట్ కాలర్ నేరాలు పెరిగిపోయాయని మనిషిని మనిషిగా నిలబెట్టి సర్వం దోచుకోవడం జరుగుతుందన్నారు. నవీన దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని కూనంనేని స్పష్టం చేశారు. కమ్యూనిస్టులకు నిర్బంధాలు కొత్త కాదని ఆవిర్భావం నుంచి నిర్బంధాలను ఎదుర్కొంటుందని ఆయన తెలిపారు. నిర్బంధాలు పెరిగిపోతున్నాయని పాలకులు ఎవరైనా ఒకే వైఖరిని అవలంభిస్తున్నారని హక్కులను హరిస్తూ స్వేచ్ఛను దూరం చేస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని పెట్టుబడిదారి దేశం అమెరికా నడిబొడ్డున యువత సోషలిజాన్ని కాంక్షిస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తుందంటే ప్రపంచ ప్రజల్లో వస్తున్న మార్పును గమనించవచ్చునని ఆయన తెలిపారు. అనేక దేశాలలో కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తున్నారని ఇది పురోగమనానికి సూచిక అన్నారు. ఈ నేపథ్యంలో వందేళ్ల పోరాట చరితను నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు ప్రజలను సంసిద్ధులను చేసేందుకు జనవరి 18న ఖమ్మంలో చారిత్రిక సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు సౌహార్ధ సందేశాలు ఇచ్చేందుకు దేశ విదేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా హాజరుకానున్నారని ఆయన తెలిపారు. 20న భారతదేశం వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సెమినార్‌లో ప్రధాన వామపక్షాల నేతలు డి.రాజా, ఎంఏ బేబీ, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య, జి.దేవరాజన్ తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. సిపిఐ జాతీయ కార్యవర్గ కౌన్సిల్ సమావేశాలు మూడు రోజులు ఖమ్మంలో జరగనున్నాయని తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.




### 20న ఖమ్మంలో సెమినార్

భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) శతవసంతాలను పురస్కరించుకుని ఈ నెల 20న ఖమ్మం పట్టణంలో 'ఇండియా టుడే, ఛాలెంజెస్ బిఫోర్ ద లెఫ్ట్ (వర్తమాన భారత దేశం వామపక్షం ముందున్న సవాళ్లు) 'అనే అంశంపైన సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు తెలిపారు. సిపిఐ శత వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈనెల 18వ తేదీన ఖమ్మం పట్టణంలో సిపిఐ లక్షలాది మందితో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని, ఈ సందర్భంగా ఈనెల 20న ఉదయం 10 గంటలకు ఖమ్మం పట్టణంలోని ఎస్.ఆర్ గార్డెన్స్‌లోని భవన్‌లో ఈ సెమినార్ నిర్వహిస్తున్నామని కూనంనేని సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెమినార్‌కు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ బేబీ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్.ఎస్.పి జాతీయ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ పాల్గొంటారని కూనంనేని తెలిపారు.

# ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలని వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టూరిజం డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ విరమణ వయసును 61 సంవత్సరాలకు పెంచాలని, మిగతా న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, తెలంగాణ ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి, సంస్కృతిక శాఖ అడ్వైయిజరి మెంబర్ పల్లె నరసింహతో కలిసి చాడ వెంకటరెడ్డి సచివాలయంలో టూరిజం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయష్ రంజన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాడ వెంకట రెడ్డి కాంట్రాక్ట్ ,ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వివరించారు. దీంతో జయేష్ రంజన్ స్పందిస్తూ టూరిజంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల అంశంపై బోర్డులో చర్చించామని తెలిపారు.

# ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా హైకోర్ట్ న్యాయవాది కడారు ప్రభాకర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా ప్రముఖ హైకోర్ట్ న్యాయవాది కడారు ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్. గోపాల్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో జరిగిన ఇస్కఫ్ రెండవ మహాసభలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. చెన్నైలో జరగనున్న ఇస్కఫ్ జాతీయ మహాసభలకు తెలంగాణ రాష్ట్రం నుండి 30 మంది ప్రతినిధులను ఎన్నుకున్నారు.

**నూతన కమిటీ :** అధ్యక్షునిగా కడారు ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.గోపాల్, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ సారంగపాణి, కె.బిక్షమయ్య, ఎస్ అరుణ్ కుమార్, వై.రాఘవరావు, వి.వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ డి.రాధాకృష్ణ, కార్యదర్శులుగా ఎన్.ఎస్ అర్జున్ కుమార్, ఎన్. రాజమౌళి, కొండపర్తి శ్రీనివాస్, మద్దినేని రమేష్ బాబు, వి కొండలరావు, ఎం.ఎ కరీం, కోశాధికారిగా అవ్వ విజయలక్ష్మి, మరో 20 మందితో కార్యవర్గ కమిటీని మహాసభ ఎన్నికున్నది.

**వెనుజులాపై దాడులను తక్షణమే ఆపండి : ఇస్కఫ్ తీర్మానం**

వెనుజులాపై అమెరికా దాడులను నిర్బంధాలను, ఆంక్షలను తక్షణమే నిలిపివేయాలని ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభ తీర్మానం చేసింది. పాలస్తీనా దేశానికి తక్షణమే స్వాతంత్ర్యాన్ని ప్రకటించాలని, ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను నిలిపివేయాలని, భారత వాణిజ్యంపై సుంకాలను విధించి, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసే అమెరికా ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కళాకారుల ప్రదర్శనలకు ఓపెన్ థియేటర్లను నిర్మించాలని ఇస్కఫ్ రాష్ట్ర మహాసభ తీర్మానించింది. కాగా మహాసభలకు ఇస్కఫ్ హైదరాబాద్ నగర అధ్యక్షులు కొండపర్తి శ్రీనివాసు వందన సమర్పణ చేశారు.

# తుది దశకు నూతన విత్తన చట్ట ముసాయిదా

## రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించనున్న నూతన విత్తన చట్ట ముసాయిదా తుది దశకు చేరుకుందని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి తెలిపారు. నకిలీ విత్తనాలను అరికట్టడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్కో సమస్యను పరిష్కారిస్తున్నామన్నారు. కోదండ రెడ్డి అధ్యక్షతన 'తెలంగాణ రాష్ట్ర విత్తన చట్టం ముసాయిదా' కమిటీ సమావేశం హైదరాబాద్‌లోని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, కమిషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డి, భవానీ రెడ్డి, రాములు, గోపాల్ రెడ్డి, భూమి సునీల్, వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి, కమిటీ సభ్యులు దొంతి నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శివ ప్రసాద్, మెంబర్ సెక్రెటరీ గోపాల్, అగ్రికల్చర్ అడిషనల్ డైరెక్టర్ నర్సింహారావు, కమిషన్ అధికారులు సంధ్యారాణి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన విత్తన చట్ట ముసాయిదాలపై చర్చించారు. కేంద్రం తీసుకొస్తున్న విత్తన చట్టంలో లోపాలు, రాష్ట్ర విత్తన చట్ట పరిధిలో లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి ఒక లక్షా పదివేల కోట్ల రూపాయాల ఆర్థిక సాయం చేసిందన్నారు. ములుగు జిల్లా ఆదివాసీ రైతులకు ప్రైవేట్ విత్తన కంపెనీలు నకిలి విత్తనాల అందించడంతో కమిషన్ చొరవ తీసుకుని ఆ కంపెనీల నుంచి రూ.4 కోట్ల పరిహారాన్ని అందేలా చేశామని వివరించారు. మిర్చి, పత్తి, వరి లాంటి విత్తనాలను విక్రయించే క్రమంలో రైతులు నష్టపోతున్నారని, ఇలాంటి అన్ని అంశాలనూ దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా కమిటీ వేసిందన్నారు. రాష్ట్ర పరిధిలో రూపొందించనున్న చట్టం విషయమై ఇప్పటికే వ్యవసాయ శాఖ మంత్రి వద్ద కూడా సమావేశం పుర్తయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ముసాయిదా చట్టం పూర్తిగా విత్తన కంపెనీలకు అనుకూలంగా ఉన్నదని, దీనిపైన కూడా చర్చించామని, తుది ముసాయిదాను తాము రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామన్నారు. గతంలో చాలా అధికారాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఉండేనని, కానీ గత ప్రభుత్వం కంపెనీలకు అధికారాలను కట్టాబెట్టిందని ఆయన ఆరోపించారు.

**కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర విత్తన చట్టం:అన్వేష్ రెడ్డి**

సిడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలనే ఉద్దేశంతోనే నూతన విత్తన చట్టాన్ని తీసుకురాబోతున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర పరిధిలోనే ఈ నూతన చట్టాన్ని తీసుకురానున్నామని, విత్తన చట్టం వస్తేనే రైతులకు రక్షణగా ఉంటుందని, తద్వారా రైతులు, విత్తనోత్పత్తి రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. నష్టపోతున్న రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించాలని గతంలో తాము పోరాటం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నూతన చట్ట రూపకల్పనలో భాగంగానే హర్యానా పర్యటనకు వెళ్లామన్నారు. గత ప్రభుత్వంలో జారీ చేసిన జిఒలు రైతులకు న్యాయం చేసే విధంగా లేదని ఆరోపించారు.


తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు పురపాలక ఇంజనీరింగ్ విభాగం
నెం.25/ఇఇ పిహెచ్/ఎస్ఆర్‌డి/ఎండికె/2025-26 తేదీ: 12.01.2026
టియుఐఎఫ్‌డిసి రుణ సహాయం కింద రూ.127.50 లక్షలు ఖరీదు చేసే 04 సంఖ్య గల అభివృద్ధి పనులను మెదక్ పురపాలకసంఘంలో చేపట్టేందుకు హైదరాబాద్ సంగారెడ్డి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (పిహెచ్) వారి నుండి టెండరు నోటీసుకు ఆహ్వానం.13.01.2026 @ సాయంత్రం 5.00 గంటల నుండి '@ 5.30 గంటల వరకూ టెండరు షెడ్యూలు సమయం. ఇతర వివరాలకోసం https://tender.telangana.gov.inలో చూడగలరు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (పిహెచ్)
ప్రజారోగ్యం, సంగారెడ్డి డివిజన్
DIPR R.O. No. : 13541-PP/CL/ADVT/1/2025-26, Date: 12-01-2026

hmda Growing Global
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.
2008 హెచ్‌ఎండిఎ చట్టంలోని 15(4) నిబంధన ప్రకారం బహిరంగ ప్రకటన
(జి.ఓ.ఎంఎస్.నెం.2 ఎంఎ&యుడి విభాగం., తేది: 03.01.2026)
03.04.2008 నాటి జి.ఓ.ఎంఎస్.నెం.288 ఎంఎ&యుడి. ప్రకారం గుర్తించిన బృహత్తర ప్రణాళిక ఆమోదించిన హుడా మాస్టర్ ప్లాన్‌లో భవిష్యత్ అవసరాల నిమిత్తం ఇందుమూలంగా ప్రభుత్వం ఈ క్రింది భూమి తనిఖీలు చేపడుతుంది. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ చట్టం 2008 (2008లో చేసిన చట్టంలో నెం.8) చట్టంలో పేర్కొన్న 15వ నిబంధనలోని ఉప నిబంధన (1) ప్రకారం ఈ భూమి తనిఖీలకు అధికారాలు దఖలు పరచడమైనది.
పైన పేర్కొన్న చట్టం కింద ప్రభుత్వం ఆమోదించిన హుడా మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా సర్వే నెంబరు 30లోని టిజిఐఐసి భూమి మధ్యభాగంలో నుండి వెళుతున్న ప్రస్తుతపు 30 మీటర్ల వెడల్పుగల బృహత్‌ప్రణాళిక రహదారిని పునఃసంలేఖనం చేయాలి. అనగా (తొలుత పేర్కొన్న ఎండిపి–2031 ప్రకారం)ఉస్మాన్‌నగర్ గ్రామం సర్వేనెంబరు 30లో వై జంక్షన్ ప్రారంభం నుండి మరియు గ్రామం వాటర్ ట్యాంక్ మేరకు టిజిఐఐసి భూమి తూర్పు సరిహద్దు వరకూ పునఃసంలేఖనం చేయవలెను. హెచ్‌ఎండిఎ మాస్టర్ ప్లాన్‌లో పేర్కొన్నవిధంగానే మాస్టర్ ప్లాన్ రోడ్డులాగా ఇప్పుడు డిజైన్ చేయాలి.
పైన చెప్పిన వివరాలు అన్నీ http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్లలో లభ్యమగును.
సం/- ప్రధాన ప్రణాళికా అధికారి (పిఆర్)
హెచ్‌ఎండిఎ
DIPR R.O. No. : 13608-PP/CL/ADVT/1/2025-26, Date: 12-01-2026


# రాముడికి బిజెపి సభ్యత్వం ఇచ్చిందా?

## టిపిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాముడు బిజెపి పార్టీలో సభ్యత్వం తీసుకున్నాడా? ఎన్నికలొస్తే దేవుడి పేరుతో ఓట్లు అడిగే హక్కు బిజెపికి ఎవరిచ్చారని, మేము పూజ చేసుకొనిదే ఇంటి నుంచి బయటకు రామని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ అధ్యక్షులు నగేష్‌రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రియాంక గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ జెండా ఎగురవేయనున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధితోనే మేము ధీమా వ్యక్తం చేస్తున్నానని, డీఎస్ హయాంలోనే నిజామాబాద్‌లో మేయర్ సీటు కైవసం చేసుకున్నామని, ఈసారి మేయర్ సీటు మాదేనన్నారు. ఎలాంటి బంధు ప్రీతి చూడకుండా ప్రజలు కోరుకున్న వాళ్లకు మాత్రమే బి ఫాం ఇస్తామని చెప్పారు. దేశంలో ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత మోడీ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. అన్నిపథకాల్లో మాట వాటా ఉన్నందున బిజెపి వారు గెలిచిన రాష్ట్రాలలో ఎందుకు మేము ఇస్తున్న సంక్షేమ పథకాలు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. 12 ఏళ్లు ప్రజలు అవకాశమిస్తే బిజెపి ఏం అభివృద్ధి చేసిందని ఎద్దేవా చేశారు. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ కోసం కృషి చేస్తున్నామని త్వరలో ఆ కళ నెరవేరుతుందన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ఎన్ని పార్టీలైన రావచ్చని, ప్రజాస్వామ్యంలో ప్రజల ఆదరణ పొందాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, నుడా చైర్మన్ కేశ వేణు, నగర అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, సేవలాల్ అధ్యక్షులు వైశాక్షి సంతోష్, మాజీ మేయర్ ఆకుల సుజాత, రత్నాకర్, జావిద్ అక్రమ్,శ్రీశైలం,నాయకులు పాల్గొన్నారు.


ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా – ఎదురుబెదురూ లేక..
చలో ఖమ్మం

2026 జనవరి 18
సిపిఐ శతవార్షికోత్సవ సభకు
వేలాదిగా తరలి రండి!


# చీలిక తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం

పార్టీలో చీలిక అనంతరం సిపిఐ 7వ కాంగ్రెస్ 1964 డిసెంబర్ 13–23 తేదీల్లో బొంబాయిలో జరిగింది. పార్టీలో చీలిక కమ్యూనిస్టు ఉద్యమానికి అతి తీవ్రమైన హాని చేసిందని మహాసభ తీర్మానించింది. 'జాతీయ ప్రజాతంత్ర విప్లవం (నేషనల్ డెమోక్రటిక్ రివల్యూషన్) అనే ధ్యేయంతో కొత్త కార్యక్రమాన్ని ఆమోదించింది. మావోయిజాన్ని, భారత్‌పై చైనా దురాక్రమణ యుద్ధాన్ని ఖండించింది. చైర్మన్‌గా డాంగేను, ప్రధాన కార్యదర్శిగా చంద్ర (సి) రాజేశ్వరరావును ఎన్నుకుంది.

కాగా పార్టీని చీల్చినవారు పశ్చిమ బెంగాల్‌లో మహాసభ జరుపుకుని తమ పార్టీ పేరును సిపిఐ (మార్క్సిస్టు)గా ప్రకటించారు. పుచ్చలపల్లి సుందరయ్యను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొని కలకత్తాలో కేంద్ర కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. జనతంత్ర ప్రజాస్వామ్యం (పీపుల్స్ డెమోక్రసీ) స్థాపన రాజకీయ గమ్యంగా ప్రకటించారు. సాయుధ పోరాట మార్గాన్ని నొక్కి చెప్పారు. కార్మికవర్గ నియంతృత్వ భావనను పునరుద్ధరించారు. కాంగ్రెస్ ప్రధాన శత్రువుగా రాజకీయ కార్యాచరణ చేబట్టారు. అభివృద్ధి నిరోధక శక్తుల ఎదుగుదలను అరికట్టడం, కాంగ్రెస్‌తో 'ఐక్యత– పోరాటం' పంథాను సిపిఐ చేబట్టగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎవరితోనైనా కలిసే పంథాను సిపిఐ(ఎం) అనుసరించింది. ఆ విధానంతోనే 1977 లోక్‌సభ ఎన్నికల్లో జన సంఘ్ భాగస్వామిగా ఉన్న జనతా దళ్‌తో కలిసి పోటీ చేసింది. అంతకుముందు 1967 ఎన్నికల అనంతరం బిహార్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో సిపిఐ– బిజెపితోపాటు సంయుక్త విధాయకదళ్ మంత్రి వర్గాల్లో చేరింది.

చీలిక అనంతరం సిపిఐ, సిపిఐ(ఎం)ల మధ్య కొన్ని సంవత్సరాల పాటు ఎండు గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి. ఉభయులూ పార్టీ పేరుతో పిలుచుకునే వారు కాదు. సిపిఐని 'రివిజనిస్టులని' చీలిన పార్టీ వారు సంబోధిస్తే, వారిని 'పిడివాదులని' సిపిఐ వారు పిలిచేవారు. నాలుగైదు సంవత్సరాల తరువాతగాని రెండు పార్టీలవారూ వాటి అధికారిక నామధేయాలతో సంబోధించుకోవాలని నిర్ణయించారు. దాయాదివైరం లాగా పలుచోట్ల కొట్లాటలు కూడా జరిగాయి. కాగా సిపిఐ(ఎం)లోని అతివాదులు పార్టీ నాయకత్వాన్ని 'నయా రివిజనిస్టులు' అని నిందిస్తూ పార్టీ నుంచి వైదొలిగి ఆయుధాలు చేపట్టారు. పీపుల్స్ వార్ గ్రూపు ఆ రోజుల్లో వారిలో పెద్దది. దానిలోనుంచి, నక్సల్ బరీ ఉద్యమం నుంచీ అనేక చీలిక గ్రూపులు ఏర్పడ్డాయి. కొన్ని అంతరించాయి. సిపిఐ (మావోయిస్టు) పెద్ద గ్రూపుగా సాయుధ పోరాటం సాగిస్తోంది. దీనినే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పుడు ఆపరేషన్ కగార్ పేరుతో 'నిర్మూలన' కార్యక్రమం జరుపుతోంది. బహిరంగంగా పనిచేస్తున్న గ్రూపుల్లో సిపిఐ (ఎం.ఎల్) లిబరేషన్) పెద్దది. కమ్యూనిస్టు ఉద్యమానికి సాంప్రదాయకంగా బలమైన కేరళ, పశ్చిమబెంగాల్, త్రిపురల్లో ఉమ్మడి పార్టీలో మూడొంతులు సిపిఐ(ఎం)తో వెళ్ళింది. ఆంధ్రప్రదేశ్‌లో చెరి సమానంగా చీలింది. ఉత్తరోత్తరాపై మూడు రాష్ట్రాల్లో సిపిఐ(ఎం) సిపిఐతో కలిసి వామపక్ష–ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వాలు నడిపింది. ఇప్పుడు ఒక్క కేరళలోని కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నారు. అయితే విశాల భారతంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దాదాపు అన్ని రాష్ట్రాల్లో అస్తిత్వంలో ఉన్నది అప్పటికీ ఇప్పటికీ భారత కమ్యూనిస్టు పార్టీయే(సిపిఐ). కమ్యూనిస్టు ఉద్యమంలో చీలిక పర్యవసానంగానూ, మారిన అంతర్జాతీయ, జాతీయ పరిస్థితుల్లోనూ కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిన మాట యదార్థం. వామపక్ష పార్టీలు ఉమ్మడిగా, విడివిడిగా ప్రజల నోట్లో నాలుకలా ఎదగటం గూర్చి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. కేంద్రంలో అధికారం చేజిక్కించుకున్న బిజెపి–ఆర్ఎస్ఎస్ సంపూర్ణ అధికారానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. వాటిని నిఖరంగా–సిద్ధాంతికంగా, నిర్మాణారీత్యా ఎదిరించగలిగింది కమ్యూనిస్టులే.

పార్టీ చీలిక అనంతరం ఉభయ కమ్యూనిస్టు పార్టీలకూ విజయాలు, ఎదురుదెబ్బలు రెండూ ఉన్నాయి. 1969లో కాంగ్రెస్ సంక్షోభంలో రాష్ట్రపతిగా వి.వి.గిరి ఎన్నికలో రెండు పార్టీలూ కాంగ్రెస్‌తో కలిసి పని చేశాయి. ఎమర్జెన్సీలో భిన్న వైఖరులు తీసుకున్నాయి. ఎమర్జెన్సీని బలపరచడం తప్పు అని సిపిఐ భటిండా కాంగ్రెస్ (1978) అంగీకారానికి వచ్చింది. సిపిఐ ఖలీస్తానీ వేర్పాటువాదాన్ని గట్టిగా వ్యతిరేకించింది. దాని 13వ కాంగ్రెస్ (పట్నా, 1986) "సూత్రబద్ధ ప్రాతిపదికపై కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణ"కు పిలుపుఇచ్చింది. అంతకుముందు 12వ కాంగ్రెస్ (వారణాసి–1982) చైర్మన్ పదవిని రద్దు చేసింది.. సి.ఆర్‌ను ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకుంది.

కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో 1996లో దేవగౌడ నాయకత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఇంద్రజిత్‌గుప్త, చతురానన్ మిశ్రా చేరారు. కేంద్రంలో కమ్యూనిస్టులు మంత్రివర్గంలో భాగస్వాములు కావటం అదే ప్రథమం. ప్రధానమంత్రి పదవికి తొలుత సిపిఐ(ఎం) నేత జ్యోతిబసు పేరు ప్రతిపాదనకు వచ్చింది. అయితే 'కార్మికవర్గ నాయకత్వ ఆధిపత్యం' పంథా అడ్డుపడింది. సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. దాన్ని 'చారిత్రక తప్పిదం'గా ఆ తర్వాత జ్యోతిబసు వ్యాఖ్యానించారు. ఆ తర్వాత 1998లో బిజెపి నేత ఎ.బి.వాజ్‌పేయి ప్రధాని పదవి చేబట్టారు. 1996లో తొలిసారి బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు నిరాకరించిన ప్రాంతీయ పార్టీలు, 1998లో ఆ పార్టీ తమ ఎజెండాలోని వివాదాస్పద అంశాలు (అయోధ్యలో రామాలయ నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌరస్మృతి) పాలన ఎజెండా నుండి వెనక్కుపెట్టేందుకు అంగీకరించినందున తోడ్పాటు ఇచ్చాయి. సంవత్సరంలో ఆ ప్రభుత్వం జయలలిత తోడ్పాటు ఉపసంహరణ కారణంగా కూలిపోగా 1999లో మళ్ళీ ఎన్నికలు వచ్చాయి. ఈసారి వాజ్‌పేయి ప్రభుత్వం నాలుగేళ్ళకు పైగా పనిచేసి 'దేశం వెలిగిపోతోంది' అంటూ ముందస్తు ఎన్నికలకు వెళ్లగా ప్రజలు తిరస్కరించారు. 2004 ఆరంభంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకు సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి హరికిషన్‌సింగ్ సూర్జిత్, సిపిఐ ప్రధాన కార్యదర్శి ఎ.బి.బర్దన్ గట్టిగా కృషిచేశారు. డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. సోనియాగాంధీ చైర్మన్‌గా యుపిఎ సమన్వయ కమిటీలో కమ్యూనిస్టు పార్టీలు భాగస్వాములైనాయి. కాగా 2008లో అమెరికాతో అణుశక్తి సహకార ఒప్పందం తదితర అంశాలతో విభేదించిన ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తోడ్పాటు ఉపసంహరించుకున్నాయి. 2014లో కాంగ్రెస్ అధికారాన్ని బిజెపికి అప్పగించింది. ఇది అధికారం ఒక బూర్జువా పార్టీ నుంచి మరో పార్టీకి బదలాయింపు వంటిది కాదని సిపిఐ విశ్లేషించింది. అందువల్ల ఈ ఫాసిస్టు తరహా పాలనను అంతమొందించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకికశక్తులన్నీ ఐక్యంగా కృషి చేయాలని పిలుపుఇచ్చింది. గత ఎన్నికల్లో ఏర్పడిన 'ఇండియా కూటమి' అటువంటి ప్రయత్నంలో భాగమే. అందువల్ల మారిన రాజకీయ పరిస్థితుల్లో కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత, ఐక్య కార్యాచరణకు విశేష ప్రాధాన్యత ఉంది.

సిపిఐ ప్రధాన కార్యదర్శిగా 1964లో బొంబాయి కాంగ్రెస్‌లో ఎన్నుకోబడిన సి.రాజేశ్వర రావు 1990లో (7–నుంచి 14వ కాంగ్రెస్ తదుపరి సంవత్సరం వరకు) స్వచ్ఛంద విరమణతో ఇంద్రజిత్ గుప్తా ఆయన స్థానంలోకి వచ్చి 1996 వరకు కొనసాగారు. గుప్తా కేంద్ర హోంమంత్రి పదవి చేపట్టిన దరిమిలా తాత్కాలికంగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎ.బి. బర్దన్ 1998లో చెన్నైలో పార్టీ 17వ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడి 2012 వరకు కొనసాగారు. ఎ.బి.బర్దన్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టాక డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎన్నుకోబడిన నల్లమల గిరిప్రసాద్ 1997మే 24న అకాల మరణం చెందారు. 2008 మార్చి నుండి డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్న సురవరం సుధాకరరెడ్డి 2012లో పాట్నాలో 21వ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 2019 జులై వరకు కొనసాగారు. ఆ స్థానంలోకి జాతీయ సమితి ఎన్నుకున్న డి.రాజా ఆ తదుపరి 2022లో విజయవాడ (24వ కాంగ్రెస్), 2025లో చండీఘడ్ (25వ కాంగ్రెస్)లో ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికై ప్రస్తుతం పార్టీకి సారథ్యం వహిస్తున్నారు.

– ఎమ్మెస్సార్

### సిపిఐ ప్రధాన కార్యదర్శులు


రాజేశ్వరరావు


ఇంద్రజిత్ గుప్తా


ఎబి బర్దన్


ఎస్.సుధాకరరెడ్డి


డి.రాజా


నల్లమల గిరిప్రసాద్
డిప్యూటీ జనరల్ సెక్రటరీ



## ‘ప్రజాపక్షం’ నిత్యం ప్రజల పక్షమే

**ప్రజాపక్షం/వేములపల్లి:** ప్రజాపక్షం దినపత్రిక నిత్యం ప్రజల కోసం ప్రజల పక్షం పనిచేస్తుందని ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ప్రజాపక్షం 2026 క్యాలెండర్ ఆయన సిపిఐ జిల్లా సమితి సభ్యులు జిల్లా యాదగిరి,టిడిపి రాష్ట్ర నాయకులు జడ రాములు యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలికాంతరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలికితీస్తూ విద్యా, వైద్యం, ఉపాధి రంగాలపై సంక్షిప్త సమాచారం సేకరిస్తూ ప్రజలకు ప్రభుత్వ అధికారులకు వారధిగా పనిచేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బిటి నాయక్,సిబ్బంది ఎస్.కె మదర్ హుస్సేన్, శ్రీనివాస్,సుధాకర్,మహేష్ ప్రజాపక్షం విలేఖరి పి. నాగయ్య పాల్గొన్నారు.

### ప్రజాగొంతుక ‘ప్రజాపక్షం’ : తహశీల్దార్ వాజిద్అలీ



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** ప్రజలకు ప్రభుత్వానికి వారిధిగా ఉంటూ ప్రజాగొంతుకగా నిలుస్తున్న ప్రతిక ప్రజాపక్షమని తహశీల్దార్ వాజిద్అలీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహశీల్దార్, డిప్యూటి తహశీల్దార్ సంధ్యారాణితో కలిసి ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు మెరుగైన సమాచారాన్ని అందిస్తూ చట్టంపట్ల, సమాజం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శైలజ, ఆర్ఐలు రాజేష్, జగదీష్, రికార్డు అసిస్టెంట్ అరవింద్, ప్రజాపక్షం మండల రిపోర్టర్ గెల్లా పవన్ కుమార్, అమెరబోయిన వీరబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల శ్రమ వెలకట్టలేనిది



**ప్రజాపక్షం/నకిరేకల్ :** పారిశుద్ధ్య కార్మికుల శ్రమ, సేవలు వెలకట్టలేనివని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. సోమవారం నకిరేకల్ సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను పెంచిన సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆయన అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత నిర్వహణలో పారిశుధ్య కార్మికుల సేవలు అనిర్వచనీయమని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈకార్యక్రమంలో నకిరేకల్ మున్సిపాలిటీ చైర్మన్ చౌగోని రజితశ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రంజిత్ కుమార్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు స్థానిక కౌన్సిలర్లు గాజుల సుకన్య,రాచకొండ సునీల్, ఘర్షకోటి సైదులు పాల్గొన్నారు.

## ఆదివాసుల సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివాసి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శంకర్‌నాయక్‌ను సోమవారం గిరిజన ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసులు కొండ ప్రాంతాల్లో నివసిస్తూ ప్రత్యేక సంస్కృతులు, సాంప్రదాయాలు కలిగి ఉంటారన్నారు. అదేవిధంగా గిరిజన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.కృష్ణకాంత్‌నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బాణావత్ సైదులు, రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాంనాయక్, ఎఫ్ఏవో బాలాజీనాయక్, మండల విద్యాధికారులు మంగనాయక్, లక్ష్మణ్‌నాయక్, వెంకన్ననాయక్ తదితరులు ఉన్నారు.

## సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఫిర్యాదుదారుల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలను ఆరా తీశారు. చట్టాన్ని అమలుపరచడంలో ఎలాంటి అలసత్వం చూపరాదని, ప్రతి కేసును పారదర్శకంగా ఇన్విస్టిగేషన్ చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లాలో చైనా మాంజా అమ్మకాలు పూర్తిగా నిషేధించడం జరిగిందిని వీటిపై జిల్లా పోలీసు శాఖ పటిష్టంగా నిఘా ఉంచి ఉక్కుపాదం మోపుతుందని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని, అక్రమంగా చైనామాంజా అమ్ముతున్న ఆరుగురు వ్యక్తులపై ఆరు కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. మాంజా అమ్ముతూ పట్టుబడినట్లైతే అలాంటి వారిపై సస్పెక్ట్ షీట్స్ నమోదు చేయడము, బైండోవర్ చేయడం లాంటి చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎవరు కూడా చైనామాంజా అమ్మకూడదని, తల్లిదండ్రులు పిల్లలకు కొనివ్వకూడదని కోరారు.

## గ్రామాల అభివృద్ధికి సహకారం



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ మండలంలోని వెంకట్‌తండాలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధుల నుండి రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం ప్రజా ప్రతినిధులు, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి జరుగుతుందని అన్నారు. గ్రామల అభివృద్ధికి పాటు పడుతానని, ప్రతి గ్రామంలో బడి, గుడి అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేనావత్ భీముడు, విద్యుత్ డిఈ బాల్యనాయక్, ఏడి సైదులు, ఏఈ రాజేష్ పాల్గొన్నారు.

# సబ్సిడీపై వ్యవసాయిక యంత్రాల పరికరాలు

### బిసి మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం

### ఆలేరు మార్కెట్ యార్డులో రైతులకు యాంత్రిక పరికరాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీర్ల, ఎంపి చామల



**ప్రజాపక్షం/ఆలేరు :** వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవివై) పథకం ద్వారా ఆలేరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యాంత్రిక పరికరాలు సోమవారం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, బీర్ల అయిలయ్య, ఎంపీ చామల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మొత్తం రూ.1.27 కోట్ల యాదాద్రి జిల్లాకు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆలేరు నియోజకవర్గానికి 56 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పథకం కింద చిన్న, సన్నకారు రైతులు తమ స్వంత వ్యవసాయ క్షేత్రాల్లో ఉపయోగించుకునేందుకు టిల్లర్లు, కల్టివేటర్లు, రోటావేటర్లు తదితర వ్యవసాయ యంత్రాలను అందజేశారు. కూలీల కొరత సమస్యను అధిగమించి రైతులు స్వయంగా సాగు పనులు చేసుకునేలా ఈ పథకం దోహదపడుతుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు, మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా నిలబడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. గతంలో నిర్లక్ష్యం చేసిన వ్యవసాయ యాంత్రిక సబ్సిడీలను తిరిగి ప్రవేశపెట్టి రైతులకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. బిసి మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం వరకు సబ్సిడీతో యంత్రాలు అందిస్తున్నామని ఆలేరు ఎమ్మెల్యే, ఎంపీ ఆలేరు నియోజకవర్గంలో ప్రతి చెరువుకు నీరు వచ్చేలా ఇరిగేషన్ మంత్రి వద్ద నిరంతరంగా పోరాటం చేస్తున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జనగాం ఉపేందర్ రెడ్డి, చింతల ఫణి శ్రీనివాస్ రెడ్డి, గాజుల దశరథ, బంద్రు జహంగీర్, పత్రె రమేష్, కర్రె అజయ్ పాల్గొన్నారు.

**కొలనుపాక సోమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై సమీక్ష**

యాదాద్రి జిల్లా ఆలేరు నియోజకవర్గం లోని ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో కొలువై ఉన్న సోమేశ్వర ఆలయంలోని సోమేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అనంతరం ఆలయంలో కలియతిరిగి ఆలయంలోని పరిసరాలపై ఆలయ అభివృద్ధి పై తీసుకోవలసిన జాగ్రత్తలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు పాల్గొన్నారు. ఆలయ సౌందర్యవర్ధనం, భక్తులకు సౌకర్యాలు, మౌలిక వసతుల మెరుగుదల, రహదారులు, పారిశుధ్యం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఆలయ చారిత్రక ప్రాధాన్యతను కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలని వారు సూచించారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందించి, కొలనుపాక శ్రీ సోమేశ్వర ఆలయాన్ని భక్తుల ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.



## సిపిఐ బహిరంగ సభకు కదం తొక్కుదాం

**ప్రజాపక్షం/డిండి:** జనవరి 18న ఖమ్మం నగరంలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వందేళ్ళ ముగింపు బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి జరిగిన రహమంతాపూర్ గ్రామశాఖ సమావేశానికి హాజరైన బుచ్చిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు అండ సిపిఐ జెండా, దున్నేవాడికి భూమి నినాదంతో లక్షలాది ఎకరాలు పేదలకు పంచిన ఘనమైన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని అన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక భూస్వామ్య పెట్టుబడిదారు వర్గాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్వహించి చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని అన్నారు. తూం కొండల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, మండల కార్యవర్గ సభ్యులు శ్రీనయ్య, శాఖ కార్యదర్శి శివ, సర్పంచ్ రాములమ్మ, ఉప సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

# బర్మా దొంగల ముఠా అరెస్టు

### రూ. 60 లక్షల విలువగల సొత్తు స్వాధీనం...

### 48 గంటల్లో కేసును ఛేదించిన రూరల్ పోలీసులు..

### దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలే :అడిషనల్ ఎస్‌పి



**ప్రజాపక్షం/నల్లగొండ :** బర్మాదేశం నుండి ఇండియాకు శరణార్థులుగా వచ్చి దొంగతనాలు చేస్తున్న ముఠాను నల్లగొండ రూరల్ పోలీసులు వాహన తనిఖీలో నిందితులను పట్టుబడి చేసి అరెస్టు చేసినట్లు జిల్లా అడిషనల్ ఎస్‌పి జి. రమేష్ తెలిపారు. సోమవారం నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దొంగల ముఠా సభ్యులను ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ 2013 సంవత్సరంలో బర్మా దేశం నుండి ఇండియాకు శరణార్థులుగా వచ్చి హైదరాబాదులోని బాలాపూర్ లో గల రాయల్ కాలిలో నివాసం ఉంటున్నారని వీరు ముఠాగా ఏర్పడి తాగుడుకు జల్సాలకు అలవాటు పడి ఎక్కువ డబ్బులు సంపాదించాలని అందరూ కలిసి పట్టణ శివారులోని కంపెనీలలో విలువైన వస్తువులను దొంగతనాలు చేస్తూ అట్టి వస్తువులను స్క్రాప్ షాపులకు అమ్మి వచ్చిన డబ్బులను జల్సాలకు వాడుకుంటూ జీవితం కొనసాగిస్తున్నారని తెలిపారు.ఈక్రమంలో ఈనెల 7న ముగ్గురు నిందితులు నల్లగొండ పట్టణ పరిధిలోని ఆర్జాల బావి శివారులోని నిధి పైపుల కంపెనీలో సెక్యూరిటీ గార్డు లేకుండా గేటుకు తాళం వేసి ఉండడానికి గమనించి అందరూ కలిసి గేటు తాళం పగలగొట్టి లోపలికి వెళ్లి పైపుల తయార్కు వాడే ఇత్తడి సైజర్లను అమరాన్ కంపెనీకి చెందిన బ్యాటరీలను బంచ్ కేబుల్ రాగి కాపర్ తదితర వస్తువులను దొంగిలించి దొంగలించిన సొత్తును కంప్లీట్ దగ్గరలో ఉన్న చెట్ల పొదలలో దాసి ఈనెల 12న హైదరాబాద్కు తరలించేందుకు ఆటోలో వెళుతుండగా బుద్ధారం రోడ్డులో చర్లపల్లి గ్రామ శివారులో టూటౌన్ సర్కిల్ సిఐ ఎస్ రాఘవరావు,రూరల్ ఎస్ఐ సైదా బాబు తన సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఆ నిందితులు ఆటో ఆపకుండా తప్పించుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు వెంబడించి ముగ్గురు నిందితులను పట్టుబాడు చేసి వారి వద్దనున్న సొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగిందని వీటి విలువ సుమారు 60 లక్షల పైగా ఉంటుందని తెలిపారు. నిందితులు బర్మాకు చెందిన హమీద్ హుస్సేన్, జహంగీర్ అలం, షఫీ అలములుగా గుర్తించడం జరిగిందని మరో నిందితుడు పరారీలో ఉన్నాడని వీరందరూ గతంలో మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని అన్నారు. నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి పర్యవేక్షణలో దొంగలను చాకచక్యంతో పట్టుబడి చేసిన సిఐని, రూరల్ ఎస్ఐని సిబ్బందిని అభినందించారు.



## మున్సిపల్ బరిలో 'ఎర్రజెండా' సిద్ధం!

### సిపిఐ రాష్ట్ర నేత గోద శ్రీరాములు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** రాబోయే మున్సిపల్ ఎన్నికల సమరానికి సిపిఐ పార్టీ సమరశంఖం పూరించింది. ఎన్నికల్లో పోటీకి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. సోమవారం యాదగిరిగుట్ట మున్సిపల్ శాఖ కమిటీ సమావేశం మాటూరి మల్లయ్య అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గోద శ్రీరాములు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ స్థాయి నుండి నేటి మున్సిపాలిటీ వరకు యాదగిరిగుట్ట అభివృద్ధిలో ప్రజా సమస్యల పరిష్కారంలో సిపిఐ కీలకపాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో పొత్తు ఉంటే 5 స్థానాల్లో, ఒకవేళ పొత్తు కుదరని పక్షంలో అన్ని 12 వార్డులలో ఒంటరిగా పోటీ చేయడానికి సిపిఐ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అనేక ఉద్యమాల ద్వారా ప్రజలకు అండగా నిలిచిన చరిత్ర తమ పార్టీదని, రాబోయే ఎన్నికల్లోనూ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలో సిపిఐ పార్టీ అనేక ఉద్యమాలు చేసి ప్రజా సమస్యలపై పోరాడింది. ప్రజల పక్షాన నిలిచే వారికే ఓటర్లు పట్టం కడతారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బుల్ శ్రీధర్ పాల్గొన్నారు.

# వైద్యులు, మందులు అందుబాటులో ఉండాలి

### ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి నరసింహ్మాతో కలిసి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా ఎస్‌పి కె నరసింహతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా సూర్యాపేట జిల్లాలోని జాతీయ రహదారి 65 మీదుగా ఎక్కువ వాహనాలు ప్రయాణం చేస్తున్నాయని అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే తక్షణమే వైద్య సేవలు అందించేలా అన్ని రకాల వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఫార్మసి స్టోర్ పరిశీలించి అన్ని రకాల మెడిసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలని, మెడిసిన్స్ అయిపోక ముందే తెప్పించుకోవాలని సూచించారు. ఏ రకమైన జబ్బుతో ఇబ్బందిపడుతున్న వారు ఓపి సేవలు తీసుకుంటున్నారని కలెక్టర్ వైద్యులను అడుగగా సాధారణ జ్వరం, జలుబుతో ఇబ్బందిపడుతున్న వారు ఎక్కువగా వస్తున్నారని వైద్యులు వివరించారు. హాస్పటల్‌కు వచ్చిన సందర్శకులను వైద్యసేవలు మంచిగా అందిస్తున్నారా, మందులు ఇస్తున్నారా అని అడుగగా మంచిగా వైద్య సేవలు అందిస్తున్నారని అలాగే మందులు ఇస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓలు గీత, వాణి, వినయ్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## ట్రాక్టర్-ట్రాలీ దొంగతనం కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్



**ప్రజాపక్షం/నకిరేకల్ :** కేతేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగినట్రాక్టర్ ట్రాలీ దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, ట్రాక్టర్, ట్రాలీ, పత్తి లోడ్ నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శివరాం రెడ్డి వెల్లడించారు. సోమవారం నకిరేకల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.రైతు పత్తిని మార్కెట్‌కు తరలించేందుకు 08.01.2026 రాత్రి కేతేపల్లి గ్రామంలో పార్క్ చేసిన ట్రాక్టర్ (టిఎస్05ఈటి 1137), ట్రాలీ (టిఎస్05ఈటి 1138)తో పాటు సుమారు 25 క్వింటాల పత్తిని దొంగలు అపహరించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు,సాంకేతిక ఆధారాలతో నూకల కోటేశ్, ఆడెప సాయి కుమార్‌లను గుర్తించి అరెస్ట్ చేసినట్లు అని తెలిపారు.నిందితులు దొంగిలించిన పత్తిలో కొంత భాగాన్ని అమ్మి రూ.72,475 పొందగా, మిగిలిన పత్తిని అమ్మేందుకు వెళ్తుండగా ఇనుపాముల గ్రామ శివారులో పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి ట్రాక్టర్,ట్రాలీ,మిగిలిన పత్తి లోడ్‌తో పాటు రూ.50,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శాలిగౌరారం సిఐ కె. కొండల్ రెడ్డి,కేతేపల్లి ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

## హాలియా మున్సిపల్ ఫైనల్ ఓటర్ జాబితా సిద్ధం



**ప్రజాపక్షం/హాలియా:** హాలియా మున్సిపాలిటీ ఫైనల్ ఓటర్ జాబితా సిద్ధమైంది. ప్రజల నుండి అభ్యంతరాలు స్వీకరించి అనంతరం ఫైనల్ ఓటర్ జాబితాను సిద్ధం చేసి హాలియా మున్సిపాలిటీలో అందుబాటులో ఉంచారు. సిద్ధమైన ఓటర్ జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో విషయాన్ని పరిశీలించుకునేందుకు ఓటర్లు సోమవారం హాలియా మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చారు. మొత్తం హాలియా మున్సిపాలిటీలో 12 వార్డులు ఉండగా మొత్తం 12, 801 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 6,270,మహిళా ఓటర్లు 6529 మంది ఓటర్లు ఉన్నారు. కొన్ని వార్డుల్లో వేయి ఓట్లు ఉండగా మరికొన్ని వార్డుల్లో 950 పైగా ఓట్లు ఉన్నాయి. హాలియా మున్సిపాలిటీలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 250 పైచిలుకు ఎక్కువ ఉన్నారు. మరో వారం రోజుల్లో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని ఊహాగానాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుండడంతో ఆశావాహుల్లో ఉత్కంఠ పెరిగిపోతుంది. హాలియా మున్సిపల్ చైర్మన్ ఏ సామాజిక వర్గానికి రిజర్వ్ అవుతుందో తెలుసుకోవాలని ఆత్రుత ఆశావాహుల్లో పెరిగిపోతుంది. నోటిఫికేషన్ వచ్చిన ఒకటి రెండు రోజుల్లోనే రిజర్వేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమై వార్డుల వారిగా రిజర్వేషన్లు ప్రకటించనున్నట్లు తెలుస్తుంది. ఏదేమైనా మున్సిపల్ ఎన్నికల వేడి అప్పుడే ప్రారంభం కావడంతో సంక్రాంతి సంబరాలకు ఉత్సాహం మరింత రెట్టింపు కానుంది.

# దళిత,గిరిజనుల స్మశాన వాటికను తోడేస్తున్నారు...

### స్మశాన వాటికను కాపాడా తమకు న్యాయం చేయాలిని శేషమ్మగూడెం ఎస్‌టి కాలనీకి చెందిన దళిత, గిరిజనులు తవ్వకాలు అడ్డుకొని జెసిబికి అడ్డంగా నిరసన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎస్‌సి,ఎస్‌టిలకు చెందిన స్మశాన వాటికలో అక్రమంగా మట్టిని తోడుతున్న దానిని నిలుపుదల చేసి,వారిపై చట్టరీత్యా తీసుకొని స్మశాన వాటికను కాపాడి తమకు న్యాయం చేయాలని పట్టణంలోని మూడో వార్డు శేషమ్మ గూడెం ఎస్‌టి కాలనీకి చెందిన దళిత,గిరిజనులు జిల్లా అధికారులను కోరారు.సోమవారం పట్టణ పరిధిలోని మూడో వార్డు శేషమ్మ గూడెం ఎస్‌టి కాలనీలో గల ఎస్‌సి మాల, మాదిగ,ఎరుకల కులాలకు చెందిన స్మశాన వాటికలో గుట్టుచప్పుడు కాకుండా జెసిపిలతో అక్రమంగా తవ్వకాలు జరిపి ఆ మట్టిని తరలించడంతో తవ్వకాలు నిలిపివేలని జెసిపిలకు అడ్డంగా నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దళిత,గిరిజనులకు చెందిన ఈస్మశాన వాటికలో గత 30 సంవత్సరాలు నుండి మా పూర్వీకులకు అంత్యక్రియ నిర్వహించి ఇక్కడనే సమాధి చేయడం జరిగింతుంది.20 సంవత్సరాల క్రితం ఈస్మశాన వాటిక చుట్టూ ఫినిషింగ్ నిర్మించి మా కులాలలో ఎవరు చనిపోయిన ఇక్కడే సమాధి చేస్తున్నామని కొంతమంది అక్రమంగా రాత్రి సమయాల్లో జెసిపిలతో మట్టిని తవ్వితరలిస్తున్నారని ఇట్టి విషయంపై వారిని నిలదీయగా వారు ఒక్కడి నుంచి వెళ్ళిపోయి రాత్రి సమయం కాగానే మళ్లీ తవ్వకాలు జరుపుతున్నారని తెలిపారు.మళ్లీ తోకాలు ఎందుకు జరుపుతున్నారని ప్రశ్నించగా తమ పైన కేసులు బనాయించి భయాందోళన గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తమ స్మశాన వాటికలో అక్రమ తవ్వకాలు నిలిపివేసి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ కుమార్,రాములు, నాగేష్,రామచంద్రు,మహిళలు,యువకులు తదితరులు ఉన్నారు.

## హిందీ రుద్దారో... తస్మాత్ జాగ్రత్త

బిహార్, యుపి ప్రజలకు రాజ్‌ఠాక్రే హెచ్చరిక

**ముంబయి:** బృహత్ ముంబై మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మహారాష్ట్రలో రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం మాటల దాడి చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్ ఠాక్రే హిందీ భాషపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీహార్, యూపీ ప్రజలు హిందీని మహారాష్ట్రపై రుద్దే ప్రయత్నం చేస్తే వారిపై దాడి చేస్తామన్నారు. గత నెలలో మహారాష్ట్ర నవనిర్మాణ సేన చీఫ్ రాజ్ ఠాక్రే, శివసేన (ఠాక్రే) వర్గం అధినేత ఉద్ధవ్ ఠాక్రే ఏకమయ్యారు. దీంతో గత 20 ఏళ్లుగా వేర్వేరుగా ఉన్న వీరిద్దరు ఒక్కటవ్వడం మహారాష్ట్ర రాజకీయాలలో కీలక మలుపుగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ నెల 15న బృహత్ ముంబై మున్సిపల్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తామని ప్రకటించాయి. ఈ నేపథ్యంలో రాజ్ ఠాక్రే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. బీహార్, యూపీ నుంచి మహారాష్ట్రకు వలసవచ్చిన కార్మికులనుద్దేశించి ఆయన హెచ్చరికలు జారీచేశారు. రాజ్ ఠాక్రే మాట్లాడుతూ ' యూపీ, బీహార్ రాష్ట్రాల ప్రజలు అర్థం చేసుకోండి. హిందీ మీ మాతృభాష కాదు. నేను ఈ భాషను వ్యతిరేకించడం లేదు. కానీ దానిని ఇక్కడి ప్రజలపై రుద్దడం సరికాదు. ఒకవేళ అలా చేస్తే నేను మిమ్మల్ని కొడతాను' అని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి మహారాష్ట్రకు వచ్చి వాటాను వాళ్లు లాక్కెళ్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరాఠీ ప్రజలకు ఇవి చివరి ఎన్నికలని ఒకవేళ ఇప్పుడు గనక అవకాశం కోల్పోతే మరాఠీ ప్రజల కథ ముగుస్తుందని మరాఠీ సంస్కృతి కోసం ప్రజలంతా ఏకమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. మరాఠీ ప్రజలను , మహారాష్ట్రను కాపాడటం కోసమే సోదరులిద్దరం తిరిగి ఏకమయ్యామని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు.

## మమతపై కేసుకు అనుమతించండి

సుప్రీంకోర్టులో ఇడి పిటిషన్

**న్యూఢిల్లీ:** కోల్‌కతాలో ఐప్యాక్ కార్యాలయంపై ఇడి ఇటీవల దాడి చేసింది. ఈ వార్త వినగానే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఘటనాస్థలికి చేరుకుని అడ్డుకున్నారు. కీలకమైన పత్రాలు, హార్డ్‌డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'అమిత్ షా దుర్మార్గుడు, నీచుడు' అంటూ మండిపడ్డారు. తాను బిజెపి కార్యాలయంపై దాడి చేస్తే పరిణామాలు వేరేగా ఉంటాయని హెచ్చరించారు. తాజాగా మమతా బెనర్జీ, డీజీపీ రాజీవ్ కుమార్, కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ వర్మపై ఈడీ అధికారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జనవరి 8న ఐప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ కార్యాలయాల్లో జరిగిన ఇడి దాడులను వారు అడ్డుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, డీజీపీ, ఇతర పోలీసు ఉన్నతాధికారులపై ఎఫ్ఐఆర్‌కు అనుమతించాలని కోరారు. సాక్ష్యాలు తారుమారు చేశారని, డిజిటల్ పరికరాలను బలవంతంగా తీసుకెళ్లారని పేర్కొన్నారు. దాదాపు రూ.2,742 కోట్ల కుంభకోణంతో సంబంధం ఉన్న అంశాలపై దర్యాప్తు జరుగుతోందని, హవాలా ద్వారా రూ.20 కోట్లు ఐప్యాక్ అందుకుందని ఆరోపించారు. మమతా బెనర్జీ 200 మంది పోలీసులతో ప్రతీక్ జైన్ నివాసానికి వచ్చి తమను అడ్డుకున్నారని తెలిపారు. ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, పత్రాలను బలవంతంగా తీసుకెళ్లి రెండు గంటల పాటు పోలీస్ స్టేషన్లో ఉంచారని పేర్కొన్నారు. అధికారులను బెదిరించడమే కాకుండా దర్యాప్తును పూర్తిగా ఆటంకం కలిగించారని వెల్లడించింది. ప్రస్తుతం ఇడి అధికారులపై దాఖలైన ఎఫ్ఐఆర్‌లపై స్టే విధించాలని ఈడీ కోరింది. ప్రతీకార చర్యలకు దిగితే రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేసింది. డిజిటల్ పరికరాలను సీల్ చేయడం లేదా ఫోరెన్సిక్‌లో భద్రపరచాలని కోరింది.

## వందేభారత్ స్లీపర్‌లో వివిపి కోటా లేదు

**న్యూఢిల్లీ:** వందే భారత్ స్లీపర్ రైలు మరి కొన్ని రోజుల్లో పట్టాలెక్కనుంది. కోల్‌కతా, గువహతి మధ్య తొలి వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ పరుగులు పెట్టనుంది. ఈ రైలు రాకతో తూర్పు భారతం, ఈశాన్య రాష్ట్రాల మధ్య రవాణా సదుపాయం మరింత మెరుగవుతుంది. ఈ రైలు ప్రారంభం కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. సామాన్యుల కోసమే ఈ రైలు ప్రవేశపెట్టినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ రైల్లో ఎమర్జెన్సీ, వీఐపీ కోటాలు వంటివేవీ లేవని తెలిపారు. రైల్వే ఉన్నతాధికారుల పాస్‌లు కూడా ఈ రైల్లో చెల్లుబాటు కావు. కేవలం నిర్ధారణ అయిన టికెట్లు ఉన్న వారికే ఇందులో ప్రయాణించే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆర్ఏసీ టికెట్లకు కూడా ఈ రైల్లో అనుమతి ఉండదు. ప్రయాణికులకు అత్యద్భుత ప్రయాణ అనుభవం కల్పించేందుకు ఇలాంటి నిబంధనలు విధించినట్టు తెలుస్తోంది. ఈ రైల్లో ప్రయాణికులకు పలు సౌకర్యాలు కల్పించనున్నారు. ఆధునిక బెడ్స్, బ్లాంకెట్ కవర్స్ అందుబాటులో ఉంటాయి. సాధారణ రైళ్లలో కంటే ఇవి ఎంతో మెరుగ్గా ఉండనున్నాయి. ఏకీకత నిబంధనలు, పారదర్శక టికెటింగ్ విధానం అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. స్థానిక వంటకాలు ఈ రైల్లో అందుబాటులో ఉంటాయి. భారత సంస్కతి ఉట్టిపడేలా రైలు లోపలి డిజైన్ ఉంటుందని అధికారులు చెప్పారు. ఈ రైల్లో మొత్తం 823 బెర్తులు ఉన్నాయి. పదకొండు 3టైర్ ఏసీ కోచ్‌లు, నాలుగు 2టైర్ ఏసీ కోచ్‌లు, ఏసీ కోచ్ ఒకటి ఉన్నాయి. ప్రయాణికులకు అత్యంత సౌకర్యవంతంగా ఉండేలా బెర్తులు రూపొందించారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. రైలు ప్రమాదాలను నివారించే కవచ్ వ్యవస్థతో పాటు పరిశుభ్రత కోసం బోగీలలో ప్రత్యేక డిస్ఇన్ ఫెక్టెంట్ టెక్నాలజీ ఉపయోగించారని అధికార వర్గాలు తెలిపాయి.

## ఏటా 5 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియా ఎగుమతి

**న్యూఢిల్లీ:** గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తిలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ఏఎం గ్రీన్, జర్మనీకి చెందిన ఇంధన దిగ్గజం యూనిపర్‌తో భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం భారత్ నుంచి ఏటా ఐదు లక్షల టన్నుల వరకు పునరుత్పాదక అమ్మోనియాను యూనిపర్ సంస్థ కొనుగోలు చేయనుంది. ఈమేరకు యూనిపర్ సీఈఓ మైఖేల్ లూయిస్, ఏఎం గ్రీన్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ కుమార్ చలమలశెట్టి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఏడాదికి గరిష్టంగా ఐదు లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియాను యూనిపర్ కొనుగోలు చేయనుంది. ఒక భారతీయ సంస్థ ఇటువంటి భారీ స్థాయి అంతర్జాతీయ ఎగుమతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ఇదే తొలిసారి. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ నిర్మాణంలో ఉన్న 1 ఎంటీపీఏ (ఏటా మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం) ప్లాంట్ నుంచి 2028 నాటికి మొదటి విడత ఎగుమతి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఏఎం గ్రీన్ వ్యవస్థాపకులు అనిల్ కుమార్ చలమలశెట్టి మాట్లాడుతూ... 'గ్లోబల్‌గా ఎనర్జీ పరంగా వస్తున్న మార్పులో భారత్ పాత్రకు ఈ భాగస్వామ్యం ఒక మైలురాయిగా నిలుస్తుంది. మా ప్రత్యేకమైన క్లీన్ ఎలక్ట్రిసిటీ సొల్యూషన్స్ ద్వారా ఉత్పత్తి అయ్యే ఈ గ్రీన్ అమ్మోనియా... కెమికల్స్, అల్యూమినియం వంటి కర్బన ఉద్గారాలు ఎక్కువగా ఉత్పత్తయ్యే పరిశ్రమలు తమ ఉద్గారాలను తగ్గించుకోవడానికి సహాయపడుతుంది' అని పేర్కొన్నారు. యూనిపర్ సీఈఓ మైఖేల్ లూయిస్ స్పందిస్తూ... 'భారత్, యూరప్ మధ్య మొట్టమొదటి భారీ స్థాయి సరఫరా కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నందుకు గర్వంగా ఉంది.

## సంక్రాంతికి కొత్త ఆఫీసులోకి మోదీ

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ కొత్త కార్యాలయం(పీఎంఓ) సిద్ధమైంది. మకర సంక్రాంతి రోజు ఆయన 'సేవాతీర్థ' కాంప్లెక్స్‌కు మారే అవకాశం ఉంది. జనవరి 14న పండగ రోజు మార్పు జరగాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ కాంప్లెక్స్‌లో పీఎంఓ, కేబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్ ఉండేలా రూపొందించారు. ఈ మూడింటికి వేర్వేరు భవనాలు కేటాయించారు. 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సౌత్ బ్లాక్‌లోనే ఉన్న పీఎంఓ తొలిసారిగా మరో ప్రాంతానికి మారుస్తున్నారు. పాత కార్యాలయం ఖాళీ అయిన తర్వాత సౌత్, నార్త్ బ్లాక్‌లను 'యుగే యుగీన్ భారత్ సంగ్రహాలయ' అనే పబ్లిక్ మ్యూజియంగా మార్చనున్నారు. కొత్త కార్యాలయం రైసినా హిల్ సమీపంలో ఉంది. దీనిని సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. నిర్మాణ దశలో దీనిని ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్‌గా పిలిచారు. ఇటీవల దీనికి 'సేవాతీర్థ' అని పేరు పెట్టారు. సేవాతీర్థ్1లో ప్రధాని కార్యాలయం, సేవా తీర్థ్2లో కేబినెట్ సెక్రటేరియట్, సేవా తీర్థ్3లో జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కార్యాలయం ఉన్నాయి.

# వ్యవసాయ... పాడి రంగాలకు ద్వారాలు తెరవద్దు

అమెరికాతో ఎఫ్‌టిఎ తక్షణం ఉపసంహరించాలి

మోదీ సర్కార్‌ను డిమాండ్ చేసిన ఎస్‌కెఎం



న్యూఢిల్లీ : అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) పై సంతకం చేసి వ్యవసాయ, పాడి రంగాలను ద్వారాలు తెరవవద్దని ఎన్డీఏ ప్రభుత్వాన్ని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) హెచ్చరించింది. కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తక్షణమే ఆ ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. సోమవారం ఇక్కడ సూర్జిత్ భవన్‌లో జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ మండలి సమావేశం ఈ మేరకు ఒక ప్రతిపాదనను ఆమోదించింది. అమెరికన్ సామ్రాజ్యవాదం, కార్పొరేట్ శక్తుల ఒత్తిడికి లొంగి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టడానికి వ్యతిరేకంగా రైతులు, సాధారణ ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చింది. 202021 చారిత్రక రైతుల ఉద్యమం కంటే పెద్ద, విస్తృతమైన, తీవ్రమైన పోరాటాన్ని రైతులు చేపడతారని ఈ సందర్భంగా ప్రకటించింది. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం విద్యుత్ బిల్లు2025 ను ఆమోదిస్తే, దేశ వ్యాప్తంగా రైతులు, కార్మికులు తక్షణమే తీవ్ర నిరసన చర్యలు చేపట్టాలని సమావేశం పిలుపునిచ్చింది. తొలుత హన్నన్ మొల్లా ఈ సమావేశంలో పాల్గొన్న వారికి స్వాగతం పలికారు. అధ్యక్ష బందంలో జోగిందర్ సింగ్ ఉగ్రహాన్, రాజన్ క్షీరసాగర్, పి.కష్ణ ప్రసాద్, ప్రేమ్ సింగ్ గెహ్లోవత్, ఆశిష్ మిట్టల్, జోగిందర్ సింగ్ నైన్, సిరాజుద్దీన్ ఖేడి, దల్జిత్ సింగ్ దగర్బ్, అశోక్ బైతా ఉన్నారు. జనవరి 16న 'అఖిల భారత ప్రతిఘటన దినం' లో రైతుల విస్తృత భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ జిల్లా స్థాయి ప్రదర్శనలో బ్లాక్/గ్రామ స్థాయిలో బహిరంగ సభలు నిర్వహించి, 'విజయం సాధించే వరకు నిరంతర, ఉమ్మడి, అఖిల భారత పోరాటాన్ని నిర్మిస్తాం' అనే నూతన సంవత్సర ప్రతిజ్ఞను తీసుకుంటారు. అలాగే విద్యుత్ బిల్లు 2025, విబిజి రాంజీ చట్టం 2025, విత్తన బిల్లు 2025, నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌ను కూడా తెలియజేస్తారు. అలాగే అన్ని పంటలకు సీ2+ 50 శాతం చట్టబద్ధమైన హామీతో కొనుగోలు చేయడం, రైతులను రుణ విముక్తి చేయడానికి, రైతుల ఆత్మహత్యలను అంతం చేయడానికి సమగ్ర రుణ మాఫీ, భూసేకరణ, పునరావాస హక్కుల చట్టం2013 అమలులో సరైన ప్రతిఘటన, పారదర్శకత, జీఎస్‌టీ చట్టాన్ని సవరించడం ద్వారా పన్నుల అధికారాలను పరిరక్షించడం, సుంకం, సర్‌ఛార్జ్‌తో సహా పంపిణీ చేయదగిన నిధులలో 31 శాతానికి బదులుగా 60 శాతం రాష్ట్రాలకు ఇవ్వాలన్న దీర్ఘకాల డిమాండ్లు కూడా ఉన్నాయి. అదేవిధంగా సముచితమైన అన్ని డిమాండ్లకు మద్దతుగా జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోవాలని, భావప్రకటనా స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు, అలాగే యూఏపీఏతో సహా అణచివేత చట్టాలను రద్దు చేయడానికి రాజ్యాంగ హక్కులను పునరుద్ఘాటించాలని సమావేశం నిర్ణయించింది. ప్రజాస్వామ్య హక్కులపై తీర్మానం, లడఖ్‌కు చెందిన సోనమ్ వాంగ్‌చుక్‌తో సహా ఐదేళ్లకు పైగా విచారణ లేకుండా జైలులో ఉన్న రాజకీయ ఖైదీలందరినీ తక్షణమే విడుదల చేయాలని ఎన్డీఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అధికారిక గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు అంతరాయం కలగకుండా మధ్యాహ్నం 'జన్ మార్చ్' పేరుతో నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుంది. కార్మికులు, వ్యవసాయ, గ్రామీణ కార్మికులతో సమన్వయం చేసుకుని ట్రాక్టర్ పరేడ్‌లు, వాహన ర్యాలీలు, మోటార్‌సైకిల్ ర్యాలీలు, భారీ ప్రదర్శనలు నిర్వహిస్తుంది. నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 2026 ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెకు సమావేశం మద్దతు పలికింది. ఆ రోజు రైతులను వీధుల్లోకి వచ్చి భారీ ప్రదర్శన నిర్వహించాలని పిలుపునిచ్చింది. జనవరి 19న లఖింపూర్ ఖేరీలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తుంది. కాగా తదుపరి జాతీయ మండలి సమావేశం ఫిబ్రవరి 24న హర్యానాలో జరుగుతుంది. కార్మికులు, రైతులు, వ్యవసాయ, గ్రామీణ కార్మికుల నాయకత్వంతో నిజమైన డిమాండ్లపై చర్చలు ప్రారంభించడానికి ఎన్డీఏ ప్రభుత్వం సిద్ధంగా లేకపోతే, ఒక నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తారు.

# భారత్ కంటే ఎవరూ ముఖ్యం కాదు

అమెరికా రాయబారిగాసెర్గీ గోర్



**న్యూఢిల్లీ:** భారత్ కంటే ముఖ్యమైన భాగస్వామ్యదేశం మరెవ్వరూ లేరని సెర్గీ గోర్ (39) అన్నారు. మనదేశంలో అమెరికా రాయబారిగా సెర్గీ గోర్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ శతాబ్దంలో ప్రపంచంలో అత్యంత కీలకమైన భాగస్వామ్యదేశాలుగా రెండు దేశాల సంబంధాలను అభివర్ణించారు. దౌత్యకార్యాలయ సిబ్బంది పాల్గొన్న ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భారత్ కంటే అమెరికాకు ఏ దేశమూ ముఖ్యభాగస్వామి కాదని, ఇరు దేశాలు వాణిజ్య ఒప్పందం చేసుకోవడంలో చాలా క్రియాశీలంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ''వాస్తవానికి రెండు దేశాల ప్రతినిధులమధ్య జనవరి 13వ తేదీన సమావేశం జరగాల్సి ఉంది, ప్రపంచంలో అతిపెద్ద దేశాలలో భారత్ ఒకటి, అందువల్ల అంత తొందరగా ఒప్పందం సాధ్యం కాదు, ఇది చాలా పెద్ద చర్య, కానీ రెండు దేశాలూ ఒప్పందం చేసుకోవాలని కృతనిశ్చయంతో ఉన్నాయి, రెండు దేశాల సంబంధాల్లో వాణిజ్యం చాలా కీలకమైన విషయం, భద్రత, సాంకేతికత, విద్య,వైద్యం సహా మిగిలిన అన్ని రంగాలలోనూ రెండు దేశాలూ చాలా సన్నిహితంగా కలిసి పనిచేస్తున్నాయి'' అని సెర్గీ గోర్ చెప్పారు. పాక్స్ సిలికా కూటమిలో భారతదేశం ఒక సభ్యదేశంగా ఉండబోతోందని ఆయన ప్రకటించారు. వచ్చే నెలలో పాక్స్ సిలికా దేశాల కూటమిలో పూర్తిస్థాయి సభ్యదేశంగా చేరాలని తాము ఆహ్వానిస్తున్నామన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు కావాల్సిన కీలకమైన ఇంధన, ఖనిజ వనరులను ఆటంకం లేకుండా సరఫరా చేసేందుకు ఉద్దేశించిన సప్లయి చైన్ దేశాల కూటమి ఈ పాక్స్ సిలికా. ఈ కూటమిలో జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, నెదర్లాండ్స్, యునైటెడ్ కింగ్డమ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇజ్రాయెల్, ఆస్ట్రేలియాలతోపాటు అతిథి దేశాలుగా తైవాన్,యూరోపియన్ యూనియన్, కెనడా, ఒఇసిడి దేశాలు సభ్యులుగా ఉన్నాయి. గత ఏడాది నవంబరులో సెర్గీ గోర్ భారత్ రాయబారిగా నియమితులయ్యారు. కానీ ఆయన జనవరి 12న భారత్‌కు వచ్చి అధికారికంగా బాధ్యతలు తీసుకున్నారు. అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవర్డ్ లుత్నిక్ ఇటీవల రేకెత్తించిన వివాదాన్ని కూడా ఆయన ప్రస్తావిస్తూ, భారత్‌-అమెరికా రెండు దేశాలకు పరస్పర అనుబంధ ప్రయోజనాలు ఉండటమేకాదు, సంబంధాలరీత్యా ఉన్నతస్థాయిలో ఉన్నాయన్నారు. నిజమైన స్నేహంలో కొన్ని వైరుధ్యాలుంటాయని, కానీ ఆ వైరుధ్యాలను ఎప్పుడూ చర్చలద్వారా పరిష్కరించుకుంటాయన్నారు. ఇటీవల లుత్నిక్ ఒక ప్రకటన చేస్తూ అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడం జాప్యం కావడానికి కారణం ప్రధానమంత్రి నరేంద్రమోదీ తమ అధ్యక్షుడు ట్రంప్‌కు ఫోన్‌చేసి మాట్లాడకపోవడమేనని వివాదం సృష్టించారు. ఈ విధంగా ఫోన్‌చేసి మాట్లాడటం భారత్‌కు అసంబద్ధంగా అనిపించిందని లుత్నిక్ వ్యాఖ్యానించడంపై సెర్గీ గోర్ పైవిధంగా స్పందించారు. మోదీ-ట్రంప్ మధ్య నిజమైన మైత్రి ఉందని ఆయన ఉద్ఘాటించారు. ''ట్రంప్‌తో కలిసి నేను ప్రపంచమంతా పర్యటించా,తమ అధ్యక్షుడితో మోదీకి ఉన్న మైత్రి చాలా నిజమైనది, భారత్ కంటే ముఖ్యమైన భాగస్వామి ఎవ్వరూలేరు, రాబోయే నెలల్లో, సంవత్సరాల్లో ఒక రాయబారిగా మేం కోరుకున్న అజెండాను ముందుకు తీసుకువెళతాం, నిజమైన వ్యూహాత్మక భాగస్వాములుగా పరస్పరబలం,పరస్పర గౌరవం,పరస్పర నాయకత్వంతో దీనిని సాధిస్తాం'' అన్నారు. గోర్ గతంలో వైట్‌హౌస్‌లో ట్రంప్‌కు వ్యక్తిగత అధికారిగా పనిచేశారు. ట్రంప్‌కు ఆయన అత్యంత సన్నిహితుడు. గడచిన ఆగస్టులో ఆయనను ట్రంప్ భారత్‌కు తదుపరి అమెరికా రాయబారిగా నియమించారు.

## 12వ తరగతి విద్యార్థిని కిడ్నాప్..

కదులుతున్న కారులో సామూహిక అత్యాచారం

జైపూర్: స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థినిని ఇద్దరు యువకులు కిడ్నాప్ చేశారు. ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించారు. కదులుతున్న కారులో ఆ బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. నాపాసర్ ప్రాంతానికి చెందిన 18 ఏళ్ల బాలిక 12వ తరగతి చదువుతున్నది. కాగా, జనవరి 6న ఉదయం ఆ బాలిక స్కూల్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో ఇద్దరు యువకులు ఆమెను అడ్డగించారు. ఆ బాలికను కిడ్నాప్ చేసి కారులో తీసుకెళ్లారు. కదులుతున్న కారులో ఒకరు తర్వాత ఒకరు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. మరోవైపు కొన్ని గంటల తర్వాత పొరుగు గ్రామంలోకి ఆ కారు ప్రవేశించింది. అనుమానించిన స్థానికులు ఆ వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. ఆ యువకులు బాలికను కారు నుంచి బయటకు తోసి పారిపోయారు. ఆ గ్రామస్తులు బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడకు చేరుకున్నారు. ఆమెను ఇంటికి తీసుకెళ్లారు.

## 'సర్' లోపభూయిష్టం

2002 నాటి ఓటర్ల జాబితాల ఎఐ ఆధారిత డిజిటలైజేషన్‌లో అనేక లోపాలు: మమతా బెనర్జీ ఆరోపణ

సిఇసికి 5వ లేఖ సంధించిన బెంగాల్ సిఎం



**కోల్‌కతా :** ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) వివాదాస్పదం కావడంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖలు సంధిస్తున్నారు. తాజాగా 5వసారి కూడా సిఇసి జ్ఞానేష్ కుమార్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో చేపట్టిన 'సర్' ప్రక్రియ ప్రాథమికంగా లోపభూయిష్టంగా ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు. 2002 ఓటర్ల జాబితా ఎఐ ఆధారిత డిజిటలైజేషన్ పెద్ద ఎత్తున డేటా అసమతుల్యతలకు, నిజమైన ఓటర్ల మధ్య తార్కిక వ్యత్యాసాలు కలిగి ఉందని, అది తప్పుడు వర్గీకరణకు కారణమవుతోందని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన స్వంత చట్టబద్ధమైన ప్రక్రియలను ఇసి విస్మరించిందని ఆరోపించారు. క్వాసీజ్యుడీషియల్ విచారణల తర్వాత గతంలో చేసిన దిద్దుబాట్లు ఉన్నప్పటికీ ఓటర్లు గుర్తింపును తిరిగి స్థాపించవలసి వస్తుందని ఆమె అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా ఉన్న స్వంత చర్యలు, యంత్రాంగాలను తిరస్కరించే ఇటువంటి విధానం ఏకపక్షమని, అశాస్త్రీయమని, భారత రాజ్యాంగం అక్షరం, స్ఫూర్తికి విరుద్ధమన్నారు. 'సర్' సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు జారీ చేయబడటం లేదని, ఈ విధానం ప్రాథమికంగా లోపభూయిష్టంగా ఉందని బెనర్జీ ఆరోపించారు. 'సర్' విచారణ ప్రక్రియ చాలావరకు యాంత్రికంగా, పూర్తిగా సాంకేతిక డేటా ద్వారా చేపడుతున్నారని, ఏ మాత్రం ఆలోచించకుండా మనుషులతో సంబంధం లేకుండా చేస్తున్నారని ఇది మన ప్రజాస్వామ్యం, రాజ్యాంగ చట్రాన్ని దెబ్బతీసిందని ఆమె అన్నారు. అయితే గతంలో మమతా బెనర్జీ రాసిన లేఖలో రాష్ట్రంలో సర్‌ను నిలిపివేయాలని సిఇసిని కోరారు. దీనిని ప్రణాళిక లేని, ఏకపక్ష, తాత్కాలిక ప్రక్రియ అని అభివర్ణించారు. సర్ ప్రక్రియతో సంబంధం ఉన్న పనిభారం, ఒత్తిడి, ఆందోళన కారణంగా బూత్ లెవల్ ఆఫీసర్ల (బిఎల్ఓ) ఆత్మహత్యలతో సహా అనేక మరణాలను కూడా ఆమె గుర్తించారు. జనవరి 10 నాటి ఒక లేఖలో సర్ గురించి ఎన్నికల కమిషన్ లక్ష్యం సవరణ లేదా ఓటర్ల జాబితాలో చేర్చడం కాదని, తొలగింపు, మినహాయింపు మాత్రమేనని మమత ఆరోపించారు.

# బడ్జెట్‌లో గణాంకాల గారడీ వద్దు

వాస్తవ పరిస్థితులు ప్రతిబింబించాలి: కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** కొత్త ఆర్థిక (2026-27) సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి కేంద్రం సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, గణాంకాల గారడీలతో సరిపెట్టుకుంటుండా, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా బడ్జెట్‌ను ప్రతిపాదించాలని ఆయన పేర్కొన్నారు. కేవలం జిడిపి అంకెలు గొప్పగా చూపిస్తే సరిపోదన్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధి కల్పన, సామాన్యుడి పొదుపు దారుణంగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం గణాంకాలతో ఆర్థిక వ్యవస్థ అంతా బాగుందనే భ్రమను కల్పిస్తోందని, ఈ బడ్జెట్‌తోనైనా ఆ అలాంటి ఆలోచనల నుంచి బయటకు రావాలని ఆయన సూచించారు. 2026-27 బడ్జెట్‌ను మరో ఇరవై రోజుల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుందని, ఇదే సమయంలో 16వ ఆర్థిక సంఘం సిఫార్సులను ఈ బడ్జెట్ కచ్చితంగా ప్రతిబింబిస్తుందని రమేష్ పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్ల( 2026-27 నుంచి 2031-32) కాలానికి సంబంధించిన ఈ సిఫార్సులు కేంద్రరాష్ట్రాల మధ్య పన్ను ఆదాయాల పంపిణీ, రాష్ట్రాల మధ్య ఆ నిధుల కేటాయింపుకు నిర్దేశిస్తాయన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ బలవంతంగా తీసుకొచ్చిన 60:40 వ్యయ విధానంతో రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయన్నారు. ఇప్పుడు రాబోయే 16వ ఆర్థిక సంఘం కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయని చెప్పుకొచ్చారు. భారత ఆర్థిక వ్యవస్థను ప్రధానంగా మూడు సమస్యలు పట్టి పీడిస్తున్నాయని జైరాం రమేశ్ విశ్లేషించారు. 'కార్పొరేట్ కంపెనీలకు పన్ను మినహాయింపులు ఇచ్చారు. అవి భారీగా లాభాలు గడిస్తున్నాయి. అయినా సరే, అవి తిరిగి కొత్త పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టడం లేదు. పెట్టుబడులు రాకపోతే కొత్త ఉద్యోగాలు ఎలా వస్తాయి? దేశంలో గృహ పొదుపు రేట్లు గణనీయంగా పడిపోయాయి. మధ్యతరగతి ప్రజల చేతిలో డబ్బు నిలవడం లేదు. ఇది దేశ పెట్టుబడి సామర్థ్యాన్ని దెబ్బతీస్తోంది. దేశంలో సంపద, ఆదాయం, వినియోగంలో అసమానతలు అంతకంతకూ లోతుగా మారుతున్నాయి. ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. ఈ అగాధాన్ని పూడ్చకపోతే ప్రమాదం తప్పదు' అని అన్నారు. కేవలం జిడిపి వృద్ధి రేటును చూసి మురిసిపోవద్దని కాంగ్రెస్ నేత హితవు పలికారు.'అధిక జిడిపి రేట్లు ఉన్నంత మాత్రాన సరిపోదు.

### నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్‌కు సర్ నోటీసు..

## స్పష్టతనిచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ:** తన గుర్తింపు నిరూపించుకోవాలంటూ నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్‌కు ఇసి నుంచి నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఆన్‌లైన్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం క్లారిటీచ్చింది. నేవీ మాజీ చీఫ్ ఎన్యుమరేషన్ ఫామ్‌లో అనేక వివరాలు లేవని చెప్పింది. గోవాలో ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్న సందర్భంగా సర్ అధికారులు మాజీ నేవీ చీఫ్ ఇంటికి వెళ్లారు. రిటైర్‌మెంట్ తర్వాత ప్రకాశ్ గోవాలో స్థిరపడ్డారు. అయితే సర్ కోసం ఆయన తన ఐడెంటిటీ చూపాలని ఇసి అధికారులు కోరారు. 1971 ఇండోపాక్ వార్‌లో పనిచేశారని, వీర చక్ర అవార్డు గెలిచారని, ఆయనకు నోటీసులు ఇవ్వడం ఆందోళనకరంగా ఉన్నట్లు కొందరు సైనిక దళాల విరమణ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం దీనిపై ఇసి క్లారిటీ ఇచ్చింది. కోర్టాలిం అసెంబ్లీ నియోజకవర్గంలో నేవీ మాజీ చీఫ్ అరుణ్ ప్రకాశ్ నుంచి పార్ట్ నెంబర్ 43కి చెందిన బూత్ లెవల్ ఆఫీసర్ సమాచారాన్ని సేకరించారని, అయితే ఎన్యుమరేషన్ దరఖాస్తులో అవసరమైన వివరాలు లేవని, గతంలో సర్ చేపట్టినప్పుడు కూడా ఆ వివరాలు లేవని, వాటిల్లో ఓటరు పేరు, ఎపిక్ నెంబర్, బంధువు పేరు, అసెంబ్లీ నియోజకవర్గ పేరు, నెంబర్, పార్ట్ నెంబర్, సీనియరల్ నెంబర్ లేవని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ మెడోరా ఎర్మోమిల్లా డీకాస్టా తెలిపారు. కీలకమైన ఐడెంటిఫికేషన్ వివరాలు లేనందు వల్లే బీఎల్ఓ అప్లికేషన్ ఆటోమెటిక్‌గా అప్‌డేట్ కాలేదన్నారు. గతంలో సర్ చేపట్టినప్పుడు అన్ని అంశాలను ఖాళీగా వదిలివేయడం వల్ల , కంప్యూటర్ సిస్టమ్‌లో ఆ ఎన్యుమరేషన్‌ను అన్‌మ్యాప్డ్ కేటగిరీగా చూపించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఐడెంటిటీ వివరాలను పొందుపరిస్తేనే బిఎల్ఓ అప్లికేషన్ ఆటోమెటిక్‌గా అప్‌డేట్ అయ్యే రీతిలో డిజైన్ చేసినట్లు చెప్పారు.

### బిజెపి పాలనలో కులం, మతం ఆధారంగా

## విద్వేషాలు వ్యాప్తి

యోగి ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎస్‌సి సెల్ విభాగం చీఫ్ రాజేంద్ర పాల్ గౌతమ్ తీవ్ర విమర్శలు

**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లో మహిళపై హత్యాచారాలు జరుగుతుండడంపై కాంగ్రెస్ మండిపడింది. తాజాగా మీరట్‌లో ఒక దళిత మహిళ హత్యకు గురికావడంతో ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. కొంది మంది భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రభుత్వాల అండతో కులం, మతం ఆధారంగా విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించింది. గురువారం ఉదయం మీరట్‌లోని ఒక గ్రామంలో 22 ఏళ్ల వ్యక్తి ఒక దళిత మహిళను హత్య చేసి, ఆమె కుమార్తెను అపహరించుకుపోయాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో ఉద్రిక్తతకు దారితీయడంతో, అధికారులు అదనపు పోలీసు బలగాలను మోహరించారు. మృతురాలిని 20 ఏళ్ల యువతి తల్లిగా గుర్తించారు. సర్ధానా ప్రాంతంలోని కప్సద్ గ్రామం నుంచి అపహరణకు గురైన 20 ఏళ్ల దళిత యువతి శనివారం సహారన్‌పూర్ జిల్లాలో లభించిందని, నిందితుడిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. కాగా, విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎస్‌సి విభాగం అధిపతి రాజేంద్ర పాల్ గౌతమ్ మాట్లాడుతూ 'దేశంలో కులం, మతం ఆధారంగా విద్వేషాలు రెచ్చగొట్టబడుతున్నాయి, ఇది బిజెపి ప్రభుత్వం అండతోనే జరుగుతోంది' అని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులను అణచివేయడానికి బహిరంగంగా వనరులను ఉపయోగిస్తున్నారని, ముఖ్యమంత్రి యోగి బుల్డోజర్ తరచుగా కులం, మతం చూసి మాత్రమే పనిచేస్తుందని, రాష్ట్రంలో ఒక దళితుడిపై అణచివేత జరిగినప్పుడు, వారి బుల్డోజర్ కదలదని ఎద్దేవా చేశారు.

## భారత్ జర్మనీ మధ్య రక్షణ, సాంకేతిక భాగస్వామ్యం



**అహ్మదాబాద్:** భారత్, జర్మనీ దేశాల మధ్య రక్షణ, సాంకేతిక సహకారాన్ని మరింతగా పెంచుకోవడం, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత మెరుగుపరుచుకునే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్‌ల మధ్య సోమవారం అహ్మదాబాద్‌లోని విస్తృత చర్చలు సంకేతాలిచ్చాయి. ప్రపంచ భద్రత, వాతావరణ మార్పు, ఇండో-పసిఫిక్ స్థిరత్వంపై వారు చర్చించినట్లు తెలిసింది. తమ ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలు, నియమాల ఆధారిత అంతర్జాతీయ క్రమం పట్ల నిబద్ధత, భాగస్వామ్యానికి ఆధారమైన పరస్పర గౌరవాన్ని ఇరు దేశాల నేతలు పునరుద్ఘాటించారు. గత ఏడాది భారతదేశం, జర్మనీ తమ వ్యూహాత్మక భాగస్వామ్యంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాయని, ఈ సంవత్సరం 75 సంవత్సరాల దౌత్య సంబంధాల వేడుకలను జరుపుకుంటున్నాయని మోదీ అన్నారు. ఉభయ దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం ఎన్నడు లేనంత అత్యధిక స్థాయి 50 బిలియన్‌ల డాలర్‌లు దాటిందని, ఇది ఇయుతో భారతదేశం వాణిజ్యంలో పావు వంతు కంటే ఎక్కువ అని వెల్లడించారు. ఇద్దరు నాయకులు అంతకుముందు సబర్మతీ ఆశ్రమంలో గాంధీజీ విగ్రహానికి మాలలు వేసి నివాళులర్పించారు.

# పోరు భారతం!

ఒకవైపు కార్మికులు... మరోవైపు కర్షకులు పోరుబాట పట్టడం దేశంలో నెలకొన్న అరాచక పరిస్థితులకు నిదర్శనం. ఈ నిరసనలు కేవలం కొన్ని చట్టాలపై అసంతృప్తిగా పుట్టినవి కావు. ఇది దేశ ఆర్థిక విధానాల దిశ, వ్యవసాయ భవిష్యత్తు, గ్రామీణ ఉపాధి, కార్మిక హక్కులు, ప్రజాస్వామ్య విలువలు వంటి అనేకానేక అంశాలపై జరుగుతున్న పోరాటం. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతృత్వంలో ఈనెల 16న 'ప్రతిఘటన దినం', 26న ట్రాక్టర్, మోటార్‌సైకిల్ ర్యాలీలు. కాగా, పది కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ఫిబ్రవరి 12న దేశవ్యాప్త కార్మిక సమ్మె. ప్రభుత్వ వ్యతిరేకత ఒక నిరంతర ప్రజా ఉద్యమంగా మారుతున్నదనడానికి ఇదే నిదర్శనం. రైతులు, వ్యవసాయ కూలీలు, పట్టణ కార్మికులు ఒకే వేదికపై నిలబడటం భారత రాజకీయాల్లో కీలక పరిణామం. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వీర్యం కావడం ఈ ఉద్యమానికి తాజా ప్రధాన కారణాల్లో ఒకటి. ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చే ఈ చట్టం గ్రామీణ పేదలకు సంవత్సరానికి కనీసం 100 రోజుల ఉపాధిని హామీ ఇస్తుంది. అయితే ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం దీనికి నిధులు తగ్గించడం, కొత్త పథకాల పేరుతో దాని బాధ్యతను రాష్ట్రాలపై నెట్టివేయడం వల్ల ఇది వాస్తవంలో బలహీనపడింది. రాష్ట్రాల వద్ద సరిపడా నిధులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో పనులు తగ్గిపోతాయి. ఫలితంగా లక్షలాది కుటుంబాలు మళ్లీ నిరుద్యోగం, వలసలు, పేదరికంలోకి జారిపోతాయి. రైతు కూలీలు, చిన్న రైతులు, భూమిలేని కార్మికులు అందరూ దీని ప్రభావాన్ని ఎదుర్కొంటారు. అందుకే ఎస్‌కెఎం ఈ అంశాన్ని కేవలం రైతుల సమస్యగా కాక, దేశవ్యాప్తంగా శ్రమజీవుల సమస్యగా చూస్తోంది.

మరో ముఖ్యమైన అంశం విద్యుత్ రంగం ప్రైవేటీకరణ. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న విద్యుత్ సవరణ చట్టాలు విద్యుత్‌ను పూర్తిగా మార్కెట్ ఆధారిత వస్తువుగా మార్చే దిశగా ఉన్నాయి. స్మార్ట్ మీటర్లు, సమయానుసార ధరలు, సబ్సిడీల తగ్గింపు వంటి విధానాలు రైతులకు, పేద వినియోగదారులకు భారీ భారం మోపుతాయి. ఇప్పటివరకు వ్యవసాయానికి, గృహ వినియోగానికి తక్కువ ధరలకు విద్యుత్ అందించడం ఒక సామాజిక విధానంగా ఉండేది. ఇప్పుడు అదే విద్యుత్‌ను ప్రైవేట్ కంపెనీల లాభాల కోసం వినియోగించాలనుకోవడం ఘోరం. దేశవ్యాప్తంగా డ్యామ్‌లు, బొగ్గు గనులు, విద్యుత్ ప్రాజెక్టుల కోసం రైతుల భూములేకాదు.. గ్రామాలు సైతం భారీగానే నష్టపోయాయి. ఆ త్యాగాల మీద నిర్మితమైన వ్యవస్థను ఇప్పుడు ప్రైవేటు లాభాలకు అప్పగించడం అన్యాయం.

విత్తనాలపై ప్రభుత్వ విధానాలు కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కొత్త విత్తనాల చట్టం విత్తనాల తయారీ, అమ్మకం, నమోదు ప్రక్రియలను పెద్ద కంపెనీల ఆధీనంలోకి నెట్టేలా ఉంది. సంప్రదాయంగా రైతులు తమ విత్తనాలను నిల్వ చేసుకోవడం, మార్పిడి చేసుకోవడం, పునరుత్పత్తి చేసుకోవడం వ్యవసాయ స్వాతంత్ర్యానికి ఆధారం. ఈ హక్కులు తగ్గిపోతే రైతులు ప్రతి సీజన్ కార్పొరేట్ కంపెనీలపై ఆధారపడాల్సి వస్తుంది. ఇది వారి ఖర్చులను పెంచడమే కాక, దేశ ఆహార భద్రతను కూడా ప్రమాదంలో పడేస్తుంది.

కార్మిక కోడ్లు ఈ ఉద్యమానికి మరో ముఖ్య కారణం. కొత్త కార్మిక చట్టాలు ఉద్యోగ భద్రతను తగ్గించి, కాంట్రాక్టు, గిగ్ ఉద్యోగాలను పెంచుతాయి. యూనియన్ల హక్కులకు కత్తెరలు తప్పవు. సమ్మెలు నిర్వహించడం కష్టతరం అవుతుంది. గ్రామీణ కూలీలు, పట్టణ కార్మికులు, పరిశ్రమలలో పనిచేసే శ్రామికులు అందరూ ఏకమొత్తంగా నష్టపోతారు. అందుకే రైతు సంఘాలు ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెకు మద్దతు ప్రకటించాయి. ఇది రైతు–కార్మిక ఐక్యతకు బలమైన సంకేతంగా నిలుస్తోంది. ఈ ఉద్యమానికి అంతర్జాతీయ వాణిజ్య కోణం కూడా ఉంది. అమెరికా వంటి దేశాలు భారత వ్యవసాయ మార్కెట్‌ను తమ ఉత్పత్తులకు తెరవాలని ఒత్తిడి చేస్తున్నాయన్నది బహిరంగ రహస్యం. పత్తిపై దిగుమతి సుంకాలు తొలగించడంతో ఇప్పటికే భారత రైతులు నష్టపోయారు. ఇప్పుడు పాలు, సోయాబీన్, మొక్కజొన్న వంటి ఉత్పత్తులపై కూడా సుంకాలు తగ్గిస్తే, విదేశీ సరుకులు తక్కువ ధరలకు భారత మార్కెట్‌లోకి వచ్చి, దేశీయ రైతులను దెబ్బతీస్తాయి. ఇది కేవలం వ్యాపార ఒప్పందం కాదు.. అది భారత వ్యవసాయ స్వావలంబనపై దాడి. న్యూజిలాండ్, బ్రిటన్ వంటి దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపైనా ఇలాంటి ఆందోళనలే ఉన్నాయి. విదేశీ పాలు, పండ్లు, నూనెగింజలు భారత మార్కెట్‌ను ముంచెత్తితే, చిన్న రైతులు పోటీ పడలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విధానాలు దేశీయ వ్యవసాయాన్ని క్రమంగా కార్పొరేట్ ఆధీనంలోకి నెట్టే ప్రమాదం కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితి మారాలి. 2020–21లో జరిగిన రైతు ఉద్యమం రైతులకు ఒక రాజకీయ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకునేలా చేయగలిగిన ప్రజా శక్తి ఇప్పటికీ జీవించి ఉంది. ఏదిఏమైనా, ఎస్‌కెఎం, పది కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన ఈ ఉద్యమం భారతదేశ అభివృద్ధి మార్గంపై ఒక మౌలిక ప్రశ్నను లేవనెత్తుతోంది. కార్పొరేట్ లాభాల కోసం గ్రామీణ జీవితం, ఆహార భద్రత, కార్మిక హక్కులను తాకట్టు పెట్టాలా? లేక ప్రజల జీవనాధారాలను కాపాడే అభివృద్ధి మార్గాన్ని ఎంచుకోవాలా? అన్నది ఇప్పుడు ప్రజాసమాజం ముందున్న ప్రశ్న. రైతులు, కూలీలు, కార్మికులు కలిసి సాగిస్తున్న ఈ పోరాటం ఆ ప్రశ్నకు ప్రజల పక్షాన సమాధానం ఇవ్వాలనే సంకల్పానికి ప్రతీకగా నిలుస్తోంది. ●



## అమెరికాతో చర్చలు జరగడం లేదు

వలసల విషయంలో సాంకేతిక సంప్రదింపులు మినహా, అమెరికా ప్రభుత్వంతో ఎలాంటి చర్చలు జరగడం లేదు. అమెరికా, క్యూబాల మధ్య సంబంధాలు పురోగమించాలంటే.. అవి శత్రుత్వం, బెదిరింపులు, ఆర్థిక బెదిరింపులతో కాకుండా అంతర్జాతీయ చట్టంపై ఆధారపడి ఉండాలని చరిత్ర నిరూపిస్తుంది. సార్వభౌమ సమానత్వం, పరస్పర గౌరవం, అంతర్జాతీయ న్యాయ సూత్రాలు, పరస్పర ప్రయోజనం ఆధారంగా, అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోకుండా, మా స్వాతంత్ర్యానికి పూర్తి గౌరవం ఇస్తూ, అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన వివిధ ప్రభుత్వాలతో గంభీరమైన, బాధ్యతా యుతమైన చర్చలలో పాల్గొనేందుకు మేము ఎల్లప్పడూ సిద్ధంగా ఉన్నాము.

క్యూబా అధ్యక్షుడు మియేల్ డియస్ కనేల్



## కెమెరాలెన్స్‌లో ప్రపంచాన్ని బంధించిన నల్లమల యువకుడు

నల్లమల్ల అడవులు, అవి కేవలం చెట్లు, కొండలు మాత్రమే కాదు. అవి కథలు, జీవన పోరాటాలు, మౌనంగా అరుస్తున్న నిజాలు. ఆ అడవుల మధ్య నుంచి ఒక యువకుడు వచ్చాడు. చేతిలో పెద్ద డిగ్రీలు లేవు. వెనుక బలమైన ఆర్థిక నేపథ్యమూ లేదు. కానీ అతని కళ్లలో మాత్రం ఒక దృష్టి ఉంది. ఆ దృష్టికే పేరు ఫోటో గ్రఫీ. ఆ యువకుడే ఎస్.వి.రమేష్ ఇతను నాగర్ కర్నూల్ జిల్లాలో జన్మించిన ఓ సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తి చదువు ఆగిపోయింది. కల మాత్రం ఆగలేదు, ఇతను చదువు ఇంటర్ వరకు చదివాడు. చాలామందికి ఇక్కడితో ప్రయాణం ముగుస్తుంది. కానీ రమేష్‌కు మాత్రం ఇదే ఆరంభం. పాఠశాల పుస్తకాలకంటే...ప్రకృతి పాఠాలు అతన్ని ఎక్కువగా ఆకర్షించాయి. నల్లమల్లలోని అడవి జీవితం, గ్రామీణ ముఖాలు, కష్టాల్లోనూ నువ్వే మనుషులు ఇవన్నీ అతని మనసులో ముద్రపడ్డాయి. అప్పుడు అతనికి తెలియదు. ఈ దృశ్యాలే రేపు అతని కెమెరా ద్వారా ప్రపంచం చూడబోతుందని. 1998 జీవితం దిశ మార్చిన సంవత్సరం ఫోటోగ్రఫీ రంగంలో అడుగుపెట్టాడు రమేష్. మొదట్లో అది కేవలం పని. కానీ క్రమంగా అదే సాధనగా మారింది. ఒక మాధ్యమంగా మారింది. ఒక ఉద్యమంలా మారింది.

ఫోటో తీయడం అంటే బటన్ నొక్కడం కాదని, ఒక క్షణాన్ని జీవితం అంతా నిలిపి వేయడం అని అతను అర్థం చేసుకున్నాడు. గురువు... సోదరుడు.... మార్గదర్శి రమేష్ జీవితంలో అత్యంత కీలకమైన వ్యక్తి నవీన్ రాజు. ఆయన కేవలం గురువు మాత్రమే కాదు. తన తోడబుట్టిన సోదరు డు కూడా, ఫోటోగ్రఫీలో కాంతి నీడల ఆట, ఫ్రేమింగ్, కంపోజిషన్ మాత్రమే కాదు. ఒక దృశ్యంలో భావాన్ని ఎలా పట్టుకోవాలో, మనిషి కథను ఎలా చెప్పాలో నవీన్ రాజు రమేష్ కు నేర్పారు. ఈ శిక్షణే ఇతనికి సాధారణ ఫోటోగ్రాఫర్ నుంచి కథ చెప్పే కళాకారుడిగా మార్చింది. కెమెరా లెన్స్‌లో జీవితం రమేష్ కెమెరా ముందుకు వచ్చినవారు సెలబ్రిటీలు కాదు. వేదికలపై నిలిచినవారు కాదు. అతని ఫ్రేమ్‌లో అడవిలో జీవించే గిరిజనుడు, పొలంలో చెమటోడుస్తున్న రైతు, గ్రామంలో ముసలితనాన్ని మోస్తున్న తల్లి, ఆటలో మునిగిపోయిన చిన్నారి అంతరించి పోతున్న కులవృత్తుల దృశ్యం, అడవిలో ఆకలితో ఆహారం కోసం అలమటిస్తున్న జంతువుల దృశ్యం, ఇలా చాలా ఫోటోలు మనస్సులకు అత్తుకునే విధంగా ప్రతిభ కనబరిచాడు. అరకులో అందమైన ప్రకృతిలో తీసిన ఫోటోస్ అతని నైపుణ్యానికి నిదర్శనం. రాష్ట్రం నుంచి ప్రపంచ వేదికల వరకు ఈ ప్రత్యేక దృష్టి, నైపుణ్యం రమేష్ కు రాష్ట్రస్థాయి అవార్డులు, జాతీయ స్థాయి గుర్తింపులు, అంతర్జాతీయ స్థాయిలో గౌరవం, ప్రశంసలు తెచ్చిపెట్టాయి. నల్లమల్ల ప్రాంతం నుంచి వచ్చిన ఓ ఫోటో గ్రాఫర్ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందడం అది కేవలం వ్యక్తిగత విజయం కాదు. అది గ్రామీణ ప్రతిభకు లభించిన గౌరవం. యువతకు ఇతను చెప్పే నిశ్శబ్ద సందేశం, పెద్ద ఉపన్యాసాలు ఇవ్వడు. కానీ అతని జీవితం ఒక సందేశం. డిగ్రీలు లేకపోయినా పరవాలేదు, దృష్టి ఉంటే చాలు, వనరులు లేకపోయినా సరే, సంకల్పం ఉంటే సరిపోతుంది. నల్లమల్ల అడవుల నడుమ పుట్టిన ఓ కల కెమెరా లెన్స్ ద్వారా ప్రపంచాన్ని తాకిన కథే ఎస్.వి.రమేష్ జీవన ప్రయాణం.

# మహిళలపై అత్యాచారాలకు వస్త్రధారణ కారణమా?



ఎస్.బాబు, అధ్యక్షులు
టిజిఎస్‌ఆర్టీసి
ఎంప్లాయీస్ యూనియన్

సినిమా హీరోయిన్లు, సెలబ్రెటీలు జనంలోకి వచ్చినప్పుడు ఒళ్ళు కనిపించకుండా చీరలు ధరిస్తే హుందాగా ఉంటుంది, గౌరవం పెరుగుతుంది అని సినిమా యాక్టర్ శివాజీ దండోరా సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో అన్న విషయం పాఠకులకు తెలుసు. ఈ విషయంపై రచ్చ రచ్చ జరిగి ఆ గట్టున కొందరు నాగన్నలు ఈ గట్టున కొందరు అనసూయమ్మలు రెచ్చిపోయి మహిళాభ్యుదయంపై తామే బ్రాండ్ అంబాసిడర్లయిపోయినట్లు కన్యాశుల్కంలోని గిరీశం లా సన్నివేశాన్ని బాగా రక్తి కట్టించారు. సినిమా నటి నిధి అగర్వాల్ ధరించిన దుస్తులపై మాట్లాడిన శివాజీని కార్నర్ చేస్తూ వీర లెవల్లో ఆడ, మగ తేడా లేకుండా, పాపం ఆయనకు తలంటారు. చివరికి ఆయన క్షమాపణ చెప్పే వరకు వైఫైలా అల్లుకుపోయారు ఈ నాగన్నలు, అనసూయమ్మలు. మహిళల వస్త్రధారణపై పురుషపుంగవులు చొల్లుకూతలు కూస్తూనే ఉన్నారు. మహిళలు పురుషులను రెచ్చగొట్టే విధంగా వారి డ్రెస్సులు ఉన్నాయని మాటల తూటాలు వదులుతూనే ఉన్నారు. దీన్ని అభ్యుదయ మహిళలు తూర్పారబడుతూనే మగవారిని ఎండగడుతూ ఉన్నారు. అనాదిగా భారతీయ సమాజంలో కొన్ని కట్టుబాట్లు, సంప్రదాయాలు ఉన్నాయి. స్త్రీ అయినా, పురుషుడు అయినా ఈ ఆచార వ్యవహారాలకు అతీతులు కారు.

కృతయుగంలో స్త్రీ పురుషుల కట్టు, బొట్టు, సంప్రదాయాలు ఆచరించారు. చాలావరకు ప్రజలందరూ ధర్మాన్ని పాటించినవారే అని పురాణా లు, ఇతిహాసాలు చెప్తున్నాయి. గౌతమ మహర్షి భార్య అయిన అహల్యను ఇంద్రుడు మోహించాడు. ఆమె కురచ గౌన్లు కాని, పొట్టి దుస్తులు కాని ధరించిన స్త్రీ మూర్తి కాదు. పాదాల వేళ్ళు కూడా కనపడనంతగా ఆమె సంప్రదాయబద్ధమైన వస్త్రధారణలో ఉండేది. అయినా ఇంద్రుడు అనే మగవాడి కన్ను పడింది. ఫలితంగా భర్త శాపానికి గురయింది. ఇందులో ఆమె చేసిన తప్పు లేశమంతైనా లేదు. వసిష్ఠ మహర్షి మనుమడైన పరాశరుడు బెస్త కన్య అయిన యోజనగంధిని మోహించాడు. పడవ నడిపే యోజనగంధి వస్త్రధారణ మగవారిని రెచ్చగొట్టే విధంగా లేదు. ఆయనకు కలిగిన మనో వికారాలకు ఆమె ఎటువంటి అంగప్రదర్శన చేయలేదు. తాపసులు కూడా కామ వికారాలకు లోనైనవారే. రాజర్షి అయిన విశ్వామిత్రుడు దేవవేశ్య అయిన మేనక అందచందాలకు లోబడి తన తపస్సుని మిడిల్ డ్రాప్ చేసి క్లీన్ బోల్డ్ అయ్యాడు.

త్రేతాయుగానికి వచ్చేసరికి శ్రీరామచంద్రుని ధర్మపత్ని పరమపావని అయిన సీతామాతను రావణాసురుడు అపహరించాడు. నారచీరలు ధరించి, కందమూలాలు భుజిస్తూ వనాల్లో బతుకుతున్న ఆమె వేషధారణలో, ఆచరిం చే సంప్రదాయంలో మగవాడు రెచ్చిపోయే అవకాశమే లేదు. అయినా సరే ఆమె ఏ నేరం చేయకుండానే కష్టాలు అనుభవించాల్సి వచ్చింది. అందుకే సీత కష్టాలు సీతవి పీత కష్టాలు పీతవి అనే సామెత వచ్చింది.

ద్వాపర యుగానికి వస్తే ద్రౌపదిపై సైంధవుడి చూపు పడింది. తన కోర్కె ను తీర్చుకోవడం కోసం ద్రౌపదిని ఎత్తుకుపోయే ప్రయత్నంలో భీమసేనుడు సైంధవుడికి శిరోముండనం చేసి అవమానించి పంపాడు. ఏకవస్త్ర అయిన ద్రౌపదిని జుత్తు పట్టుకుని సభా మధ్యమానికి లాక్కొచ్చిన దుశ్శాసనుణ్ణి లోకభీకరంగా వధించాడు భీముడు. విరాట రాజు కొలువులో సైరంధ్రి వేషంలో ఉన్న ద్రౌపదిని మోహించిన కీచకుడు చివరికి ప్రాణాలే కోల్పోవలసి వచ్చింది. సైంధవుడు మోహించడానికైనా, కీచకుడు కామించడానికైనా ద్రౌపది చిట్టి పొట్టి డ్రెస్ కట్టిన మహిళ కాదు. వారు రెచ్చిపోయేంత విధంగా ఆమె వస్త్రధారణ లేదు. నిండైన వస్త్రధారణలో ఉన్న ఆమెకు అవమానం జరిగింది.

ఇది కలియుగం. ఈ యుగంలో మహిళల మానభంగాలు, హత్యలు, వారిపై దాడులకు లెక్కే లేదు. ఎంతోమంది నిర్భయలు మగవాడి కామానికి బలైపోయినవారే. ఢిల్లీలో రేప్ చేయబడిన నిర్భయ అరకొర డ్రెస్‌లు వేసుకున్న మగువ కాదు. వయసులో ఆమె కంటే చిన్నవాడైన ఓ మైనర్ బాలుడు ఆమెను చెరిచాడంటే లోపం ఎక్కడుంది? పుష్ప సినిమాలో పాటల రచయిత చంద్రబోస్ ఊ... అంటావా, ఉహూ అంటావా... అనే పాటలో ఒక చరణం "దీపాలన్నీ ఆర్పిం తరువాత నీ మగబుద్ధి వంకరబుద్ధి" అని వ్రాశారు. కాని దీపాలు ఆర్పకపోయినా, పట్టపగలు నేషనల్ హైవే నుండి పక్కకు లాక్కుపోయి దిశ అనే అమ్మాయిని పొదల్లో రేప్ చేసి చంపిన ఘటన ఇంకా మన కళ్ళ ముందు మెదులుతూనే ఉంది. కామాంధులకు రాత్రి, పగలు తేడా ఏముంది? ఇక్కడ ఆ అమ్మాయి చేసిన నేరమేమిటి? ఆమె ధరించిన దుస్తులు జానెడు, బెత్తెడు కావు. మరి రేప్ ఎందుకు చేయబడింది? 5 సంవత్సరాల వయసున్న పసిగుడ్డుపై 60 సంవత్సరాల వయసున్న కామాంధుడు లైంగిక దాడి చేశాడని పత్రికల్లో చదివాం. 70 సంవత్సరాల బామ్మని 15 ఏళ్ళ బాలు డు చెరిచాడని కూడా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో చూశాం. ఈ రెండు సంఘటనల్లో 5 సంవత్సరాల పసిగుడ్డు కాని, 70 ఏళ్ళ బామ్మ కాని ధరించిన దుస్తులు ఈ పురుషపుంగవుల్ని రెచ్చగొట్టాయా? 70 సంవత్సరాల బామ్మ ఏ స్లీవ్ లెస్, లెగ్గింగులు ధరించి మైనర్ బాలుణ్ణి రెచ్చగొట్టింది? ఒంటరి మహిళ మగవాడి కంటబడితే బుద్ధి భస్మమైపోతుంది. మనో వికారం కలుగుతుంది. తుంటరి వేషాలు వేస్తాడు. దేశంలో ఉన్న మగవాళ్ళందరూ ఇలాగే ఉంటారని నా అభిప్రాయం కాదు. కొందరి వలన మగజాతికి చెడ్డపేరు వస్తోంది.

మట్టిలో పుట్టి మణి మందిరంలో నివసించిన హాలీవుడ్ హీరోయిన్ మార్లిన్ మన్రో తన 8 ఏళ్ళ వయసులో చీకటి గదిలో రేప్ కి గురయింది. దేశం ఏదైనా మగవాడి ఆలోచనా విధానం మారలేదు. స్మార్ట్ ఫోన్ల వల్ల మగవాళ్ళ మనోవికారాలు పెరుగుతున్నాయని, సినిమాలు వారిని పాడు చేస్తున్నాయని సమాజంలో కొందరు అంటున్నారు. పొట్టి బట్టల వల్ల మగాళ్ళు మృగాళ్ళుగా మారుతున్నారని మరికొందరంటున్నారు. కాని ఇది ఒక కారకం మాత్రమే. మరికొంతమంది మేధావులు వృత్తుల్లో పనిచేసే వారికి డ్రెస్ కోడ్ ఉందని, అవి ధరిస్తే వారిపై గౌరవం పెరుగుతుందని, అత్యాచారా లు జరగవని అంటున్నారు. కాని వెస్ట్ బెంగాల్ లోని దుర్గాపూర్ లో వైద్య విద్యార్థిని గ్యాంగ్ రేప్ కు గురయింది. ఆమె డాక్టర్ డ్రెస్ కోడ్ ధరించే ఉంది. మగవాడు రెచ్చిపోయేలాగా ఆమె ఏమీ బికినీలో లేదు. కలకత్తాలో లా కాలేజీ విద్యార్థినిపై మూకుమ్మడి అత్యాచారం జరిగింది. ఆమె కూడా డ్రెస్ కోడ్ లోనే ఉంది. అదే కలకత్తా లోని ఆర్జీకర్ వైద్య కళాశాలలో పనిచేస్తున్న మెడికోపై అత్యాచారం జరిగి హత్య చేయబడింది. ఆమె కూడా డాక్టర్ డ్రెస్ కోడ్ లోనే ఉంది. మాజీ ప్రధాని దేవగౌడ మనుమడు, మాజీ ఎంపి తన ఇంట్లో పనిచేసే పనిమనిషిపై అత్యాచారం చేసినందుకు యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ వృత్తుల్లో పనిచేసే స్త్రీలందరూ అంగసౌష్టవంతో పాటు స్కిన్ షో చేసినవారు కాదు. అయినా సరే మగవారు వారిని చెడు దృష్టితోనే చూశారు. కొందరు తండ్రులు తమ కూతుళ్ళపై అత్యాచారం చేసిన ఘటనల ను మనం పేపర్లలో చదువుతున్నాం. సినిమాలు చూడనివారు, క్లబ్బులు, పబ్బులు, రేవ్ పార్టీల గురించి తెలియనివారు కూడా మగువలను చూస్తే మదోన్మత్తులైపోతున్నారు. మరి దీనికి కారణాలు ఏమై ఉంటాయి? అందుకే బ్రహ్మకైనా పుట్టు రిమ్మ తెగులు అని ఓ సామెత కూడా వాడుకలో ఉంది.



పితృస్వామ్య వ్యవస్థలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, బాధ లు, మాతృస్వామ్య వ్యవస్థలో ఉండవు. అక్కడ మహిళలు సూపర్ పవర్‌గా ఉంటారు. సాంప్రదాయం, అధికార నిర్మాణాలను వారు సవాల్ చేస్తారు. మహిళలు రాజకీయ, ఆర్థిక మరియు సామాజిక ఆధిపత్యాన్ని కలిగి ఉంటారు. ఈ సమాజంలో పురుషులు స్త్రీలకు విధేయులై ఉంటారు. తల్లి పేరుతోనే వంశాభివృద్ధి ఉంటుంది. ఉదాహరణకి గౌతమీపుత్ర శాతకర్ణి, వాసిష్ఠిపుత్ర పులుమావి లా ఉంటాయి. ఈ సమాజంలో స్త్రీలపై ఎటువంటి అఘాయిత్యాలు, హత్యలు ఉండవు.

హిందూ పంచాంగ కాలచక్రం ప్రకారం కృతయుగం నుండి కలియుగం వరకు 43,20,000 సంవత్సరాలు గడిచాయి. దీన్ని ఒక మహాయుగం అంటారు. అంటే ఇన్ని సంవత్సరాలు మహిళలు ఏదో ఒక రకంగా పురుషులతో వేధించబడుతూనే ఉన్నారు. వ్యాసంలో నేను సూచించిన స్త్రీ పాత్రధారులు ఏ ఒక్కరూ కూడా మగవారు రెచ్చిపోయే విధంగా తమ అంగసౌష్టవాన్ని ప్రదర్శించినవారు కాదు. సంప్రదాయ పద్ధతిలో నిండుగా వస్త్రధారణ చేసుకున్నవారే. అయినా మగవాడి మనో వికారాలకు బలయ్యారు. మరి బికినీలు, లెగ్గింగులు, బిగుతైన వస్త్రధారణ చేస్తున్నప్పుడు మగాడి పరిస్థితేమిటి? అర్థరాత్రి స్త్రీ నడిబజారులో ఒంటరిగా క్షేమంగా వెళ్ళగలిగిన నాడే ఈ దేశానికి స్వతంత్రం వచ్చినట్లుగా భావించాలి అని మహాత్మాగాంధీ అన్న మాటలు ఒకసారి గుర్తు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అవసరానికి మించిన స్వేచ్ఛ, స్వతంత్రాలను కోరుకునే స్త్రీ పురుషుల మైండ్‌సెట్ మారాలి. అప్పుడే కొంతలో కొంతైనా ఈ అత్యాచారాలు, అఘాయిత్యాలు తగ్గుతాయేమో! దేశంలో తప్పు చేసినవారిని శిక్షించడానికి చట్టాలున్నాయి. కాని ఆ చట్టాలను సరైన సమయంలో సరైన పద్ధతిలో అమలు చేయకపోవటం వల్ల ఆ చట్టాల్లో ఉన్న లొసుగులను అవకాశంగా తీసుకుని నేరస్తులు తప్పించుకుంటున్నారు. ఇది సరి చేయాల్సిన అవసరం ఉంది.

## 18న శతాబ్ది సమర సంబురం

# కమ్యూనిస్టుల సమర నినాదమే ఖమ్మం



ఏనుగు వెంకటేశ్వరరావు

భారతదేశ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం 1925 డిసెంబర్ 26న ఆవిష్కృతమైంది. అప్పటి వరకు కమ్యూనిస్టు పార్టీ అభిమానులుగా ఎర్ర జెండా పేరుతో కార్యక్రమాలు నిర్వహించిన వారంతా ఏకమై వారి చర్చలు, ఆలోచనల అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ పురుడుపోసుకుంది. ఆవిర్భావం నుంచే నిర్బంధాలను ఎదుర్కొంది. బ్రిటిష్ సామ్రాజ్యవాద కాలంలోనే రష్యా విప్లవ విజయాలకు ప్రభావితులైన అనేక మంది విప్లవకారులు కమ్యూనిస్టు గ్రూపులుగా ఉండి ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టు గ్రూపులుగా ఉన్నప్పుడే విషాద, కాన్పూర్, మీరట్ లాంటి కుట్ర కేసులను ఎదుర్కొన్నారు. రాజకీయ యవ్వనికపై అనేక పార్టీలు భారతదేశంలో ఉద్భవించాయి. అదే రీతిలో కాల గర్భంలో కలిసిపోయాయి. కొన్ని పార్టీలకు చరిత్రే లేదు. మరికొన్ని పార్టీలు ప్రాంతీయవాదాలు, అధికార యావతో ఆవిర్భావించిన ఎక్కువ కాలం మనుగడ సాధించలేకపోయాయి. ఇవి కేవలం వ్యక్తుల ప్రయోజనాల కోసం సంకుచిత ఆశయాలతో ఏర్పడ్డవి. కానీ భారత కమ్యూనిస్టు పార్టీకి ఓ లక్ష్యం ఉంది, ఓ ఆశయం ఉంది. అన్నింటికి మించి అజరామరమైన సిద్ధాంతం ఉంది. మనిషిని మనిషి దోచుకోలేని ఓ సమాజం ఏర్పడాలని ఆర్థిక, సామాజిక రంగాల్లో సమభావం ఉండాలని కమ్యూనిస్టు పార్టీ ఆకాంక్ష. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం తీర్మానం చేసిన తొలి రాజకీయ పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ. సిపిఐ 1925లో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తీర్మానం చేస్తే రెండేళ్ల తర్వాత 1927లో మద్రాస్ సభలో కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేసింది. స్వాతంత్ర్య పోరాటంలోనూ వీరోచిత పాత్ర పోషించిన కమ్యూనిస్టులు భగత్‌సింగ్‌ను ఉరి తియ్యవద్దని తీర్మానించారు. జలియన్ వాలాబాగ్ ఉచకోతకు వ్యతిరేకంగా పోరాడిది కూడా కమ్యూనిస్టులే. ఆది నుంచి అకుంఠిత దీక్షతో కమ్యూనిస్టులు పనిచేశారు. స్వాతంత్ర్య అనంతరం ఈ దేశంలో గూడుకట్టుకున్న అనేక మూఢనమ్మకాలపై పోరాడుతూనే పాలకుల ద్వారా సంక్షేమ పథకాలను ప్రజలకు అమలు చేయాలని పోరాడింది. రాభభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ, దున్నేవాడికే భూమి దక్కాలని పోరాడి విజయం సాధించింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు మొదలు అనేక పోరాట విజయాలను సాధించింది. సాయుధ పోరాట ఘట్టం ప్రపంచ చరిత్రలో సువర్ణక్షర లిఖితం. అధికారాన్ని పొందలేక పోవచ్చు కానీ అంతకంటే మించిన ప్రజల అభిమానాన్ని కమ్యూనిస్టు పార్టీ చూరగొన్నది. అధికారం కోసం తన సిద్ధాంతాన్ని ఎప్పుడూ వదిలి పెట్టలేదు. ప్రజల పక్షమే తన పక్షమని నినదించింది. ఇటువంటి సుదీర్ఘ చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు వేడుకను ఖమ్మంలో జరుపుకుంటుంది. శతాబ్ది ఉత్సవ సంబురాలు జరుగుతున్న వేళ దేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుంది.





ఒక పక్క మతోన్మాదం మరో పక్క ధనోన్మాదం ఈ దేశాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. మైనార్టీలు దేశభక్తులు కాదని దేశ ద్రోహులనే ప్రచారం ఒక పక్క ప్రభుత్వమే ఒక మతాన్ని ప్రేరేపించడం లేదా ప్రచారానికి పూనుకోవడం ద్వారా భారతదేశ లౌకికవాదానికి తూట్లు పొడవడం, సెక్యూలరిజాన్ని పక్కన పెట్టడం ద్వారా ఒక పెనుప్రమాదాన్ని ఈ దేశానికి తెచ్చిపెడుతుంది. మతం ప్రాతిపదికన అధికారం పొందడమే పాలకుల లక్ష్యంగా మారింది. ఈ మతం ముసుగులో అనేకమంది దేశ ద్రోహులు దేశ భక్తులుగా మారిపోతున్నారు. జాతిపితను చంపిన వారికి గుడికట్టే రోజులు, ఎన్‌కౌంటర్ల పేరిట మారణ హోమం జరపండి, తుద ముట్టించండి అనే ఆదేశాలు జారీచేస్తున్న వారు ఇప్పుడు కొందరి దృష్టిలో సాహసవంతులుగా కనిపిస్తున్నారు. ఇది దురదృష్టకర పరిణామం. ఇదే సమయంలో ధనోన్మాదం పెరిగిపోయింది. తృప్తి అన్న పదం చాలామంది మది నుండి తొలగిపోయింది. వీలైనంత పోగేసుకునే యత్నంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయి. ఆర్థిక దోపిడీకి కేంద్ర పాలకుల వత్తాసు కారణంగా దేశ సంపద పదుల సంఖ్యలో ఉన్న సంపన్న వర్గాల చేతుల్లో పోగుపడింది. ఇటువంటి పరిస్థితుల్లో ఉద్యమ గడ్డ ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయి. శతాబ్ది ఉత్సవాలు ఏడాది పొడవునా జరగగా ముగింపు సభ ఖమ్మంలో జరుగుతుంది. ఖమ్మం కమ్యూనిస్టుల సమర నినాదం. అనేక ఉద్యమాలు పురుడుపోసుకున్న ఉద్యమ నేల ఇది. నిర్బంధాలను సైతం ధిక్కరించి రణ నినాదమిచ్చిన యోధులు తిరగడిన ఖమ్మంలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలు రేపటి ఉద్యమాలకు ప్రేరణగా నిలవనున్నాయి. పెరిగిన నిరుద్యోగం, అవినీతి, బంధుప్రీతి, ఆర్థిక అంతరాలు వీటన్నింటిని ఎదుర్కొనేందుకు బహుళ జన ప్రయోజనాలు లక్ష్యంగా శతాబ్ది ఉత్సవాలు సాక్షిగా భవిష్యత్తు ఉద్యమాలు విజయం సాధించాలని ఆ ఉద్యమాలకు ఖమ్మం దిక్సూచి కావాలని ఆకాంక్ష.

## అసలైన అమెరికన్లు ఎవరు?

అసలైన అమెరికన్లు ఎవరు? అమెరికాలో మానవ మనుగడ ఎప్పుడు మొదలైంది? అమెరికాలో ఉన్న అందరూ వలసదారులేనా? ఇలాంటి విచిత్ర ప్రశ్నలు ఎన్నో పుట్టుకొస్తున్నాయి. గత 20,000 ఏండ్ల క్రితం వరకు అమెరికానో మ్యాన్స్ ల్యాండ్ లేదా మానవజాతి లేని ప్రదేశంగా ఉండేది. కొలంబస్ (క్రీ శ 1451–1506) అమెరికాను కనుగొనక పూర్వమే దాదాపు 20,000 సం.ల క్రితం 'పాలియోఇండియన్స్' అనే ఆదివాసీ ఆసియా తెగలు ఉత్తర అమెరికాను కనుగొని ఆ ప్రాంతాలను ఆక్రమించి జీవించడం ప్రారంభించారు. ఆసియా, సైబీరియా ప్రాంతాల నుంచి ఆదివాసీ లేదా గిరిజన తెగలు ఉత్తర పసిఫిక్ తీర ప్రాంతాల నుంచి తమ సాధు జంతువుల మందలను తోలుకొని సైబీరియా, అలస్కా (ఆసి యా, ఉత్తర అమెరికాలో మధ్య) మధ్య ఉన్న 'బెరింజియా' అనే భూ వారధి గుండా ఉత్తర అమెరి కా ప్రాంతాలకు వలస వచ్చి తొలితరం అమెరికన్లుగా మానవ మనుగడను ప్రారంభించారని చరిత్ర చెబుతున్నది. 20,000 ఏండ్ల క్రితం నుంచి 12,000ఏండ్ల క్రితం వరకు ఆదివాసీ తెగలు ఉత్తర అమెరికాకు వలసలు రావడం కొనసాగింద ని తెలుస్తున్నది. ఏ ప్రత్యేక చరిత్ర, వారసత్వం లేని అమెరికన్లు వలసదారుల సమస్యను బూచిగా చూపుతూ, వారి సంతానానికి పౌరసత్వం రద్దు చేస్తున్నామని ట్రంపరితనం చూపడం ఆశ్చర్యకరం.



## అధైర్యపడకండి అండగా ఉంటాం

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

మిత్రషోరూం కార్మికుల సమ్మెకు సంఘీభావం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** అధైర్యపడవద్దని మీ సమస్య పరిష్కారం అయ్యేవరకు అండగా ఉంటామని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పెద్దతండలోని మిత్రషోరూమ్ ఎదుట కార్మికులు, ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె ఏడవరోజుకు చేరింది. దీనికి సిపిఐ జిల్లా సమితి, ఏఐటియుసి ఆధ్వర్యంలో సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కమ్యూనిస్టు పార్టీ కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలను చేసి సాధించిందన్నారు. కానీ ప్రస్తుత అధికార పాలకులు వీటిని నిర్వీర్యం చేస్తూ కార్మికుల పొట్ట కొడుతున్నారని, ధ్వజమెత్తారు. వాస్తవానికి కార్మిక హక్కుల నిబంధనల ప్రకారం షోరూం ఎత్తివేడం కుదరదని, అయినప్పటికీ ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే పెండింగ్ వేతనం, బోనస్, ఇన్సెంటివులు, గ్రాటివిటీ చట్టబద్ధంగా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులందరికీ ఉపాధి కల్పించాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల కష్టాలు, కన్నీళ్లు గుర్తించేది ఎర్ర జెండానే

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం సిపిఐ కార్యాలయంలో ఎడెల్లి కమలాకర్ అధ్యక్షతన జరిగిన మండల కార్యవర్గ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కష్టాలు, కన్నీళ్లు గుర్తించేది ఎర్ర జెండానే పోరాటాలు, ఉద్యమాల ఫలితంగానే సిపిఐ జానాధారణ పొందుతుందన్నారు. ఈనెల 18వ తేదిన ఖమ్మంలో సిపిఐ శత వసంతాల ముగింపు సభ జరుగుతుందని జయప్రదం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటియూసి మండల అధ్యక్షులు రాయపూడి రాజేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయి, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు మేలపురం సురేందర్‌రెడ్డి, ముత్తబోయిన వెంకటేశ్వర్లు, పగిడిపల్లి జంపయ్య, దంతాల జగదీష్, కమటం వీరన్న, ఎడెల్లి కమలాకర్, బండ్ల తిరుపతయ్య, కంచర్ల రవి, కల్లూరు నరసింహారావు, ఇరుగు శ్రీకాంత్, చిలుకాని శ్రీనివాస్, మర్రి నాగరాజు, దండి నాగేష్, మిత్తుల జిఆర్ , సబ్కా అజయ్, బడేటి ప్రవీణ్, ముత్తబోయిన వినోద, తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** ప్రతి అక్షరం ప్రజల కోసం ప్రజల సమస్యలపై పోరాడే ప్రజాపక్షం తెలుగు దిన పత్రిక 2026 క్యాలెండర్‌ను అన్నపురెడ్డిపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయం నందు హరి హర ఫౌండేషన్ ఛైర్మన్ మారగాని శ్రీనివాసరావు, జిల్లా విద్యాధికారి బి.నాగలక్ష్మి, జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఎంపిడిఓ మహాలక్ష్మి, తహసీల్దార్ ప్రతాప్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజయసింహారెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వీరబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు పతనమైపోతున్న ఈ రోజుల్లో విలువలను కాపాడే విధంగా అన్యాయాన్ని ప్రశ్నించే గొంతుకగా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే ప్రజాపక్షం తెలుగు దిన పత్రిక నిలుస్తుందన్నారు. ప్రజలు ఎన్నో సమస్యలతో అధికారుల దృష్టికి తీసుకురాలేని పక్షంలో ఈ పత్రిక ద్వారా తెలియపరుస్తూ తమ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రజలు ప్రజాపక్షం వెంట ఉంటున్నారని తెలియజేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం సారధినగర్‌కు చెందిన ఎస్కె అతిర్ 48వ డివిజన్ పరిధిలో తమ ఇంటి పక్కన అనాధికారికంగా కారం పిండిమిల్లు నడుపుతున్నారని దీని వల్ల తమ కుటుంబ సభ్యులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని మిల్లును మార్చాలని దరఖాస్తు చేశారు. వైరా శాంతినగర్‌కు చెందిన కె.వెంకటేశ్వర్లు తనకు 69 వయస్సు ఉందని వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. సత్తుపల్లి మండలం రుద్రక్షపల్లికి చెందిన కె.రమేష్ సిద్ధారం గ్రామానికి సంబంధించి రేషన్ షాపు డీలర్ పోస్టు ఖాళీగా ఉందని తనకు అర్హత ఉన్నందున ఆ పోస్టును మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. మధిర మండలం చిలుకూరు గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపును రద్దు చేయాలని కోరుతూ స్థానికులు దరఖాస్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ.పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఖర్చులు తగ్గి.. రైతుల ఆదాయం పెరగాలి



అవసరం మేరకే యూరియా వినియోగించాలి

భూసారాన్ని కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత

బేయర్ కంపెనీ డ్రోన్లను ప్రారంభించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** సాగు ఖర్చులను తగ్గించుకుంటూ ఆదాయం పెరిగేలా నూతన పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామంలో బేయర్ కంపెనీకి చెందిన వ్యవసాయ డ్రోన్లను అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ వ్యవసాయ డ్రోన్లను వినియోగించి పురుగుమందులు మోతాదులో మాత్రమే చల్లడం ద్వారా భూసారం పెరుగుతుందని యూరియా వినియోగం తగ్గుతుందని పంటలు దిగుబడి పెరుగుతాయన్నారు. కెమికల్స్ ఉన్న ఎరువుల వాడకం అధికం కావడం వల్ల పురుగు మందుల అవసరం ఉంటుందని రైతులు సహజ పద్ధతిలో సాగు చేయడంపై దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. బోగస్ కంపెనీలు, హెచ్‌టి విత్తనాల పేరిట నకిలీ విత్తనాలను రైతులకు అందించడం వల్ల చాలా నష్టపోతున్నారని రైతులు తెలిపారు. శాటిలైట్ ద్వారా తెగుళ్లు ఎక్కడ ఉందో గుర్తించి అక్కడ మాత్రమే పురుగు మందు వినియోగించేలా పైలెట్ ప్రాజెక్టు అగ్రివాస్ కంపెనీతో చేపట్టనున్నట్లు తెలిపారు. మన పంట పొలాల ఆరోగ్య పరిస్థితుల గురించి రైతులు తెలుసుకోవాలన్నారు. భూసార పరీక్షలకు సంబంధించి రికార్డులను అప్‌డేట్ చేస్తూ ప్రతి రైతుకు వివరాలు అందించే విధానం త్వరలో ప్రవేశపెడతామన్నారు. రైతులకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఎరువుల ధరలు క్రమబద్ధీకరణ ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగిందన్నారు. కాంప్లెక్స్ ధర రూ.1800, యూరియా ధర రూ.260 ఉండడంతో అధికంగా యూరియా వాడటం జరుగుతుందన్నారు. రైతులకు వ్యవసాయ సాంకేతికతను అందించేందుకు కంపెనీలు కృషి చేయాలన్నారు. వరి, పత్తి, మిర్చి సాగులో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగువైపు రైతులు దృష్టి సారించాలన్నారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా పంటల దిగుబడులు పెరుగుతాయన్నారు. వ్యవసాయ సాగులో యూరియా, పురుగు మందుల వాడకం తగ్గించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూన్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, చింతగుర్తి సర్పంచ్ తమ్మిని ప్రియాంక, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, మాజీ సర్పంచ్ తమ్మిని నాగేశ్వరరావు, బేయర్ కంపెనీ ప్రతినిధులు జీవీఎస్ నాయుడు, శివానంద, అశోక్‌రెడ్డి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

**బిటి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన**

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల గ్రాంట్ అందిస్తామని మంత్రి తెలిపారు. సోమవారం మంత్రి రఘునాథపాలెం మండలం పరిధిలోని రాములుతండా నుండి చింత గుర్తి క్రాస్ రోడ్డు తండా క్రాస్ రోడ్డు వరకు రూ.2.5 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సర్పంచ్ బానోత్ వెంకట్రాం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పన్నుల వసూళ్లపై పట్టింపేది?



కార్పొరేషన్‌లో వసూళ్ల మాయాజాలం

ఇంటి నెంబర్ కూడా లేకుండానే వ్యాపారాలు

కలెక్టరేట్‌ను తాకిన పైరవీ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కార్పొరేషన్ ఆదాయానికి కార్పొరేషన్‌లో పనిచేసే సిబ్బందే గండి కొడుతున్నారు. అనుమతులు లేని దుకాణాలపై చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారంటే దీని వెనక ఉన్న మతలబు అర్థం కావడం లేదు. వ్యాపారాలు నిర్వహించే వారు ఇంటి నెంబర్ సహా అన్ని అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దుకాణాన్ని సీజ్ చేయాలి. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఇల్లందు రోడ్డులోని విద్యుత్ కార్యాలయ సమీపంలో ఓ వ్యాపారి ఐరన్ సిండికేట్‌తో ఇతరత్రా వ్యాపారాలను నిర్వహిస్తున్నాడు. సదరు వ్యాపారి తన వ్యాపారాన్ని నిర్వహిస్తున్న ఇంటికి కార్పొరేషన్ కేటాయించిన ఇంటి నెంబర్ లేదు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులే ధృవీకరించారు. దీనితో పాటు ఎటువంటి అనుమతులు లేకుండా ఆరేండ్లుగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నా ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ విషయమై కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా అట్టి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియకుండా చేయడంలో కార్యాలయంలోనే కాదు ఈ వ్యాపారి పైరవీ కలెక్టరేట్‌ను తాకింది. ఓ ఉన్నతాధికారి సహాయకుడు ఈ వ్యాపారిపై వచ్చిన ఫిర్యాదులను ఆ అధికారి దృష్టికి పోకుండా అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ వ్యాపారి స్థలం, ఇల్లు లీజుకు తీసుకుని వ్యాపారం చేస్తుండగా లీజు గడువు కూడా ముగిసిందని ఇప్పుడు వివాదం న్యాయస్థానానికి చేరిందని సమాచారం. లీజు వ్యవహారం ఇద్దరు వ్యక్తులకు సంబంధించింది కానీ కార్పొరేషన్ అధికారులు వ్యాపారి నుంచి ఎందుకు పన్ను వసూలు చేయడం లేదన్న దానిపై కార్పొరేషన్ కార్యాలయం స్పందించడం లేదు. గతేడాది ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరినప్పుడు అనుమతులు లేవని, ఇంటి నెంబర్ లేదని అధికారులే ధృవీకరించారు. దీనితో ఈ దుకాణం విషయం వెలుగు చూసింది. ఇది జరిగి కూడా నెలలు గడిచి పోయింది. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఇటువంటి దుకాణాలు ఎన్ని ఉన్నాయి, కార్పొరేషన్ ఉద్యోగులు అనుమతులు లేని దుకాణాల నుంచి వసూళ్లు ఎంత అన్న దానిపై ఉన్నతాధికారులు విచారణ చేయాలి. కార్పొరేషన్ ఆదాయానికి గండికొడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకుని మొత్తం పన్ను వసూళ్లు చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



## సీతారావమ్మ మృతి సిపిఐకి తీరని లోటు

సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం

**ప్రజాపక్షం/చింతకాని :** రాఘువాపురం గ్రామ సిపిఐ సీనియర్ నాయకురాలు కొల్లి సీతారావమ్మ(90) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు.విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు రాఘువాపురం చేరుకుని సావిత్రమ్మ మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ సావిత్రమ్మ బతికినంత కాలం నిబద్ధతగల కమ్యునిస్టుగా బ్రతికిందన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, రైతు సంఘం మండల అధ్యక్షులు దొబ్బల వెంగళరావు, నాయకులు కొల్లి సీతయ్య, సింగారపు సత్యనారాయణ, కొల్లి రవి, కొల్లి గోవిందరావు, పాతూరి వెంకటి, నక్కబోయిన కృష్ణ, కొల్లి బాబు, కాంగ్రెస్ నాయకులు పెంట్యాల అప్పారావు, సిపిఎం నాయకులు రాచబంటి రాము, దొబ్బలబాబు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలు

విజేతలకు బహుమతులందజేసి మంత్రి పొంగులేటి దంపతులు, ఎంపి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీలోని 32వార్డులకు కలిపి పెద్దతండలోని సాయిప్రభాత్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు సోమవారం అట్టహాసంగా జరిగాయి. మున్సిపాల్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు 825మంది మహిళలు హాజరై రంగు రంగుల రంగవల్లును గీశారు. కేవలం ముగ్గులు వేయడమే కాకుండా, వాటిలో సామాజిక అంశాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో తమ సృజనాత్మకతను చాటారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భార్య మాధురితో కలిసి సతిసమేతంగా హాజరయ్యారు. అలాగే ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న లక్ష్మి ప్రసన్నకు రూ.30వేలు, ద్వితీయ బహుమంతి గెలుచుకున్న ఎన్.విజయ రూ.25వేలు, తృతీయ బహుమతి గెలుచుకున్న కె.నిర్మలకు రూ.20వేలు నాల్గవబహుమతి గెలుచుకున్న వి.నాగమణికి రూ.15వేలు, ఐదవ బహుమతి గెలుచుకున్న పి.రమాదేవికి రూ.10వేలు, 6 నుంచి 10 స్థానాల్లో నిలిచిన వారికి రూ.5వేల చొప్పున అందజేశారు. అంతేకాకుండా 11నుంచి20 స్థానాల వారికి రూ.2వేల చొప్పున, 21నుంచి30 స్థానాల వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పోటీలలో పాల్గొని ముగ్గేసిన 80ఏండ్లు వృద్దురాలికి రూ.2వేలను ప్రత్యేకంగా అందించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ ఛైర్మన్ బైరు హరినాథ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్, భూక్య సురేష్‌నాయక్, మండల నాయకులు వెంపటి రవి, కిషోర్, హరి, ప్రసాద్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో రాణించాలి

విద్యార్థులను అభినందించిన డిఈవో చైతన్యజైని



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించి ఖమ్మం జిల్లా పేరును ఇనుమడింపజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్యజైని తెలిపారు. ఈ నెల ఆరు నుండి తొమ్మిది వరకు కామారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఖమ్మం జిల్లా తరుపున పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులను సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో డిఈవో చైతన్యజైని ప్రత్యేకంగా అభినందించారు. డిఇఒ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించిన ఎగ్జిబిట్‌ను మరి కొంత ఆధునీకరించి జాతీయ స్థాయిలో పాల్గొనాలన్నారు. జనవరి 19 నుంచి జరగబోయే దక్షిణ భారత సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైన న్యూఇరా పాఠశాలకు చెందిన శ్రేష్ఠశ్రీ, వారి గైడ్ టీచర్లను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన చిన్నారులను డిఈవోతో పాటు ఎఎంవో పెసర ప్రభాకర్‌రెడ్డి, ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, గైడ్ టీచర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్లు రాధాకృష్ణ పాల్గొన్నారు.



## జమ్మిబండ వద్ద ముగ్గుల పోటీలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 41వ డివిజన్ జమ్మిబండ వద్ద ముగ్గుల పోటీలను నిర్వహించారు. సోమవారం కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, భవాని కూలర్స్ చారి, పాకాలపాటి రాంబాబు, స్థానికుల ఆధ్వర్యంలో జమ్మిబండ ప్రాంగణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ పునుకొల్లు నీరజ హాజరై ప్రారంభించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముగ్గుల పోటీలు మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిభింభిస్తాయన్నారు. విజేతలకు మొదటి బహుమతి వెండి పట్టీలు, రెండవ బహుమతి రైస్ కుక్కర్, తృతీయ బహుమత చీర అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బిజి క్లైమెంట్, దాదె అమృతమ్మ, ప్రముఖ న్యాయవాది బసవపున్నయ్య, సతీష్, దేవస్థానం ఈవో కొత్తూరు జగన్‌మోహన్‌రావు, కోదుమూరు వెంకటేశ్వర్లు, డాక్టర్ రఘు, చిన్ని, నవీన్, ఎండి కరీం, యాసిన్, జమ్మిబండ యూత్ తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు డిప్యూటీ సీఎం లేఖలు



విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రభుత్వం ప్రజల మధ్య వారిధిగా వినూత్న కార్యక్రమం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు చేపట్టినట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసాచారి తెలిపారు. అందులో భాగంగా గృహ జ్యోతి పథకం లబ్దిదారులకు, వ్యవసాయ ఉచిత లబ్దిదారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షల లేఖను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో గృహజ్యోతి, వ్యవసాయ లబ్దిదారులకు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క శుభాకాంక్షల లేఖలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖాధికారి శ్రీనివాసాచారి మాట్లాడుతూ వినియోగదారుల ఇండ్లకు విద్యుత్ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి స్వయంగా ఈ శుభాకాంక్షల లేఖలను అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాపా ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, విద్యుత్ శాఖాధికారులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వివేకానందుని స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వివేకానందుని స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని షీటీమ్స్ ఎస్ఐ షాహినా తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సోమవారం ఖమ్మం జిల్లా గ్రంథాలయంలో మేరా యువ భారత్ ఖమ్మం జిల్లా, ప్రజ్వల యువజన సంఘం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం షీ టీమ్స్ ఎస్ఐ షాహినా పాల్గొని వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేరా భారత్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.భానుచందర్, ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య, జిల్లా యువజన సంఘాల సమితి అధ్యక్షులు కోడిరెక్క ఉమాశంకర్, జాయింట్ సెక్రటరీ గోగుల చంద్రశేఖర్, లైబ్రరీ అధికారి బాబు, వాలంటీర్స్ నరేందర్, మోహన్‌లాల్, రవీందర్, యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా రహిత సమాజమే లక్ష్యం

సంకల్ప సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులకు వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తలసేమియా వ్యాధి బారీనపడుతున్న చిన్నారుల సంఖ్యను తగ్గించి భవిష్యత్తులో తలసేమియా రహిత సమాజం కోసం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కృషి చేస్తుందని ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ రెహనాబేగం తెలిపారు. సోమవారం ఖమ్మం కోణార్క్ హోటల్‌లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ తలసేమియా వెల్ఫేర్ సొసైటీ వైద్యులు చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఎంఏ అధ్యక్షురాలు రెహనాబేగం మాట్లాడుతూ తలసేమియాను అరికట్టాలంటే వివాహానికి ముందే అవసరమైన పరీక్షలు చేస్తే ఉత్తమమన్నారు. త్వరలో ఐఎంఏ ఆధ్వర్యంలో గైనకాలజిస్టు, పిల్లల వైద్యులతో కలిపి ఓ సెమినార్ నిర్వహిస్తామన్నారు. ప్రత్యేకంగా తలసేమియాపై అవగాహన కల్పించేలా ఈ సదస్సు ఉంటుందన్నారు. ఖమ్మం సిటిసి అడిషనల్ డిసిపి విజయ్‌బాబు మాట్లాడుతూ చిన్నారులకు అవసరమైన సేవలను అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. రక్తంతో పాటు ఇతర సేవలను అందిస్తామన్నారు.

**చిన్నారులకు అందుతున్న సేవలు భేష్**

తెలంగాణలో తలసేమియా చిన్నారులకు అందుతున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని జాతీయ తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జెఎస్ అరోరా తెలిపారు. గతంతో పోలిస్తే చిన్నారుల ఆరోగ్య పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయన్నారు. ఖమ్మంలో చిన్నారులను పరీక్షించామని వారికి సంకల్ప స్వచ్ఛంద సంస్థ నుండి అందుతున్న సేవలు బాగున్నాయన్నారు. సమయానికి రక్తం, మందులను అందించడం, వైద్య పరీక్షలు చేయించి చికిత్స చేయించడం వల్ల చిన్నారుల్లో ఎదుగుదల కనిపిస్తుందన్నారు. సంస్థ ఫౌండర్ అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ కోటేశ్వరరావు, వైద్యులు నారాయణమూర్తి, లక్ష్మి దీపా, నరేష్, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, బాధ్యులు పి.రవిచందర్, పి.ఉదయ్‌భాస్కర్, పి.వంశీకిరీటీ తదితరులు పాల్గొన్నారు.



## సిపిఎం నుండి సిపిఐలో చేరికలు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సిపిఎం పార్టీ నుండి పలువురు సిపిఐ పార్టీలో చేరారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సమక్షంలో పలువురు సిపిఐలో చేరారు. మండల పరిధిలోని పుటానితండాకు చెందిన బానోత్ నాగేశ్వరరావు, కోయచలకకు చెందిన టి.మధు, జంగాల మధు, చందు, మల్లప్ప, మహేష్, కామేపల్లి మండలం అడవి మద్దులపల్లికి చెందిన సత్తి రాములు సిపిఎం పార్టీని విడి సిపిఐలోకి చేరారు. వారికి కూనంనేని సాంబశివరావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పార్టీ విస్తరణకు కృషి చేయాలని తెలిపారు. ప్రతి గ్రామాన సిపిఐ జెండా ఎగురవేసి రజబ్‌అలీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు భారీ జన సమీకరణ చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, జిల్లా నాయకులు చింతల రమేష్‌లు పాల్గొన్నారు.

## ‘ప్రజాపక్షం’ క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కేసముద్రం:** కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసముద్రం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వై.సత్యనారాయణ ప్రజాపక్షం తెలుగు దిన పత్రిక 2026 క్యా లెండర్‌ను ఆవిష్కరించారు. పేరులో ఉన్న మాదిరిగా ప్రజల పక్షపాతిగా నూతన ఒరవడిని కొనసాగిస్తున్న ప్రజాపక్షం తెలుగు దిన పత్రిక యాజమాన్యానికి, విలేకరులకు, పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పక్షపాతం లేకుండా నూతన ఒరవడిని ఇలానే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల విలేకరి జన్ను శ్రీనువాస్, సిపిఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, నాయకులు పూజారి రవి, ఏఎస్‌ఐ, కానిస్టేబుల్లు పాల్గొన్నారు.

## నిరంతరం సమాజ చైతన్యంలో ‘ప్రజాపక్షం’ పాత్ర అమోఘం



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం గళమెత్తుతూ నిష్పక్షపాత వార్తలతో దూసుకుపోతున్న ప్రజాపక్షం దినపత్రిక సమాజ హితం కోరే పత్రిక అని బచ్చన్నపేట ఎస్‌ఐ ఎస్‌కే హమీద్ అని కొనియాడారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రజాపక్షం దినపత్రిక 2026 నూతన స ంవత్సర క్యాలెండర్‌ను బచ్చన్నపేట మండల విలేకరి తేలుకంటి శ్రీనివాస్‌తో కలిసి ఆయన ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఎస్‌ఐ హమీద్ మాట్లాడుతూ నిజాలను వెలికి తీయడంలో ప్రజల పక్షాన నిలబడడంలో ప్రజాపక్షం పత్రిక జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని ఆయన ప్రశంసించారు. పాఠకుల మనసు గెలుచుకునేలా వార్తా కథనాలను అందిస్తూ ప్రజలలో చైతన్యం రేకెత్తించడం ఒక్క మీడియా సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నర్సిరెడ్డి, అఖిల, రాకేష్, నవీన్‌రెడ్డి, విజయ్, మహేష్, వినయ్ పాల్గొన్నారు.

## బహిరంగ సభ గోడపత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఛలో ఖమ్మం బహిరంగ సభ గోడపత్రికను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శి జువారి రమేష్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ అనేక త్యాగాలు చేసి ప్రజలకు హక్కులను సాధించి పెట్టిందన్నారు. ఇంతటి చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. విద్యార్థుల నుండి మొదలుకొని అనేక యువజన, మహిళ, రైతు, బుద్ధి జీవుల హక్కుల కోసం పరిష్కారం కోసం సిపిఐ పార్టీ ఎనలేని కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సమ్మయ్య, విష్ణు, యాకూబ్ పాషా, బుచ్చయ్య, దూడయ్య, జాఫర్, అజయ్, లింగయ్య, నాయకులు బిక్షపతి, రవి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కా ర్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 4 6 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులు రానున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, అందువల్ల అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో పర్యవేక్షణ లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అ దనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

**ప్రజాపక్షం/జనగామ :** ఫార్మర్ రిజిస్ట్రీ (రైతు రిజిస్ట్రీ) ప్రతి రైతు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రైతు రిజిస్ట్రీ అనేది రైతుల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసి ఒక ముఖ్యమైన కార్యక్రమమని ఇది అగ్రి స్టాక్ అనే వ్యవసాయ కంప్యూటరీకరణ ప్రణాళికలో భాగంగా అమలవుతుందని రైతుల పేరు, చిరునామా, మొబైల్ నంబర్, భూమి వివరాలు ఇందులో నమోదు అవుతాయని ఈ రిజిస్ట్రీ ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరుతాయని తెలిపారు. ఇది పారదర్శకతను పెంచి మోసాలను తగ్గిస్తుందని ఈ రిజిస్ట్రీ ద్వారా రైతుల భూమి వివరాలు సులభంగా గుర్తిస్తారన్నారు. పీఎం కిసాన్ తదుపరి వాయిదా డబ్బులు రైతుల ఖాతాలలో జమ కావాలంటే ఈ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరని రైతులందరు కూడా తప్పకుండా సంబంధిత ఏఈవో ద్వారా కానీ మీ దగ్గరలో మీసేవ కేంద్రంలో కానీ నమోదు చేసుకోవాలని కలెక్టర్ రైతులను కోరారు.

# పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తల పాత్ర కీలకం

### కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఎంపి కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తల పాత్ర కీలకం అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో సోమవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో జరిగింది. ఈ సమావేశంలో పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలసి డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని వరంగల్ ఎంపీ కావ్య అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌పై పెట్టుకున్న విశ్వాసాన్ని మరింత పటిష్టం చేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే పదవుల కోసం కాదు, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే సిద్ధాంతబద్ధమైన పార్టీ అని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలదేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ మరింత బలపడేలా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నియోజకవర్గ ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. కాజీపేట బ్రిడ్జి, నాలా సమస్యల పరిష్కారం, వరద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి ఎన్నో కీలక పనులను విజయవంతంగా చేపట్టారని తెలిపారు. నాయిని రాజేందర్ రెడ్డి అవినీతి రహిత పాలనను అ ందిస్తూ, ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారని ప్ర శంసించారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నాయకులు రౌడీయిజం, అరాచక రాజకీయాలకు పాల్పడ్డారని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అజె ం డా పూర్తిగా అభివృద్ధి, ప్రజా సంక్షేమమేనని స్పష్టం చేశారు. రానున్న కార్పొరేష న్ ఎన్నికల్లో ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల ని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎమ్మెల్యే నాయిని రాజే ందర్ రెడ్డి డివిజన్ పర్యటనను విజయవంతం చేసి, పార్టీ బలాన్ని మరింత పెంచాలని కార్యకర్తలకు సూచించా రు.అనంతరం సోమవారం ప్రియాంక గాంధీ పుట్టిన రోజు సందర్భంగా ఎంపీ డా క్టర్ కడియం కావ్య హృదయ పూర్వక శుభాకాంక్షలు తె లిపారు. దేశ రాజకీయా ల్లో ప్రజల సమస్యలపై నిలబడి పోరాడుతున్న నాయకురాలిగా వారి సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ సమావేశంలో టిపిసిసిప్రధాన కా ర్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ఈ.వి. శ్రీనివాస్ రా వు ,పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు,జిల్లా గ్రంథాల యం సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు,ఆర్టీఏ సభ్యులు పల్లకొండ సతీష్ జి ల్లా అనుబంధ సంఘాల చైర్మన్లు బంక సరళ ,విక్ర మ్ ,రాజ్ కుమార్,శ్రవణ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకు లు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ‘ప్రణామ్’ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభం

### పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

**ప్రజాపక్షం/హనుమకొండ :** దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రారంభించిన ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను సోమవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ ప్రజా భవన్ నుండి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసిన ప్రణామ్ డే కేర్ సెంటర్లను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు.ఇందులో భాగంగా హనుమకొండ జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ శాఖ ఆవరణలో ఏర్పాటు చేసిన వర్చువల్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు స్నేహ శబరీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రణామ్ కార్యక్రమం ద్వారా వయోవృద్ధులను ఆదుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుండి 15 శాతం వరకు కోత విధించేలా బిల్లును బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్లను సీఎం వర్చువల్‌గా ప్రారంభించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఈ కేంద్రం హనుమకొండలో ప్రారంభం కావడం గర్వకారణమని తెలిపారు. రక్తదానం, సేవా కార్యక్రమాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుస్తున్న హనుమకొండ రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం స్వామి వివేకానంద జయంతి – జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యువత లక్ష్యసాధనలో స్వామి వివేకానందుని మార్గాన్ని అనుసరించాలని రెడ్ క్రాస్ చైర్మన్ పిలుపునిచ్చారు.



**ముఖ్యమంత్రి, మంత్రులకు కృతజ్ఞతలు**

ఇదే సందర్భంగా ట్రాన్స్‌జెండర్‌లను సమాజంలో సమానంగా చూడాలనే ఉద్దేశంతో, మునిసిపల్, కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్‌లను కోఆప్షన్ సభ్యులుగా తీసుకునే నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ట్రాన్స్‌జెండర్ సంఘం తరపున అభినందించారు. ఈ నిర్ణయం ట్రాన్స్‌జెండర్‌ల సామాజిక సాధికారతకు మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి. విజయచందర్ రెడ్డి (చైర్మన్), బొమ్మినేని పాపిరెడ్డి (కోశాధికారి),ఇ.వి. శ్రీనివాస్ రావు (రాష్ట్ర పాలకవర్గ సభ్యులు),జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిళ్ల రమణ రెడ్డి, బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి జె. జయంతి, వృద్ధులు డి. సాంబమూర్తి, కుక్కల సమ్మయ్య, కె. వీరభద్ర రెడ్డి, డా. పి.వి. శ్రీనివాస్ రావు, సిద్ధోజు విద్యాసాగర్, శ్రీపాద సుధాకర్ రావు,పి. సరళ, టి. శోభా కుమారి, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ముగింపు బహిరంగ సభకు తరలిరండి



సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు

**ప్రజాపక్షం/ ఎల్కతుర్తి :** భారత కమ్యూనిస్ట్ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, జనవరి 18 ఖమ్మంలో సిపిఐ 100 వసంతాల ముగింపు బహిరంగ సభకు భారీగా తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు కోరారు.ఎల్కతుర్తి మండల కేంద్రంలో సోమవారం గోడ పోస్టర్లను సిపిఐ నాయకులు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఊట్కూరి రాములు మాట్లాడుతూ ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల కొరకు అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసిన చరిత్ర సిపిఐ పార్టీకుందని ఆయన అన్నారు. కార్మిక ,విద్యార్థి, యువజన, రైతు ,మహిళా తదితర ప్రజా సంఘాలను నిర్మించి.అనేక భూ పోరాటా లు నిర్వహించి, ఇండ్లు లేని వారికి ఇండ్ల స్థలాలు కేటాయించిన ఘనత భరత కమ్యూనిస్టు పార్టీ దే అన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పెట్రోలు, డీజిల్, గ్యాస్ నిత్యవసర ధరలు తగ్గించాలంటే సిపిఐ పోరాటాల వల్లనే జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మ ణ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మర్రి శ్రీనివాస్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు తండ మొండయ్య, నిమ్మల మనోహర్, సుర మొగిలి, అశోక్ రావు, మోహన్ రెడ్డి, ఎంజాల పోశయ్య, ఎం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాకాంక్షలకు అనుగుణంగా పనులు

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. అవసరమైన ప్రతి ప్రాంతంలో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, గత ప్రభుత్వాలకంటే భిన్నంగా ప్రజలకు నేరుగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు.సోమవారం హనుమకొండలోని 61వ డివిజన్ పరిధి చైతన్యపురి కాలనీలో రూ.62 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వీటి వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ నిధుల సహాయంతో కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.అదేవిధంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజలు బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి ముందు కనీసం రెండు చెట్లను నాటాలని పిలుపునిస్తూ, పచ్చదనం పెరిగితే ఆరోగ్యకరమైన సమాజం నిర్మించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు

## ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. సోమవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సెగ్గంపల్లిలో శ్రీ రామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులకు, జంగేడులో మడేలయ్య మరియు శ్రీ రామాలయ నిర్మాణ పనులకు, రాంనగర్ లో దర్గా వద్ద ప్రహరీ గోడ నిర్మాణ పనులతో పాటు రూ.150 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఇతర ముఖ్య నేతలతో కలిసి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా మున్సిపల్ పరిపాలనను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే భూపాలపల్లి మున్సిపాలిటీని రాష్ట్రానికే ఆదర్శంగా నిలబెట్టవచ్చని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 30 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు గెలిపించుకొని భూపాలపల్లి మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎవురవేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సమ్మక్క-సారక్క బెల్లం దుకాణం ప్రారంభం



**ప్రజాపక్షం/గూడూరు;** సమ్మక్కసారక్క జాతర సందర్భంగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో గుగుతోల్ నరసింహ హోల్ సేల్ బెల్లం దుకాణంను సోమవారం మేజర్ సర్పంచ్ వాంకుడోత్ సునీత కోమ్మాలునాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా సునీత కోమ్మాలునాయక్ మాట్లాడుతూ సమ్మక్కసారక్క జాతర సందర్భంగా భక్తులు తమ మొక్కులను తీర్చుకోవడం కోసం వారి వారి ముక్కల నిమిత్తం బెల్లాన్ని బంగారంగా సమర్పించుకుంటారు భక్తులు హోల్ సేల్ షాప్‌లో బంగారాన్ని కొనుగోలు చేయాలని మీ డబ్బును ఆదాచేసుకొవాలని వారు తెలిపారు.ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ చంటి స్వామి వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి పింగిలి శ్రీనువాస్ ఎండి రసూల్ శివరాత్రి సంపత్ పేరాల సురేందర్ ఓర్సు రాజేందర్ కోరే కొమురయ్య శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణాదారుల అరెస్టు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భూపాలపల్లి సిఐ డి నరేష్ కుమార్ తెలిపారు. సోమవారం భూపాలపల్లి బస్టాండ్ సమీపంలోని కూరగాయల మార్కెట్ వద్ద నిషేధిత గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న తాడిచెర్ల గ్రామానికి చెందిన కుంట శివ (31), జిల్లా కేంద్రానికి చెందిన ఉర్సు దిలీప్ కుమార్ (27) అనే ఇద్దరు సోమవారం ఉదయం అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద నుండి 1650 (1కెజి 650 (గ్రామ్స్) గ్రాముల నిషేధిత గంజాయి లభించడంతో మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం (ఎన్‌డిపిఎస్ ఆక్ట్) ప్రకారం కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో భాగంగా గట్టి చర్యలు తీసుకుంటున్నామని,ఈ తరహా నేరాలపై సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## కార్మికుల హక్కులను కొల్లగొడుతున్న కేంద్రం

### ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్

**ప్రజాపక్షం / వరంగల్ :** శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలని, కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కొల్లగొడుతుందన్ని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర4వ.మహాసభల వాల్ పోస్టర్లు సికెఎం హాస్పిటల్ లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్బాంగా గన్నారపు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ. మహాసభలు 8 ఫిబ్రవరి 2026న వరంగల్ జిల్లాలో జరుగు మహాసభలను విజయవంతం చేయాలని ప్రభుత్వ హాస్పిటల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ, యాక్టివిటీ, ల్యాబ్, కంప్యూటర్ కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్ల మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమ దోపిడీ పెరుగుతుందని, పాలక వర్గాలు కార్పొరేట్ శక్తుల తొత్తుగా మారాయని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగై . మోదీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని ఆయన ఆరోపించారు. ఎన్డీఏ పాలనలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాల క్రింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రపంచీకరణ, మతోన్మాదం, కార్మిక చట్టాల సవరణ ఇప్పుడు అత్యంత వేగంగా ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని దీనిని ప్రతిఘటించేందుకు సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు. కార్మికుల సంక్షేమాన్ని చూడాల్సిన పాలకులు యాజమాన్యాల సంక్షేమాన్ని చూస్తున్నారని యాజమాన్యాలకు వేల కోట్ల రాయితీలు ప్రకటిస్తున్నా ప్రభుత్వాలు కార్మికుల గురించి ఆలోచించడం లేదన్నారు. పాలకులు అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుంతుంటే అదుపు చేయడంలో పాలకులు విఫలమయ్యారని, ధరలు పెరగడం వల్ల కార్మికులు మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా స హాయ కార్యదర్శి ఉప్పల్ల రవి, సికెయం హాస్పటల్ అధ్య క్ష కార్యదర్శులు కల్లకోట్ల రాజు, నాగవెల్లి శంకర్, సం ధ్య, సక్కుబాయి, లావణ్య, పద్మ, సుమతి, రజిత, సులోచన, తదితరులు పాల్గొన్నారు

## వేగవంతంగా అభివృద్ధి పనులు

### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** పట్టణంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అధికారులతో కలిసి పనుల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పట్టణ సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, వివిధ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సుందర్ ఔట్..

## మరో గంభీర్ ఫేవరేట్ ప్లేయర్‌కు చోటు!



న్యూజిలాండ్‌లో తొలి వన్డేలో గాయపడిన వాషింగ్టన్ సుందర్ మిగిలిన రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ విషయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) సోమవారం అధికారికంగా ప్రకటించింది. అతని స్థానంలో ఆశ్చర్యకరంగా ఢిల్లీ యువ ఆటగాడైన ఆయుష్ బదోనిని ఎంపిక చేసింది. షెహ్బాజ్ అహ్మద్‌కు అవకాశం దక్కుతుందని అంతా భావించగా.. సెలెక్టర్లు ఆయుష్ బదోనిని ఎంపిక చేశారు. ఐపిఎల్లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున బరిలోకి దిగే ఆయుష్ బదోని అభిమానులకు సుపరిచితమే.

**సుందర్ దూరం....**'న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో బౌలింగ్ సందర్భంగా పక్కటెముకల కింది భాగంలో నొప్పి వస్తుందని భారత ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ మెడికల్ టీమ్‌కు తెలియజేశాడు. మ్యాచ్ అనంతరం అతడికి స్కానింగ్ తీశారు. వైద్యుల అభిప్రాయం కోసం బిసిసి మెడికల్ టీమ్ వేచి చూస్తుంది. ఈ వన్డే సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లకు సుందర్ దూరమయ్యాడు. అతడి స్థానంలో ఆయుష్ బదోనిని భారత పురుషుల సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది. రెండో వన్డే జరిగే రాజ్‌కోట్‌లో బదోని భారత జట్టుతో కలవనున్నాడు.'అని బిసిసిఐ తమ ప్రకటనలో పేర్కొంది. తొలి వన్డేలో సుందర్ ఐదు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి 5.40 ఎకానమీతో 27 పరుగులు ఇచ్చాడు. ఒక్క వికెట్ కూడా తీయలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో బ్యాటింగ్‌కు వచ్చిన సుందర్.. కెఎల్ రాహుల్‌కు అండగా నిలిచాడు. 7 పరుగులతో అజేయంగా నిలిచాడు.

**గంభీర్ ఫేవరేట్ ప్లేయర్...** సుందర్ స్థానంలో ఆయుష్ బదోనిని ఎంపిక చేయడంపై సోషల్ మీడియా వేదికగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గంభీర్ సూచనలతోనే బదోనిని సెలెక్టర్లు ఎంపిక చేశారనే వాదన వినిపిస్తోంది. గతంలో బదోనిని గంభీరే ఐపిఎల్‌కు పరిచయం చేశాడు. లక్నో సూపర్ జెయింట్స్కు మెంటార్గా ఉన్న సమయంలో ఈ ఢిల్లీ ఆటగాడిని వేలంలో కొనుగోలు చేయడంతో పాటు తుది జట్టులో ఆడించాడు. ఐపిఎల్లో మెరుగైన ప్రదర్శన చేసిన బదోని.. దేశవాళీ క్రికెట్లో ఢిల్లీకి ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. బదోని బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ కూడా చేయగలడు. అయితే ఇటీవల జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో అతను పెద్దగా రాణించలేదు. 4 మ్యాచ్‌లలో ఆడి 16 పరుగులే చేశాడు. బౌలింగ్‌లో4 వికెట్లు మాత్రమే తీశాడు.

### న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికైన భారత జట్టు...

శుభమన్‌గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్(వైస్ కెప్టెన్), ఆయుష్ బదోని, రవీంద్ర జడేజా, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్.

## ఉప్పెనలా విరుచుకుపడిన హ్యారిస్..

## ఆర్‌సిబికి రెండో విజయం..!



మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జోరు కొనసాగుతోంది. తొలిపోరులో ఫినిషర్ డీక్లెర్క్ మెరుపులతో గెలుపొందిన ఆర్సీబీ.. ఈసారి ఏకపక్ష పోరులో యూపీ వారియర్స్‌ను 9 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. 143 పరుగుల ఛేదనలో ఓపెనర్లు గ్రేస్ హ్యారిస్(85) పవర్ ప్లేలోనే అర్ధ శతకంతో విరుచుకుపడింది. గెలుపు వాకిట ఈ చిచ్చర పిడుగు ఔటైనా.. స్మృతి మంధాన(47 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్‌తో మ్యాచ్‌ను ముగించింది. సమిష్టి వైఫల్యంతో యుపి జట్టు వరుసగా రెండో ఓటమిని చవిచూసింది. రెండో సీజన్ విజేత ఆర్‌సిబి ఛాంపియన్ ఆటతో రెండో విక్టరీ కొట్టింది. డివై పాటిల్ మైదానంలో బౌలర్ల విజృంభణతో యుపి వారియర్స్‌ను తక్కువ స్కోర్‌కు కట్టడి చేసిన బెంగళూరు మోస్తరు లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. యూపీ నిర్దేశించిన 144 పరుగుల ఛేదనను ఆర్‌సిబి ఓపెనర్లు దూకుడుగా ఆరంభించారు.

## క్రికెట్‌కు లెగ్ స్పిన్నర్ వీడ్కోలు



భారత స్పిన్నర్ కేసీ కరియప్ప సుదీర్ఘ కెరీర్కు వీడ్కోలు పలికాడు. జాతీయ జట్టుకు ఆడాలన్న కల నెరవేరకుండానే అతడు భారత క్రికెట్ నుంచి వైదొలిగాడు. కర్నాటక జట్టు తరపున దేశవాళీలో గొప్ప ప్రదర్శన అతడు అవకాశాల కోసం నిరీక్షించాడు. కానీ, టీమిండియాకు ఆడాలనే అతడి స్వప్నం సాకారమవ్వలేదు. అటు ఐపీఎల్లోనూ ఎవరూ కొనలేదు. దాంతో.. సోమవారం నుంచి భారత క్రికెట్కు అల్విదా పలుకుతున్నానని చెప్పాడు. దేశవాళీ క్రికెట్లో తానేంటో నిరూపించుకున్న కరియప్ప.. గూగ్లీ, క్యారమ్ బాల్స్ వేయడంలో ఆరితేరాడు. ప్రతిభ ఉన్నప్పటికీ అదృష్టం కలిసి రాకపోవడంతో అతడి కెరీర్ ఏంతగొప్పగా సాగలేదు. లెగ్ స్పిన్నర్గా వైవిధ్యం చూపగల సత్తా ఉన్నప్పటికీ దేశవాళీ, ఐపీఎల్కే మాత్రమే పరితమమయ్యాడు. 'వీధుల నుంచి స్టేడియంలో ఆడడం, పలు జట్ల జెర్సీ ధరించడం గర్వంగా అనిపించింది. నేను ఒకప్పుడు కన్న కలను నిజం చేసుకున్నాను.

## యువతరంగం

# 'దయ'ను ఉద్యమంగా మార్చిన ఓరియన్

ఓరియన్ జీన్ వయస్సు కేవలం పదకొండు ఏళ్లు. కానీ అతని ఆలోచనలు, చర్యలు అనేక పెద్దలకూ ఆదర్శంగా నిలిచాయి. 2020లో ప్రపంచం మొత్తం కొవిడ్ మహమ్మారి భయంతో అల్లాడుతున్న సమయంలో, చాలా మంది తమతమ సమస్యల్లో తాము మునిగిపోయారు. అదే సమయంలో ఓరియన్ మాత్రం చుట్టూ ఉన్నవారి కష్టాలను గమనించాడు. ఆకలి, అసమానత, ఒంటరితనం వంటి సమస్యలు అతన్ని కదిలించాయి. 'నేను చిన్నవాడినే కదా' అనే ఆలోచన అతనిని ఆపలేదు. దయ, జాలితో మొదలయ్యే మార్పు ఎంత పెద్దదైనా అవుతుందని అతను నమ్మాడు. ఆ నమ్మకంతోనే అతను 'రేస్ టు కైండ్‌నెస్ ఫౌండేషన్'ను స్థాపించాడు. దయను కేవలం మాటల్లో కాకుండా, కార్యాచరణలో చూపించాలనే ఉద్దేశంతో ఈ సంస్థను ప్రారంభించాడు. అదే సంవత్సరంలో ఈ సంస్థ నిర్వహించిన 'రేస్ టు 100కే మీల్స్' కార్యక్రమం దేశవ్యాప్తంగా వేలాది కుటుంబాలకు ఆశగా మారింది. ఈ కార్యక్రమం ద్వారా లక్షకు పైగా ఉచిత భోజనాలు అవసరమైన వారికి అందాయి. ఒక చిన్నారి ఆలోచన ఎలా వేలాది ఆకలితో ఉన్న కుటుంబాల జీవితాల్లో వెలుగుని నింపగలదో దీనివల్ల స్పష్టమైంది. ఓరియన్ చేసిన సేవలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. 2021లో అతనికి 'టైమ్ కిడ్ ఆఫ్ ది ఇయర్' గౌరవం లభించింది. ఈ గుర్తింపు అతని వయసుకు మాత్రమే కాదు, అతని విలువలకు దక్కింది. జాలి, దయ, సహానుభూతి,




నాయకత్వం.. ఇవి పాఠ్యపుస్తకాలలో ఉండే పదాలు కాదు, జీవన విధానాలని అతను నిరూపించాడు. తన అనుభవాన్ని ఇతర పిల్లలతో పంచుకోవాలనే కోరికతో ఓరియన్ తన మొదటి పుస్తకాన్ని రాశాడు. 'ఎ కిడ్స్ బుక్ అబౌట్ లీడర్‌షిప్' అనే ఈ పుస్తకం పిల్లలకు నాయకత్వం అంటే అధికారమో, ఆజ్ఞలివ్వడమో కాదని చెబుతుంది. నిజమైన నాయకత్వం అంటే దయతో ముందుకు నడవడం, ఇతరులను ప్రోత్సహించడం, మంచి మార్పుకు మొదటి అడుగు వేయడమని ఈ పుస్తకం తెలియజేస్తుంది. ఇది చిన్నారుల్లో నేనూ మార్పు తీసుకురాగలను అనే నమ్మకాన్ని నాటుతుంది. ప్రస్తుతం 'రేస్ టు కైండ్‌నెస్ ఫౌండేషన్' నిర్వహిస్తున్న మరో ముఖ్యమైన కార్యక్రమం 'రేస్ టు 500కే బుక్స్'. ఈ ఉద్యమం పిల్లలకు పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావడ మే లక్ష్యంగా పెట్టుకుంది.

పుస్తక దాన కార్యక్రమాలు, ఉచిత బాలల పుస్తక ప్రదర్శనలు నిర్వహిస్తూ, కుటుంబాలు తమ పిల్లల కోసం ఉచితంగా పుస్తకాలు తీసుకెళ్లే అవకాశాన్ని కల్పిస్తోంది. చదువే భవిష్యత్తుకు పునాది అనే నమ్మకం ఈ కార్యక్రమం వెనుక ఉంది. ఓరియన్ జీన్ కథ విద్యార్థులకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుంది. నాయకత్వానికి వయస్సు అడ్డంకి కాదు. దయతో కూడిన ఆలోచన ఒక చిన్న అడుగుతో మొదలైనా, అది పెద్ద ఉద్యమంగా మారగలదు. సమీప ప్రాంతాల్లో 'రేస్ టు 500కే బుక్స్' వంటి కార్యక్రమాలు జరిగితే, విద్యార్థులు వాటిలో పాల్గొనవచ్చు. ఇలా భాగస్వాములవడం ద్వారా వారు సేవా భావాన్ని నేర్చుకుంటారు. చివరగా ఓరియన్ జీన్ మనకు చెప్పేది ఒక్కటే..ప్రపంచాన్ని మార్చాలంటే ముందుగా మన మనసులో దయను పెంచుకోవాలి. ఆ దయ చర్యగా మారినప్పుడే నిజమైన నాయకత్వం జన్మిస్తుంది.

## కుటీర పరిశ్రమలే కీలకం

భారత ఆర్థిక వ్యవస్థలో చిన్న తరహా మరియు కుటీర పరిశ్రమలు అత్యంత కీలకమైన స్థానాన్ని ఆక్రమించాయి. ఉపాధి సృష్టి, సమగ్ర వృద్ధి, ప్రాంతీయ సమతుల్యత వంటి లక్ష్యాలను సాధించడంలో ఇవి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై ఆధారపడిన జనాభాకు ప్రత్యామ్నాయ జీవనోపాధిని కల్పిస్తూ, దేశ ఆర్థిక నిర్మాణానికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయి. చిన్నతరహా మరియు కుటీర పరిశ్రమలు గ్రామీణ ఉపాధి సృష్టిలో కీలకంగా ఉన్నాయి. దేశంలోని చిన్నతరహా పరిశ్రమల రంగం ద్వారా 11 కోట్లకుపైగా మందికి ఉపాధి లభిస్తుండగా, అందులో దాదాపు సగం పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. వ్యవసాయానికి అదనపు ఆదాయ మార్గాలుగా ఇవి రైతు కుటుంబాలకు ఉపయోగపడుతూ, వ్యవసాయేతర కాలంలో ఆదాయ భద్రతను కల్పించి పేదరికాన్ని తగ్గిస్తున్నాయి. మహిళల భాగస్వామ్యం కూడా ఈ రంగంలో గణనీయంగా ఉంది. చేతిమగ్గాలు, హస్తకళలు, ఖాదీ, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పనిచేస్తూ ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవాన్ని పొందుతున్నారు. వెనుకబడిన ప్రాంతాల్లో వికేంద్రీకృత ఉత్పత్తిని ప్రోత్సహించడం ద్వారా ఈ పరిశ్రమలు ప్రాంతీయ అసమానతలను తగ్గించడంలో తోడ్పడుతున్నాయి. గ్రామాల నుంచి పట్టణాలకు వలసలను నియంత్రిస్తూ సమతుల్య అభివృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, గిరిజనులు, అల్పసంఖ్యాక వర్గాలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా సమగ్ర వృద్ధిని ప్రోత్సహిస్తున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి కల్పించే లక్షణం వీటికి ప్రత్యేకత. స్థానిక ముడి సరుకులు, సంప్రదాయ నైపుణ్యాలు, తక్కువ శక్తి వినియోగంతో ఉత్పత్తి జరగడం వల్ల పర్యావరణహిత అభివృద్ధితో పాటు సాంస్కృతిక వారసత్వాన్ని కూడా ఇవి కాపాడుతున్నాయి. దేశంలో కుటీర పరిశ్రమలు ప్రాంతీయ వనరులు, సంప్రదాయ నైపుణ్యాలకు అనుగుణంగా విస్తరించి ఉన్నాయి. ఖాదీ పరిశ్రమలు గుజరాత్, మధ్యప్రదేశ్, మధ్య భారత మైదానాల్లో అభివృద్ధి చెందగా, కొయిర్ పరిశ్రమ కేరళ, తమిళనాడులో



విస్తరించింది. రాయి శిల్పకళ రాజస్థాన్‌లో, పట్టు పరిశ్రమ తమిళనాడు, కర్ణాటక, ఈశాన్య రాష్ట్రాల్లో, కార్పెట్ పరిశ్రమ భదోహి, జమ్మూ కాశ్మీర్ ప్రాంతాల్లో అభివృద్ధి చెందింది. అయితే ఈ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. తక్కువ వడ్డీతో సమయానికి రుణాలు లభించకపోవడం, మౌలిక సదుపాయాల కొరత, ముఖ్యంగా విద్యు త్ సమస్యలు ప్రధాన అడ్డంకులుగా ఉన్నాయి. పాత సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడటం వల్ల ఉత్పాదకత తగ్గుతోంది. మార్కెటింగ్ వ్యవస్థ బలహీనంగా ఉండడం, బ్రాండింగ్, నాణ్యత ప్రమాణాల లేమి కారణంగా ఉత్పత్తులకు సరైన మార్కెట్ లభించడం లేదు. 1990 తర్వాత గ్లోబలైజేషన్ నేపథ్యంలో పెద్ద పరిశ్రమలు, దిగుమతులతో పోటీ పెరగడంతో అనేక సంప్రదాయ వృత్తులు క్షీణిస్తున్నాయి. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు పలు చర్యలు అవసరం.

# రౌడీయిజాన్ని అంతమొందించేందుకే జనసేవాదళ్





### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** విజయవాడలో విచ్చలవిడిగా గుండాయిజం రాజ్యమేలుతున్న రోజుల్లో దాన్ని అంతమొందించేందుకే సిపిఐ జాతీయ కార్యదర్శి చంద్రా రాజేశ్వరరావు 1964లో జనసేవాదళ్‌ను స్థాపించారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ గుర్తుచేశారు. సోమవారం నస్పూర్ మండలంలోని శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి జనసేవాదళ్ శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విస్తృత కార్యకలాపాలకు, నాయకత్వానికి అండగా నిలిచిందని కొనియాడారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభలో జనసేవాదళ్ కవాతు నిర్వహించాలనే లక్ష్యంతో ఇన్‌స్ట్రక్టర్ గోసిక మోహన్ నేతృత్వంలో ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కలవేణ శంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాస్, జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, కె.వీరభద్రయ్య, దాగం మల్లేష్, కలిందర్ అలీఖాన్, చిప్ప నరసయ్య, ఇప్పకాయల లింగ య్య, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొంకుల రాజేష్, లింగంరవి, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, నాయకులు సంతోష్, బానేష్, పూజారి రామన్న, కొత్తపల్లి మహేష్, ఆంజనేయులు, సారంగపాణి, రాకేష్, నవీన్ పాల్గొన్నారు.

### యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : బాలనర్సింహ్మా

**నాగర్‌కర్నూల్ :** సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న మత్తు మహమ్మారిని తరిమికొట్టే బాధ్యత యువ కమ్యూనిస్టులైన జనసేవాదళ్ సభ్యులు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా పిలుపునిచ్చారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో వెలమ ఫంక్షన్‌హాలులో సిపిఐ జిల్లా జనసేవాదళ్ క్యాంపును సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అధ్యక్షతన ప్రారంభించారు. ఈసందర్భంగా బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న ఈ మత్తు మహమ్మారిని అంతమొందించేందుకు శాస్త్రీయభావాలు కలిగిన చైతన్యవంతమైన యువతరం నడుం బిగించి ముందుకు రావాలని ఆయన కోరారు. సిపిఐ శత వార్షిక ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మం మహానగరంలో భారీ బహిరంగసభ గొప్ప ప్రజాప్రదర్శన నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా నుంచి యువ కమ్యూనిస్టులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి, సిపిఐ జనసేవాదళ్ రాష్ట్ర కమాండర్ పంజాల రమేష్, సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు వార్ల వెంకటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నీరు నర్సింహ్మా, జిల్లా కమాండర్స్ బిజ్జ శ్రీనివాస్, బండి లక్ష్మి పతి, జిల్లాసమితి సభ్యులు శివ శంకర్, బొల్లెద్దుల శ్రీనివాస్, తుమ్మల శివుడు, రవీందర్, కుమార్, ప్రేమ్‌కుమార్, కిరణ్‌కుమార్, మల్లయ్య, నరేష్, మధుగౌడ్, వెంకటస్వామి, శివ కృష్ణ, రమణ, జంగం శివుడు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో

# ప్రజాపోరాటాలు, త్యాగాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/ఉప్పల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ప్రస్థానం ప్రజాపోరాటాలు, త్యాగాలతో నిండిన చరిత్ర అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విఎస్.బోస్ అన్నారు. జనవరి 18న ఖమ్మంలో జరగనున్న ససిపిఐ శత జయంతి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండల కేంద్రంతో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఖమ్మం బహిరంగ సభ కరపత్రాలను, పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో సిపిఐ పాత్ర కీలకమన్నారు. దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం తొలి పిలుపునిచ్చిన పార్టీ సిపిఐనేనని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల త్యాగాలను గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడిందని, భూసంస్కరణలు, బ్యాంకుల జాతీయీకరణ వంటి కార్యక్రమాలు ఆపోరాటాల ఫలితమేనన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు పి.రాంనారాయణ, నర్సింహారావు, బొడ్డుపల్లి కృష్ణ, టూరిజం కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజమౌళి, ఎఐఎస్ఎఫ్ నాయకులు మహేష్, అజీమ్ పాషా తదితరులు పాల్గొన్నారు



### మతోన్మాదశక్తులను లౌకిక ప్రజాతంత్రవాదులు ఐక్యంగా ఎదుర్కోవాలి : విజయసారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మునుపెన్నడూ లేని విధంగా మతోన్మాద శక్తుల ఆగడాలు పెట్రేగిపోతున్న క్రమంలో లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా ఎదుర్కోవాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల శతాబ్ది ఉత్సవాలు ఈనెల 18న ఖమ్మంలో జరుగుతున్న సందర్భంగా కురవి మండల కేంద్రంలో ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన లౌకిక వాద పరిరక్షణ మతోన్మాదంపై పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో విజయ సారథి పాల్గొని మాట్లాడారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అవలంభిస్తున్న మతోన్మాద విధానాలపై నివారించడానికి అనేక ఉద్యమాలు చేస్తున్నది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. టియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు చిత్తనూరు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు గుర్తుకొచ్చే కమ్యూనిస్టులు బలహీనపడితే దేశానికి, బలహీన వర్గాలకు అత్యంత ప్రమాదమని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని అన్నారు. సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు హెచ్.లింగన్న, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రవికుమార్, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు రాజేందర్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, దైద భద్రయ్య, సిపిఐ నాయకులు బుర్ర సమ్మయ్య, కన్న వెంకన్న, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, సామ పాపయ్య, ఉప్పలయ్య, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# లౌకికశక్తులతోనే ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణ



సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నానాటికి ఖూనీ అవుతున్న ప్రజాస్వామ్యం, అభాసుపాలవుతున్న రాజ్యాంగ పరిరక్షణ లౌకిక శక్తులతోనే సాధ్యమని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక సిపిఐ కార్యాలయంలో సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశం ముప్ప వెంకటేశ్వరరావు(లడ్డా) అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాసాబీర్‌పాషా పాల్గొని మాట్లాడుతూ లౌకిక వాద పరిరక్షణ కోసం, ప్రజలను ప్రగతిశీల శక్తులను ఏకం చేస్తున్నది కమ్యూనిస్టులు మాత్రమేనని అన్నారు. 1925లో ఆవిర్భవించిన సిపిఐ పార్టీ ఆ దిశగా పయనిస్తూ నూరేళ్లు పూర్తి చేసుకుందని, రానున్న మరో వందేళ్లు కూడా ఉద్యమస్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. సిపిఐ శత వసంత ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని18న ఖమ్మం కేంద్రంగా జరిగే భారీ బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుండి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, కమటం వెంకటేశ్వర్లు, ఉప్పుశెట్టి రాహుల్, ఫహీమ్, ఉదయ భాస్కర్, రేసు ఎల్లయ్య, దేవరకొండ శంకర్ పాల్గొన్నారు.

### హలో కామ్రేడ్.. చలో ఖమ్మం : యానాల

**భువనగిరిరూరల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దామోదర్‌రెడ్డి మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ వంద వసంతాల ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగే భారీ బహిరంగ సభకు యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి హాలో కామ్రేడ్...చల్లో ఖమ్మం నినాదంతో పార్టీ సభ్యులు సానుభూతిపరులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని అయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, చెక్క వెంకటేష్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు సామల భాస్కర్, పట్టణ సహాయ కార్యదర్శి చింతల మల్లేష్, మధు తదితరులు పాల్గొన్నారు.



### యువజన సమస్యల పరిష్కారమే అజెండా : ఈ.టి.నర్సింహా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువజన సమస్యల పరిష్కార అజెండానే అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ప్రధాన కర్తవ్యమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నర్సింహా అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువజన అభివృద్ధికి, ఉపాధి అవకాశాలు కల్పనకు నిర్దిష్టమైన విధానాలు అవలంబించాలన్నారు. ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రూపొందించిన 2026 క్యాలెండర్‌ను హిమాయత్‌నగర్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఈటి.నర్సింహా ముఖ్య అతిధిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈటి. నర్సింహా మాట్లాడుతూ నేడు యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని, ఈ చెడు వ్యసనాలకు వ్యతిరేకంగా ఎఐవైఎఫ్ పోరాటం చేయాలని సూచించారు. స్వాతంత్ర్య ఆకాంక్షలకు భిన్నంగా నేడు పాలకులు దేశాన్ని, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అమ్మడానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని, వీటికి వ్యతిరేకంగా యువత పోరాడాలని, అందుకు సమాజాన్ని పఠనం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్యప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, కళ్యాణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.



## మెడికల్ కాలేజీ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి గత మూడు నెలలుగా పెండింగులో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ శుభోదయం కుమార్ ను కలిసి పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలతో పాటు ఇపిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, ఐడి కార్డులు, అపాయింట్మెంట్ లెటర్లు, డ్రెస్ కోడ్ వంటి సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు కాంట్రాక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు రాకపోవడంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సందీప్, షేకు, సాయి, దేవిక, సమ్రీన్ బాను, రాంజీ, మహేష్, రోజా, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



## సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ అధ్యక్షుడిగా గుండం రారాజు

**ప్రజాపక్షం/తిర్యాణి :** తిర్యాణి మండలం చిన్నారెడ్డిపల్లి స్టేజి వద్ద గల సమ్మక్క సారలమ్మ దేవాలయ జాతర కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా తుమ్రం మాన్కు, జుగునాక కవిత, అధ్యక్షుడిగా గుండం రారాజు, ఉపాధ్యక్షుడిగా చండీ అశోక్, సిడం తులసిరాం, ప్రధాన కార్యదర్శిగా కుడ్మేత అర్జున్, కోశాధికారిగా మార్నెని తిరుపతి, రాయి సిడం రవి ఎన్నికయ్యారు. గ్రామ పెద్దలు వెడ్మ లచ్చు, రాయి సిడం జన్నంతరావు, జుగునక దినకర్, ఏదుల పోషమల్లు, చండి రాజయ్య, తుమ్రం దస్వంత్, రాము, ఆత్రం అనంతరావు, రాయి సిడం మోతిరామ్, గేడమ్ పరశురాం ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.



## సమాజ మార్పులో మీడియా పాత్ర కీలకం

### బిజెపి నాయకుడు కిరణ్

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** సమాజ మార్పులో మీడియా పాత్ర ఎంతో కీలకమని బిజెపి నాయకులు కిరణ్ అన్నారు. సోమవారం రెబ్బెనలో ప్రజాపక్షం దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ సమాచారాన్ని చేరవేయడంలో మీడియా ముఖ్యభూమిక పోషిస్తుందని తెలిపారు. నిజాలను నిర్భయంగా రాయాలని సూచించారు. ప్రజా సమస్యలను వెలికితీయడంలో ప్రజాపక్షం దినపత్రిక పోషిస్తున్న పాత్ర అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం బెల్లంపల్లి విలేకరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్

**ప్రజాపక్షం/జన్నారం :** మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని వీర్లగుట్టపై వెలిసిన మేదరి కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ కేతేశ్వర కంకలమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈ జాతరకు ఖానాపూర్ ఎంఎల్ఏ వెడ్మా బొజ్జు పటేల్ హాజరై ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్ఏ కేతేశ్వర, కంకాలమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయానికి రోడ్డు, కరెంట్, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మార్ సర్సింగరావు, చిలువేరు నర్సయ్య, పిల్లి మల్లయ్య, పర్ల కనకయ్య, కోడి జుట్టు రాజన్న, కనికరపు అశోక్, పోతు సురేష్, రమణ, వేముల నర్సయ్య, శంకర్, కృష్ణ, సుధీర్, వెంకటేష్, సతీష్, సురేందర్, గంగాధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గృహజ్యోతి లబ్ధిదారులకు డిప్యూటీ సిఎం లేఖలు : ఎస్ఇ జాడే ఉత్తమ్

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** విద్యుత్ గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు, ఉచిత విద్యుత్ పొందుతున్న రైతులకు డిప్యూటీ ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సందేశంతో కూడిన లేఖలను అందజేయనున్నట్లు ఆసిఫాబాద్ ఎస్ఇ జాడే ఉత్తమ్ తెలిపారు. సోమవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సర్వీస్ నంబర్, పేర్లతో కూడిన లేఖలను విద్యుత్ శాఖ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ డివిజనల్ ఇంజనీర్ నాగరాజు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఇర్ఫాన్ అహ్మద్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ రాజమల్లు, ఏఈలు జగన్ మోహన్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు తక్షణ పరిష్కారం

### ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం చేయాలి
### కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ప్రజల నుండి వచ్చే ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి'కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలను ఆమె స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. ముఖ్యంగా మండలాలవారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో సంబంధిత శాఖలనీ పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ప్రధానంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన వినతులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

**ముఖ్యమంత్రి పర్యటన – అధికారులకు దిశానిర్దేశం ..**

త్వరలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారం, నివేదికలతో అధికారులు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే, జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన 'అటల్ పెన్షన్ యోజన' (ఎపివై)అమలులో జిల్లా 107 శాతం నమోదు సాధించినందుకు గాను, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్‌ను కలెక్టర్ ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి అభినందించారు.

అనంతరం, జిల్లా అధికారుల సంఘం నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వామపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి, సిఐటియు, టియుసిఐ సంఘాల ఆధ్వర్యంలో ప్రజావాణిలో భాగంగా జిల్లా కలెక్టర్ త్రిపాఠికి వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ ప్రధానంగా పెరుగుతున్న ధరలకనుగుణంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని, అనారోగ్యం పాలైన లేదా మరణించిన కార్మికుల స్థానంలో సభ్యులకు ఉపాధిని కల్పించాలని, ఇటీవల మున్సిపల్ అధికారులు 7గురు కార్మికులకోక గ్రూప్ చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, దీని మూలంగా నెలలో రెండు మూడు రోజుల పాటు అనేక మంది కార్మికులు ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తుందని, దానికన్నా ఇప్పటికే ఉన్న సెల్ఫ్, హెల్ప్ గ్రూప్‌లను కొనసాగిస్తూ మిగతా కార్మికులకు 50 నుంచి 100 మంది వరకు ఒక గ్రూప్‌ను ఏర్పాటు చేసి వాటి ద్వారా వారి అకౌంట్‌లో జీతాలను వేయాలని వారు కోరారు. గతంలో ప్రభుత్వం పెంచిన ఒక వెయ్యి రూపాయల వేతనం శానిటేషన్ డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి ఇవ్వకుండా నిలుపుదల చేయటం సరైంది కాదని, వారికి వెంటనే చెల్లించాలని కోరారు. అదేవిధంగా వారాంతపు సెలవులను, పండగ సెలవులను కొనసాగించాలని ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే కార్మికులకు మోటారు సైకిళ్లను, టార్చ్ లైట్లను కొనసాగించాలని ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే కార్మికులకు 2 జతల బట్టలను, చెప్పులు, సబ్బులు, నూనెలు, పనిముట్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించని యెడల కార్మికులతో ఆందోళన చేయాల్సి వస్తుందని తెలిపారు. అదేవిధంగా గతంలో హామీనిచ్చిన మేరకు మెకానిక్ షెడ్డును ఏర్పాటు చేయటంతో పాటు పెరుగుతున్న జనాభాకనుగుణంగా కార్మికులను పెంచాలని పని భారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, టియుసిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

## అడ్లూరీ..ఏం చేసానో కాదు..ఏం చేయలేదో అడుగు

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ప్రజాపక్షం/ధర్మపురి :** పదేళ్ల తన హయాంలో ధర్మపురిలో ఏంచేసావని అడగడం కాదు.. ఏం చేయలేదో చెప్పమంటూ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ సవాల్ చేశారు. ధర్మపురి పట్టణంలో సోమవారం మాజీమంత్రి ఈశ్వర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల మంత్రిగా వున్న సమయంలో ధర్మపురిలో చేసిన అభివృద్ధిని పాత్రికేయుల ముందు ఏకరువు పెట్టారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉండి దేశంలో ఎక్కడాలేని విధంగా నియోజకవర్గ కేంద్రాలలో ఎమ్మెల్యేలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా రూపకల్పన చేయగా తన హయాంలో ధర్మపురిలో రూ.కోటితో నిర్మించిన క్యాంప్ కార్యాలయంలో ఇప్పుడు ఉంటున్నది ఎవరని ప్రశ్నించారు. పట్టణ ప్రారంభం నుండి శివారు వరకు రూ.10 కోట్లతో సెంట్రల్ లైటింగ్‌తో కూడిన జాతీయ రహదారి విస్తరణ జరిగిందీ తన హయాంలోనేనని అన్నారు. మున్సిపాలిటీగా అర్హత లేకున్నా ధర్మపురి అభివృద్ధి కోసం తాను అప్పటి సీఎం కేసీఆర్ తో మాట్లాడి బల్దియాగా మార్చానని చెప్పారు.కేటీఆర్ ద్వారా రూ.25 కోట్లు తొలుత అనంతరం మరో 15 కోట్లతో పట్టణాభివృద్ధికి బాటలు వేశానని తెలిపారు.టెంపుల్ సిటీగా ధర్మపురిని గొప్పగా మార్చేందుకు రూ.100 కోట్ల నిధులు తీసుకురాగా 40 కోట్ల పనులు ప్రారంభించుకున్నామని మిగిలిన 60 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రద్దయ్యాయని ఎద్దేవాచేశారు.గోదావరి నది వద్ద రూ.కోటితో స్మశానవాటిక నిర్మాణం, 600 మీటర్ల మేర పుష్కర ఘాట్ల నిర్మాణం, గోదావరి నదిలో పట్టణ మురుగునీరు కలవకుండా మహాడ్రైనేజీ నిర్మాణానికి రూ.8 కోట్ల పనులు చేయించానన్నారు.రూ.9 కోట్లతో ఎంసీహెచ్ ఆసుపత్రి నిర్మాణం పూర్తిచేసి ప్రారంభంచేసి ఇస్తే కనీసం వైద్య సేవలు అందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.చింతామణి చెరువు సుందరీకరణ,మెరుగైన విద్యుత్తు సరఫరాకు నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం,గోదావరి తీరం వెంబడి 13 లిఫ్టు ల ఏర్పాటు, అన్ని గ్రామాలలో అంతర్గత రోడ్లు,డ్రైనేజీలు, దేవస్థానానికి సంబంధించి నూతనంగా 66 గదుల నిర్మాణం, ఎస్కెఎన్ఆర్ కాంప్లెక్స్, శాశ్వత మంచినీటికోసం సీపీడబ్ల్యూ పథకం,అక్కపెల్లి చెరువు రిజర్వాయర్ కోసం రూ.72 కోట్లు వెచ్చించామన్నారు.

బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు,మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్,4 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం ఇవన్నీ తానే చేశానని కొప్పుల చెప్పారు.పదేళ్ల కాలంలో ఏంచేసావని అడగడం కాదు. కళ్ళు తిరిగే అభివృద్ధి చేసి చూపించాం. ఇక ముందు అన్నీ తెలుసుకుని జాగ్రత్తగా మాట్లాడు. రెండేళ్లు నీకు సమయమిచ్చా.. ప్రజల ఇబ్బందులపై పట్టింపులేని నిన్ను ఇక నుండీ అన్నింటికీ ప్రశ్నిస్తానని ఈశ్వర్ మంత్రి అడ్లూరికి అల్టిమేటం ఇచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రాజేష్ కుమార్, రంజిత్, మల్లేశం, ఎల్లాగౌడ మహేష్, శ్యామ్, మహిపాల్ పాల్గొన్నారు.

## దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

### జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట అంక్షారెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** కులాలు, మతాలు, ప్రాంతాల పేరిట విభజించి పాలిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని భ్రష్టు పట్టిస్తుండగా, భారత్ సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న గాంధీల కుటుంభమే దేశానికి శ్రీరామరక్షగా నిలుస్తుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి స్పష్టం చేశారు. గజ్వేల్ లో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నాచగిరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డిలతో కలిసి ఆమె మాట్లాడారు. ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా పార్టీ పటిష్టతకు కృషి చేస్తూనే పార్లమెంట్ సభ్యురాలిగా పాలకపక్షానికి దీటైన జవాబు చెబుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా దేశం కోసం ప్రాణాలర్పించిన దివంగత ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం ప్రాణాలను ఘనంగా పెట్టి పోరాడుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల స్ఫూర్తితో వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ ఢిల్లీలో అధికారమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఇప్పటి నుండే ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేతలు చెన్నారెడ్డి, సుఖేందర్ రెడ్డి, సమీర్, గుంటుకు శ్రీనివాస్, అజ్జర్, మొనగారి రాజు, రాములు గౌడ్, శివారెడ్డి, రమేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, అంజద్ బాయ్, అజహర్, నరేష్, నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో నీటి సమస్యను పరిష్కరించిన డిసిసి చైర్మెన్

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ మోడల్‌స్కూల్ హాస్టల్‌లో విద్యార్థులకు నీటి సమస్య నెలకొంది. ఈ విషయాన్ని విద్యార్థులు, అధ్యాపకబృందం స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావుకు విన్నవించడంతో ఎమ్మెల్యే ఆదేశానుసారం డిసిసి చైర్మెన్ ఏలే మల్లికార్జున్ సహకారంతో సోమవారం బోరుబావి తవ్వకం చేపట్టారు. దీంతో అధ్యాపకబృందం, విద్యార్థులు ఎమ్మెల్యేకు, డిసిసి చైర్మెన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచు లక్ష్మయ్య, ఉప సర్పంచు రవీంధర్, ఆర్‌డబ్లుఎస్ ఏఈ సుమలత, నాయకులు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



## అదుపుతప్పిన ద్విచక్ర వాహనం : ఒకరు మృతి

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** మాగి గ్రామానికి చెందిన ద్యానబోయిన నగేష్(40) అనే వ్యక్తి సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయి మృతిచెందినట్లు నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం



నగేష్ మాగి గ్రామ శివారులోని షుగర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని, రాత్రి 9 గం.ల సమయంలో తన డ్యూటీ ముగించుకుని పిట్లంకు తిరుగు ప్రయాణమవ్వగా వడ్డేపల్లి గ్రామ శివారులో గల సైలానిబాబా దర్గా సమీపంలో పిట్లం ఎల్లారెడ్డి రహదారిపై మూల మలుపు ప్రాంతంలో బైకు అదుపుతప్పి కింద పడిపోగా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండలంలోని కాండ్లి గ్రామ యశ్వంత్,మొహాల గ్రామాల లబ్ధిదారులకు మాజీ శాసనసభ్యులు,ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బోస్లే నారాయణ రావు పాటిల్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేయడం జరిగింది.నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ చెక్కులు దోహదపడుతాయని నిరుపేద కుటుంబాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని అహర్నిశలు శ్రమిస్తుందని నారాయణరావు పటేల్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చంద్రే,ఆత్మ చైర్మన్ ముధోల్ గన్ను నర్సారెడ్డి,లోకేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి అక్షరం ప్రజల పక్షం ఉండాలి

### ఎస్ఐ గొల్లపల్లి అనుష

**ప్రజాపక్షం/జన్నారం :** వార్తాపత్రికలోని ప్రతి అక్షరం ప్రజల పక్షం ఉండాలని, సమాజంలోని అవినీతిని ప్రశ్నించే విధంగా ఉండాలని జన్నారం ఎస్ఐ గొల్లపల్లి అనుష అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రజాపక్షం జాతీయ దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్రికా కథనాల ద్వారా సమాజంలో అనేక మార్పులు తీసుకురావచ్చని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడంలో పత్రికలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. మరిన్ని ప్రజోపయోగకరమైన వార్తలు, కథనాలు అందిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, విలేకరులు యశోద భాస్కర్, పర్ల శంకర్ పాల్గొన్నారు.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు

### పర్యవేక్షిస్తున్న ఇఒ అన్వర్ అలీఖాన్

**ప్రజాపక్షం/ముధోల్ :** గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముధోల్ గ్రామ పంచాయతీ ఇఒ అన్వర్ అలీ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయా కాలనీలలో తిరుగుతూ పారిశుధ్య కార్మికులు చేపడుతున్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో అభివృద్ధితో పాటు స్వచ్ఛ వాతావరణం ఏర్పాటు చేయడం తమ బాధ్యతగా అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు.అంతే కాకుండా వ్యాపారస్తులు,ప్రజలు పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్ వ్యర్థాల వాడకం నిషేధించి చెత్తను ఎక్కడంటే అక్కడ పడేయకుండా చెత్తబుట్టిలో వేసుకోవాలని సూచించారు. జమ చేసిన చెత్తను రోజువారీగా చెత్త సేకరించే వాహనంలో వేసి సిబ్బందికి సహకరించాలని విన్నవించారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా రోజు వారీగా ఆయా వీధుల్లో మురికి కాలువలను శుభ్రం చేయడం, ఇంటింటికి వెళ్తూ చెత్తను సేకరించడం,ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించడం వంటి పలు విధులను చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎడపల్లిలో ఘనంగా స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఎడపల్లి మండల కేంద్రంలోని మంగల్పాహాడ్ చౌరస్తా వద్ద హిందూ వాహిని, ఎడపల్లి యువకులు, నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్వామి వివేకానంద 163వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వివేకానందుని జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆయన విగ్రహానికి హిందూ వాహిని నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎడపల్లి మండలం కుర్నాపల్లి, ఏఆర్పీ క్యాంప్, మంగల్పాహాడ్, బ్రహ్మణపల్లి గ్రామాలలో పార్టీలకు అతీతంగా స్వామి వివేకానందుని విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జయంతి వేడుకల్లో సర్పంచి కందగట్ల రాం చందర్, గ్రామ పెద్దలు శంకర్ నాయుడు, ఆత్మేలా శ్రీనివాస్, శంకర్ చారి, ఇంద్రవతి బాలు, రత్నాకర్ రెడ్డి, రఘు మీసాల, గంగ ప్రసాద్, దండి శంకర్, సదానంద్, దేవర్ల శ్రీనివాస్, ఐరెండ్ల నవీన్, ఊరడి ప్రదీప్, శంకర్ గౌడ్, కృష్ణ గౌడ్, నిశాంత్, రాకేష్, వడ్ల నరేష్, మార సాయి తేజ, సాంబ, శివ, రాములు తదితరులు ఉన్నారు.




## బోథ్‌లో సిపిఐ 100వ సంవత్సర ముగింపు ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని స్థానిక ఎఐటియుసి భవన్‌లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ)100 సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా సోమవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులు, రైతులు,శ్రమజీవుల హక్కుల కోసం సిపిఐ వందేళ్లుగా నిరంతరంగా పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు,సామాజిక న్యాయం కోసం సిపిఐ భవిష్యత్తులో కూడా తన పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి,వార్డు సభ్యులు తిరుపతి, శ్రీనివాస్, పార్టీ సభ్యులు మున్సిఫ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్లుపై విజిలెన్స్ దాడులు

### 204 క్వింటాళ్ల రేషన్‌బియ్యం, బొలెరో వాహనం సీజ్

**ప్రజాపక్షం/శివ్వంపేట :** రేషన్ షాపుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం అందిస్తుండగా అవికాస్త పక్కదారి పడుతుండగా విజిలెన్స్ అధికారులు రేషన్ బియ్యం స్వాదీనం చేసుకున్న ఘటన మండలంలోని కొంతాన్‌పల్లి శ్రీఆంజనేయరైస్‌మిల్లులో సోమవారం చోటుచేసుకుంది. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు ఆకస్మీకంగా దాడి చేసి 204 క్వింటాళ్ల రేషన్‌బియ్యం, ఒక బొలెరో వాహనాన్ని సీజ్ చేసి శివ్వంపేట పోలీసులకు అప్పగిస్తున్నట్టు విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ పండరి, ఇన్స్‌పెక్టర్ నర్సింలు తెలిపారు. అక్రమ రేషన్ బియ్యం స్వాదీనంపై సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

## క్రీడా పోటీలతో క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలు: సమ్మయ్య



**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ క్లబ్ మైదానంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య ఆధ్వర్యంలో ఎంఎస్ఆర్ పాలకుర్తి మండలస్థాయి క్రికెట్ పోటీలను సోమవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్ పోటీల్లో పాల్గొనడం ద్వారా యువతలో మంచి క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు ఆలవడ్తాయన్నారు. మానసిక, శారీరక సామర్థ్యం మరింత పెరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయని, దీనివల్ల పోటీలు ఐపీఎల్ తరహాలో ఉత్కంఠంగా ఉండబోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధర రమేష్‌గౌడ్, కొత్తపల్లి సర్పంచి తోట మహేందర్, గుడిపల్లి సర్పంచి కాసర్ల కరుణాకర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అసంపెల్లి వాసు, గుజ్జుల కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు దేవి లక్ష్మీ నర్సయ్య, పాత రవీందర్, ఉప సర్పంచి సారయ్య నాయక్, మాజీ ఉప సర్పంచి బాలగొని కుమార్‌గౌడ్, బదావత్ శంకర్ నాయక్, సంపంగి నర్సింహులు, తలారి శంకర్, పరికిపండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కొనసాగిన ఆల్ఫోర్స్ క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీలు



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎస్ఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గత రెండు రోజులుగా కొనసాగుతున్న అల్ఫోర్స్ క్రికెట్ ఛాంపియన్షిప్ పోటీలు ముగిశాయి. పోటీలు ముగింపు వేడుకలకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక అభివృద్ధి జరుగుతుందని తద్వారా వారికి విజయాలు చాలా సులభం అవుతాయన్నారు. విద్యార్థులకు మానసిక ఉల్లాసం కల్పించడం చాలా అవసరమని తద్వారా వారి యొక్క కార్యకలాపాలు చాలా హుషారుగా చేయగలుగుతారని తెలుపుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనడమే కాకుండా నైపుణ్యం సాధించే విధంగా శిక్షణ తీసుకొని వివిధ స్థాయిలో నిర్వహింపబడేటువంటి పోటీలలో పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు. గత రెండు రోజులుగా జరుగుతున్న అల్ఫోర్స్ క్రికెట్ ఛాంపియన్షిప్ పోటీలు నేడు ముగిసాయని, ఈ ఛాంపియన్షిప్ ను అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ కొత్తపల్లి కైవసం చేసుకున్నదని హర్షం వ్యక్తం చేశారు. అద్భుతమైన ప్రదర్శన కనబరచిన టీం సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో అల్ఫోర్స్ విద్యా సంస్థల వారి ఆధ్వర్యంలో ఈ రకమైన టోర్నమెంట్లను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్ట్రా సౌండ్ కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ పట్టణంలోని పలు అల్ట్రా సౌండ్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓఎం హెచ్ ఎన్ డాక్టర్ సన జవేరియా, టీం సభ్యులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో వారు నిర్వహించే రిజిస్టర్లు, పేషెంట్ అనుమతి పత్రాలు, మరియు కేస్ రికార్డ్స్, సంబంధిత డాక్యుమెంట్స్, ఫామ్ (ఎఫ్) పత్రాలు అన్ని తనిఖీ చేశారు. గర్భస్థపూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ (లింగ ఎంపిక నిషేధ చట్టం) చట్టము 1994 మరియు నిబంధనలు 1996 మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారము చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. తనిఖీ సమయంలో ప్రత్యేక వైద్య నిపుణులైన గైనకాలజిస్టు, రేడియాలజిస్టులు, ఇతర క్వాలిఫైడ్ స్పెషలిస్టు ల ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు హాస్పిటల్ రిజిస్ట్రేషన్ డాకుమెంట్స్ ను వెరిఫై చేశారు. ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయన్నారు. ఈ తనిఖీలలో పిఓఎంహెచ్ఎన్ డాక్టర్ సనజవేరియా, సయ్యద్ సాబీర్, రమేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/సారంగాపూర్:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్వామి వివేకానందను ప్రతి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎంఈవో కిషోర్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్వామి వివేకాంద 163వ జయంతిని పురస్కరించుకుని వివేకానంద సేవా సమితి అధ్యక్షులు పూడూరి శోభన్, ఊరుమల్ల రాజేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడం జరిగింది ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి కోనాపూర్ టీమ్ కు, రెండవ బహుమతి రేచుపల్లిలకు ప్రైజ్‌మనీ, షీల్డ్ మెమోంటోస్ అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అరుణ శేఖర్, మర్రిపెల్లి అశ్విని, నాయకులు గుర్రాల రాజేందర్ రెడ్డి, మానాల లక్ష్మినారాయణ, చేకూట శేఖర్, మానాల రమణ, ఊరుమల్ల లక్ష్మారెడ్డి శ్రీధర్, రాజు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## అర్జీలు సత్వరమే పరిష్కారం: వేణు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ మార్కెట్ రోడ్డు లోని శ్రీ లక్ష్మీ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నెల 23 నుండి 30వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశం జిల్లా కేంద్రం లోని మార్కెట్ రోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ సంవత్సరం మరింత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు ప్రశాంతంగా స్వామి వారి దర్శనం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని, పార్టీలతో సంబంధం లేకుండా ప్రజా ప్రతినిధులంతా బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. గతేడాది మాదిరిగానే స్వామివారి సేవకు ముందుకు వచ్చి విరాళాలు సమర్పిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుంటుందని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ స్వామివారి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు దాతలు బ్రహ్మోత్సవాల నిర్వాహణకు విరాళాలను ప్రకటించారు. సమావేశంలో ఆర్డీవో మహేశ్వర్, కరీంనగర్ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్రె రాజశేఖర్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆలయ చైర్మన్లు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఏసీపి వెంకటస్వామి, ఈవో సుధాకర్ పాల్గొన్నారు.

## ప్రశ్నించే ప్రజా గొంతుక.. 'ప్రజాపక్షం'

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రశ్నించే ప్రజా గొంతుకగా నిత్యం ప్రజల సమస్యల పరిష్కారం కోసం 'ప్రజాపక్షం' దినపత్రిక పని చేస్తున్నదని సీపీఐ పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద ప్రజాపక్షం దిన పత్రిక జిల్లా కార్యాలయంలో ప్రజాపక్షం నూతన సంవత్సరం 2026 క్యాలెండర్లను సదానందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ప్రజలకు, ప్రజాప్రతినిధులకు వారధిగా నిలుస్తున్న మీడియా రంగంలో నిజాన్ని నిర్భయంగా రాసే పత్రికల్లో 'ప్రజాపక్షం' ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. దిన దినాభివృద్ధి చెందుతున్న పత్రికకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తున్నదన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు ఏమి ఉన్నా కథనాల ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. పాత్రికేయులు ఏలాంటి అడ్డంకులు లేకుండా ప్రజలకు, సమాజానికి ఉపయోగపడే వార్తలను రాయాలని, ఈ విషయంలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని సదానందం తెలిపారు. ప్రజాపక్షం దినపత్రిక యాజమాన్యానికి, పాత్రికేయులకు నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం దినపత్రిక పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎండి.గౌస్‌పాషా, పాత్రికేయులు ఎండి.సాదిక్ పాషా, ఎండి.మాజిద్‌పాషా, భూషణవేణ అశోక్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి స్థానిక అయ్యప్ప దేవాలయం వరకు యువతకు క్రీడల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో జిల్లా యువజన, క్రీడా ప్రాధికార సంస్థ పెద్దపల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ టార్చ్ ర్యాలీలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని, కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను అనేక రకాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడల పట్ల అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో గ్రామీణ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అలాగే జిల్లా స్థాయి వరకు, రాష్ట్ర స్థాయి వరకు రెండొవ ఎడిషన్ చీఫ్ మినిస్టర్ కప్ 2025 ద్వారా టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, పలు క్రీడా సంస్థల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి వెను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 249 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 42, హౌసింగ్ శాఖకు సంబంధించి 43 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఖమ్మంలో జరిగే సిపిఐ బహిరంగ సభకు తరలిరండి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** భారతగడ్డపై ఎర్రజెండాకు వందేళ్లు దాటిన సంధర్భంగా ఖమ్మంలో జనవరి 18న లక్షలాది మందితో నిర్వహించే సిపిఐ 100 ఏళ్ల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో సిపిఐ మద్దతులో గెలిచిన చామనపల్లి సర్పంచ్ బోగొండ అయిలయ్యకు సిపిఐ పక్షాన సన్మానం చేసి ఈ నెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ బారీ బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సంధర్భంగా కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐ వందేల్ల ప్రస్థానంలో విప్లవ పోరాట ఘట్టాలు వెలకట్టలేని త్యాగాలు అజరామరమని అన్నారు. పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎర్రజెండా అండగా, దున్నేవాడికి భూమికావాలనే నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనమైన చరిత్ర గల పార్టీ సిపిఐ అన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. వందేళ్లుగా అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పోరాడుతున్న పార్టీ సిపిఐ అన్నారు. రానున్న రోజుల్లో సిపిఐ పార్టీదే భవిష్యత్తు అన్నారు. కరీంనగర్ నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు మెరుగు కొమురయ్య, చామనపల్లి బాబు, రాములు, పి.తిరుపతి, గామినేని సత్యం, రామ్ చందర్‌రావు, బండారి బీరయ్య, కర్రె శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండాయే లక్ష్యం





**ప్రజాపక్షం/కరీంనగర్:** హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన వెలిచాల రాజేందర్ రావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా మంత్రులు రాజేందర్ రావును శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అందరం కలిసి కరీంనగర్ కార్పొరేషన్ పై జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేద్దామని మంత్రులు పేర్కొన్నారు. కరీంనగర్లో సమస్యలు పరిష్కరిస్తూనే మరోవైపు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలనీ ఇందుకు అధికారులతో నిత్యం టచ్ లో ఉండాలనీ మంత్రులు వెలిచాల రాజేందర్ రావుకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అధిష్టానం పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక కాంగ్రెస్ నేతల సహకారంతో కాంగ్రెస్ పార్టీ అంటే కరీంనగర్ గుర్తుకు వచ్చేలా తీర్చిదిద్దుతామని రాజేంద్రరావు పేర్కొన్నారు.

**భారీ ర్యాలీకి ఏర్పాట్లు**

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జిగా నియమితులైన వెలిచాల రాజేందర్ రావు మొట్ట మొదటిసారిగా మంగళవారం కరీంనగర్ కు రానున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వెలిచాల అభిమానులు మాజీ ప్రజా ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. మంగళవారం ఉదయం 11 గంటలకు అల్గునూరు చౌరస్తాలో రాజేంద్రరావుకు ఘన స్వాగతం పలకనున్నారు. అనంతరం పెద్ద ఎత్తున మోటార్ సైకిల్లు, కార్లు ఇతర వాహనాలతో ర్యాలీ నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సన్నిహితులు, సర్పంచులు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా చర్యలు

కలెక్టర్ కె.హైమావతి



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట:** ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి హెచ్చరించారు. సోమవారం మద్దూరు మండలంలోని లద్నూరు, మద్దూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను స్వత్రస్థాయిలో పరిశీలించారు. ఆ సమయంలో మెడికల్ ఆఫీసర్ సెలవుల్లో ఉన్నట్లు సిబ్బంది తెలుపగా డిఎం మరియు ఎచ్ఓ కు ఫోన్ ద్వారా ఆరా తీశారు. మెడికల్ ఆఫీసర్ నుండి అటెండర్ వరకు సెలవు కావాలంటే పై అధికారి అనుమతితో సెలవు తీసుకోవాలని, ఇష్టానుసారంగా లీవ్ లెటర్ రాసుకుని లీవ తీసుకుంటే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. గతంలో కూడ కలెక్టర్ ఆకస్మిక తనికిలో ఓపి రిజిస్టర్ తేదిల వారిగా సరిగా లేకపోవడం, ఫార్మసీ రిజిస్టర్, మెడికల్ ఆఫీసర్ ఓ.పి రిజిస్టర్ మ్యాచ్ కావట్లేదని, అసలు డాక్టర్లు క్రమం తప్పకుండా వస్తున్నారా అని కలెక్టర్ హైమావతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినా, డిఎం మరియు ఎచ్ఓకి రిజిస్టర్లు చూపించి కఠిన చ్యర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించిన అక్కడి డాక్టర్ల నిర్లక్ష్యం మాత్రం మారడం లేదని స్థానిక ప్రజలు అంటున్నారు. లద్నూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ల రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించడంలేదని, ఇష్టరాజ్యంగా ఎంట్రీ చేయండం, అర్థం కాకుండా ఎంట్రీ వంటిపై కలెక్టర్ హైమావతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ. వారిపై చర్యలు తీసుకుంటామని తెలపడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దూరు మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మైలారం గ్రామంకు బోటు సౌకర్యం



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం నుండి కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మైలారం గ్రామంకు వెళ్ళుటకు బోటు సౌకర్యాన్ని సోమవారం మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో ఈనెల 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు శ్రీ భ్రమరాంబ సమేత స్వయంభు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయనీ, బ్రహ్మోత్సవాలతో పాటు మహా రుద్ర యాగం జరగనుందని ఈ నేపథ్యంలో కరీంనగర్ నుండి అనేకమంది భక్తులు మైలారం వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారని, ఐతే కరీంనగర్ నుండి మైలారం రోడ్డు మార్గం ద్వారా వెళ్ళుటకు సుమారు 45 నిమిషముల సమయం పడుతుందని, అదే బోటు ద్వారా ప్రయాణం చేస్తే 20 నిమిషాలలో మైలారం చేరుకోవచ్చు అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లోయర్ మానేరు డ్యామ్‌లో బోట్లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో పాటు, రసమయి బాలకిషన్, హరిశంకర్, ఏనుగు రవీందర్ రెడ్డి, శ్రీకాంత్, ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ నాగ సాయి శర్మ, వరాల పరశురాములు, జక్కనపల్లి సత్తయ్య, నాయకులు తోట కోటేశ్వర్ పటేల్, నేతిరవి వర్మ, దుడ్డేల ప్రశాంత్, మిడిదొడ్డి నవీన్, నాగరాజు, పాల్గొన్నారు.

## స్మార్ట్ ఫోన్ కాదు.. స్మార్ట్ మనస్సు తయారు చేసుకోండి

కేంద్ర మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** మీరంతా స్మార్ట్ ఫోన్ కే పరిమితం కావొద్దు. స్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి..! వైఫై కాదు విల్ పవర్ పెంచుకోండి!. ప్రశ్నించే ధైర్యాన్ని నింపుకోండి ...అన్యాయం జరిగితే ఎదిరించే శక్తి పెంచుకోండి. మీ కోసం, మీ కుటుంబం కోసం కాకుండా దేశం కోసం పనిచేయాలిeeఅని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ యువతకు పిలుపునిచ్చారు. భారత దేశ ఖ్యాతిని ఖండాంతారాలు దాటించడమే కాకుండా భారతీయ సమాజాన్ని జాగృతం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని, నిరాశలో ఉన్న యువతను తట్టి లేపేందుకు ఆయన చెప్పే మాటలు యువతకు తారక మంత్రంగా పనిచేస్తాయని అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మేరా యువ భారత్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని కళాభారతిలో జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బండి సంజయ్ తోపాటు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా యువజన అధికారి రాంబాబు, జిల్లా స్పోర్ట్స్ అధికారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా పలువురికి స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. నీ వెనుకాల ఏముంది. ముందేముంది అనేది నీకు అనవసరం. నీలో ఏముంది అనేది ముఖ్యం. మందలో ఒకరిగా ఉండొద్దు. వందలో ఒకరిగా ఉండడానికి ప్రయత్నించండి. అంటూ స్వామి వివేకాంద చెప్పిన మాటలు యువతలో ప్రత్యేకతను వెలికి తీసేందుకు పనికొస్తాయన్నారు. కానీ ఈ రోజు యువత పరిస్థితి బాధాకరం, చేతిలో మొబైల్, ఇంటర్నెట్, ఆన్ లైన్ గేమ్స్... మద్యం, డ్రగ్స్ కు బానిసలవుతున్నారు. విదేశాలన్నీ భారత్ ను ఫాలో అవుతుంటే, మనం మాత్రం మోడరన్ కల్చర్ పేరుతో విదేశీ కల్చర్ ను అలవాటు చేసుకుంటున్నామన్నారు. మీరంతా స్మార్ట్‌ఫోన్ కాదు స్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి..! వైఫై కాదు విల్ పవర్ పెంచుకోండి.! మీలో ప్రశ్నించే ధైర్యాన్ని నింపుకోండి... అన్యాయం జరిగితే ఎదిరించే శక్తి పెంచుకోండి. నీ కోసం కాదు. దేశం కోసం బతికే ఆలోచనను మనసునిండా నింపుకోండి. చరిత్ర సృష్టించే వారిగా మారండని పిలుపునిచ్చారు.

## తుది ఓటరు జాబితా విడుదల

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 1వ తేదీన ప్రచురించిన డ్రాఫ్ట్ వార్డు వైస్ ఓటర్ లిస్టులో 151 అభ్యంతరాలు వచ్చాయని, వాటిని క్లియర్ చేస్తూ వార్డు వారీగా తుది ఓటరు జాబితాను సోమవారం విడుదల చేసినట్లు పెద్దపల్లి పురపాలక సంఘం కమిషనర్ తెలిపారు. ఇందులో మొత్తం 43,845 ఓటర్లకు 43,789 ఓటర్లను 36 వార్డులకు మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన 56 ఓటర్లు చుట్టు పక్కల ఉన్న గ్రామ పంచాయతీలకు సంబంధించినవి ఐనందున వాటిని మ్యాపింగ్ చేయలేదన్నారు. 43,789 ఓటర్లలో 21,660 మంది పురుషులు, 22,127 మంది స్త్రీలు, ఇద్దరు ఇతర ఓటర్లు ఉన్నారని తెలిపారు. మంగళవారం డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్లను ప్రచురించడం జరుగుతుందన్నారు. శుక్రవారం రోజున తుది పోలింగ్ స్టేషన్ వారీగా ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు.

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'రాజా సాబ్' మూవీ బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ జర్నీ కంటిన్యూ చేస్తోంది. ఈ సినిమా 3 రోజుల్లో వరల్డ్ వైడ్ 183 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించిందని నిర్మాతలు టిజి విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ విడుదల చేసిన ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. రోజురోజుకు కలెక్షన్స్ పెరుగుతున్నాయని పేర్కొన్నారు. రెండో రోజు మించిన కలెక్షన్స్ మూడో రోజుకు పెరిగాయని అన్నారు.

# రీల్

## అరుదైన ఘనత

### పవన్ కళ్యాణ్‌కు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' బిరుదు

మార్షల్ ఆర్ట్స్‌లోనూ ప్రావీణ్యులైన పవన్ కళ్యాణ్ ఓ అరుదైన ఘనతను ఖాతాలో వేసుకున్నారు. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ అయిన 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం పొందడం ద్వారా ఒక గొప్ప అంతర్జాతీయ గౌరవాన్ని సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా ఆయన క్రమశిక్షణతో సాగించిన సాధన, పరిశోధన, మార్షల్ ఆరట్స్ పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనంగా ఈ అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి, తమ్ముడు, ఖుషి, అన్నవరం, ఓజీ వంటి చిత్రాల ద్వారా ఈ మార్షల్ కళలను తెరపై ప్రదర్శిస్తూ, వాటికి విస్తృత గుర్తింపు, ప్రజాదరణ తీసుకొచ్చారు. మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆయన చూపిన నిరంతర, దీర్ఘకాలిక అంకితభావాన్ని గుర్తించిన అంతర్జాతీయ సంస్థలు, పవన్ కళ్యాణ్‌కు పలు ప్రతిష్ఠాత్మక గౌరవాలు అందించాయి. జపాన్ సంప్రదాయ యుద్ధకళల్లో అత్యంత గౌరవనీయమైన సంస్థలలో ఒకటైన 'సోగో బుడో కన్‌రి కై' నుంచి ఆయనకు ఫిఫ్త్ డాన్ (ఐదవ డాన్) పురస్కారం లభించింది. అలాగే, జపాన్ వెలుపల 'సోకే మురమత్సు సెన్సై'లోని 'టకెడా షింగెన్ క్లాన్'లో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగా ఆయన నిలిచారు. ఇది జపాన్ వెలుపల చాలా అరుదుగా లభించే గౌరవం. అంతేకాకుండా, గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ ద్వారా ఆయనకు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే విశిష్ట బిరుదుతో సత్కారం కూడా జరిగింది. అధునాతన శిక్షణలో భాగంగా, భారతదేశంలో జపాన్ యుద్ధకళలలో అగ్రగణ్యులలో ఒకరైన ప్రముఖ బుడో నిపుణుడు హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధిక్ మహ్మూదీ వద్ద పవన్ కళ్యాణ్ శిక్షణ పొందారు. ఆయన మార్గదర్శకత్వంలో పవన్ కళ్యాణ్ 'కెండో'లో సమగ్ర శిక్షణ పొంది, ఉన్నత స్థాయి సాంకేతిక నైపుణ్యం సంపాదించారు. ఈ మైలురాయి ద్వారా సినిమా, శాస్త్రీయ యుద్ధకళలు, యుద్ధ తత్వశాస్త్రం.. ఈ మూడింటినీ అంతర్జాతీయ వేదికపై సమన్వయం చేయగలిగిన అతి కొద్ది మంది భారతీయ ప్రముఖుల్లో ఒకరిగా పవన్ కళ్యాణ్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.




## మెగా సెలబ్రేషన్ షురూ..



మెగాస్టార్ చిరంజీవి హీరోగా, డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' సోమవారం థియేటర్లలో విడుదలై అద్భుత విజయాన్ని అందుకుంది. ప్రీమియర్, పెయిడ్ షోలు నుండే ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ లభించడంతో సినిమా సంక్రాంతి 2026 విజేతగా నిలిచింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫోటోలు, వీడియోలు ద్వారా డైరెక్టర్ అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహూ గారపాటి, సుస్మిత కొణిదెల చిరంజీవితో కలిసి సక్సెస్ సెలబ్రేషన్ చేసుకున్న క్షణాలను అభిమానులు ఆస్వాదిస్తున్నారు. ప్రేక్షకులు సినిమా బ్లాక్‌బస్టర్ అని, బాస్ ఈజ్ బ్యాక్ అంటూ సోషల్ మీడియా వేదికగా రివ్యూలు, కామెంట్స్‌తో వైరల్ అవుతున్నారు.

## 'నారి నారి నడుమ మురారి'లో కామెడీ ట్రైలర్..



శర్వానంద్ హీరోగా నటించిన తాజా చిత్రం 'నారి నారి నడుమ మురారి'. ఈసినిమా 14న విడుదల కానుంది. సామజవరగమన ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించారు. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలోని కామెడీ ట్రైలర్‌ను విడుదల చేశారు. గౌతమ్(శర్వా) బిటెక్ ఆర్కిటెక్ట్, తన గర్ల్ ఫ్రెండ్ (సాక్షి వైద్య)తో సాఫీగా సాగుతున్న అతడి జీవితం, ఒక్కసారిగా అతడి ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ (సంయుక్త) తిరిగి జీవితంలోకి రావడంతో గందరగోళంగా మారుతుంది. అక్కడి నుంచి మొదలయ్యే హిలేరియస్ పరిస్థితులు, గౌతమ్ పాస్ట్ అండ్ ప్రజెంట్ మధ్య నలిగిపోవడం ప్రేక్షకులకి నవ్వులు పంచాయి. శర్వానంద్ రెండు డిఫరెంట్ టైమ్‌లైన్లలో, రెండు ప్రేమకథల్లో రెండు స్టైలిష్ లుక్స్‌లో కనిపించి తన కామిక్ టైమింగ్, డైనమిక్ షేడ్స్‌తో అదరగొట్టారు.

## 'చీకటిలో' ట్రైలర్..

ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ప్రైమ్ వీడియో', తమ కొత్త తెలుగు సినిమా 'చీకటిలో' ట్రైలర్‌ను విడుదల చేసింది. సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై డి. సురేష్ బాబు నిర్మించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ సినిమాకి శరణ్ కొపిశెట్టి దర్శకత్వం వహించారు. చంద్ర పెమ్మరాజు శరణ్ కొపిశెట్టి ఈ కథను అందించారు. సినిమా వివరాలు: హైదరాబాద్ నేపథ్యంలో సాగే ఈ కథలో, శోభితా ధూళిపాళ 'సంధ్య' అనే పాత్రలో కనిపిస్తారు. సంధ్య ఒక క్రైమ్ పాడ్‌కాస్టర్. 20 ఏళ్ల క్రితం జరిగిన వరుస హత్యల వెనుక ఉన్న రహస్యాలను, ఒక సీరియల్ కిల్లర్ ఆచూకీని తన పాడ్‌కాస్ట్ ద్వారా కనిపెట్టడానికి ఆమె ప్రయత్నిస్తుంది. ఈ సినిమాలో శోభితా ధూళిపాళ మరియు విశ్వదేవ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించగా, చైతన్య విశాలాక్షి, ఈషా చావ్లా, ఝాన్సీ, ఆమని మరియు వడ్లమాని శ్రీనివాస్ ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. ఈ సినిమా జనవరి 23న ప్రపంచవ్యాప్తంగా ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది.




## 'నేను రెడీ' టీజర్ రిలీజ్..



యంగ్ హీరో హవిష్, దర్శకుడు త్రినాధ రావు నక్కినతో కలిసి కంప్లీట్ ఎంటర్టైనర్ 'నేను రెడీ' చేస్తున్నారు. హర్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పీ బ్యానర్‌పై నిఖిల కొనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో హవిష్ సరసన కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది. పోస్టర్లు, టైటిల్ గ్లింప్స్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ చిత్రం టీజర్‌ను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. ఈ టీజర్‌ను ఇంతకు ముందు ప్రభాస్ 'రాజా సాబ్' చిత్రంతో పాటు థియేటర్లలో ప్రదర్శించారు.ఈ టీజర్ ఒక ఎంటర్టైనింగ్ కథాంశాన్ని పరిచయం చేస్తుంది. ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేసే బాధ్యత గల మధ్యతరగతి ఆంధ్ర యువకుడికి, ఒక మధ్యతరగతి తెలంగాణ అమ్మాయితో నిశ్చితార్థం జరగడం, దానివల్ల కల్చర్, లైఫ్ స్టయిల్ మధ్య హిలేరియస్ కాన్ఫ్లిక్ట్ కి దారితీయడం ఆసక్తికరంగా వుంది. అమ్మాయి కుటుంబం మాంసాహారాన్ని అమితంగా ఇష్టపడటం, అబ్బాయి కుటుంబం శాకాహారాన్ని పాటించడం వంటి సహజమైన పరిస్థితుల ద్వారా హాస్యాన్ని పండించారు.

## వేసవిలో 'మండాడి'



ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ నుండి 16వ ప్రాజెక్ట్‌గా 'మండాడి' చిత్రం రాబోతోంది. మదిమారన్ పుగళేంది దర్శకత్వంలో సూరి, సుహాస్ ప్రధాన పాత్రల్లో ఇంటెన్స్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటోంది. ఇంటెన్స్ రా అండ్ రస్టిక్, రూటెడ్ కథతో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ముఖ్యంగా సుహాస్ మొదటిసారి పూర్తి స్థాయి విలన్‌గా నటించడంతో ఈ మూవీ మరింత ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇప్పటికే డెబ్బై షూటింగ్ పూర్తి చేసుకుంది. 2026 వేసవిలో ఈ మూవీని విడుదల చేయాలని 'మండాడి' నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. ఇది సూరి కెరీర్‌లో అతిపెద్ద, అత్యంత ప్రతిష్టాత్మక చిత్రంగా నిలుస్తుంది. ఇంత వరకు సూరి పోషించిన అన్ని పాత్రల్లోకెల్లా ఈ 'మండాడి' మూవీ, అందులోని కారెక్టర్ మరింత స్పెషల్‌గా ఉండబోతోంది. సూరి, సుహాస్ యాక్షన్ సీక్వెన్స్, హైఇంటెన్సిటీతో సముద్రంలో ఉండే యాక్షన్ సన్నివేశాలు, సెయిల్ బోట్ రేస్ ఎపిసోడ్‌లో కోసం వారిద్దరూ పడిన కష్టం, ఆరు నెలల పాటు పొందిన కఠిన శిక్ష ఇవన్నీ సినిమాల్లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. తమిళం, తెలుగు, హిందీ భాషలలో విడుదలవుతున్న ఈ చిత్రం పాన్‌ఇండియన్ రీచ్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. భారతీయ సినిమాలో ఇంతకు ముందెన్నడూ సెయిల్ బోట్ రేసింగ్ సీన్లను షూట్ చేశారు. యాక్షన్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్ దాదాపు 60 రోజులు ఈ చిత్రం కోసం పనిచేశారు. 75 కోట్ల అంచనా బడ్జెట్‌తో నిర్మించబడిన 'మండాడి' అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నారు.



## బాస్ చించేశాడు..

### అల్లు అరవింద్

చిరంజీవి నటించిన తాజా సినిమా మన శంకర వరప్రసాద్ సినిమా విడుదలైంది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ వీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. సినిమా చూసి వస్తుంటే ఎగ్జాయిట్‌మెంట్. బాస్ చించేశాడు.. బాస్ ఈజ్ బాస్ ఓల్డ్ స్టైల్ రౌడీ అల్లుడు, ఘరానా మొగుడు ఆ సినిమాలు బయటికి వచ్చినప్పుడు ఉన్న ఫీలింగ్ ఇన్నేళ్లే తరువాత మళ్ళీ ఈ సినిమాలో ఆ ఫీలింగ్ కలిగింది. ఆయన రీఎంట్రీ తరువాత దీ బెస్ట్ సినిమా ఇదేనని చెప్పొచ్చు. నాకు అంత సంతృప్తినిచ్చింది. వెంకటేష్, నయనతార, డైరెక్టర్ ఎవరిదీ వాళ్ళు చాలా బ్రహ్మాండంగా చేశారు. టోటల్‌గా సూపర్ హిట్ ఫిలిం, బాస్ ఈజ్ బాస్.. అంతే. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో సహా వింటేజ్ డ్యాన్స్ తీసుకొచ్చేటప్పటికీ డైరెక్టర్ ఏమి ఆలోచించాడు అనే అనిపిస్తుంది. ఇద్దరి కాంబినేషన్ సూపర్ క్లైమాక్స్ సూపర్. సినిమా చూస్తుంటే పైసా వసూల్ ఫీలింగ్ వస్తుంది.

## ఎంజాయ్ చేస్తారు

### - కిషోర్ తిరుమల



మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రం 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ కిషోర్ తిరుమల మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. ఒక భర్త తన అనుభవం వల్ల మిగతా భర్తలకి ఏం చెప్తున్నాడు.. తను ఎలాంటి స్ట్రగుల్స్ ఎదుర్కొన్నాడు అనేది కథలోని ప్రధాన అంశం.ఇందులో ఇద్దరు అమ్మాయిలు అడిగిన ప్రశ్న పెళ్లయిన వాళ్ళందరికీ కూడా ఎప్పుడో ఒక సమయంలో ఎదుర్కొన్నదే. అలాంటి ప్రశ్న అడిగినప్పుడు వెంటనే ఏం సమాధానం చెప్పాలనేది తెలీదు. ఆ ప్రశ్న నిజంగా చాలా కఠినమైనది. దానికి సమాధానం సినిమాలో దొరుకుతుంది. ఈ కథని ఇల్లాలు ప్రియురాలు కోణంలో కాకుండా చాలా డిఫరెంట్‌గా ట్రీట్ చేయడం జరిగింది. ఇది చాలా మంచి ఎంటర్టైన్మెంట్ ఫిల్మ్.ఈ సినిమాలో సత్య నటించిన ఒక పాటకి కొరియోగ్రఫీ కూడా చేశాను. అదొక చిన్న బిట్ సాంగ్. ఆ పాట ఎంటర్టైనింగ్ గా ఉంటుంది. రవితేజతో చేద్దామని అనుకున్న తర్వాతే కథని డెవలప్ చేయడం జరిగింది. ఆయన దగ్గర చాలా ప్రాజెక్ట్స్ ఉన్నాయి. అయితే ఈ సినిమా స్క్రిప్ట్ చక్కగా వచ్చిన విధానం చూసి ముందు ఈ సినిమానే చేద్దామన్నారు. ఈ సినిమా విషయంలో ఆయన ఇచ్చిన కొన్ని ఇన్పుట్స్ కూడా తీసుకున్నాను. రవితేజ సినిమా చాలా సార్లు చూశారు. మేమందరం కూడా చాలా హ్యాపీగా ఉన్నాము. ఆడియన్స్ కూడా చాలా ఎంజాయ్ చేస్తారు. రంగబలి డైరెక్టర్ పవన్ ఈ సినిమా స్క్రిప్ట్‌కి పని చేశారు. ఈ టైటిల్ ఆలోచన ఆయనదే. అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ చేయాలనుకున్నాను. మేము అనుకున్నట్టే అద్భుతంగా కుదిరింది. సత్య వెన్నెల కిషోర్ మురళీధర్ గౌడ్ సునీల్.. ఇలా చాలా మంది అద్భుతమైన తారాగణం వుంది. ఇలాంటి మంచి తారాగణంతో సంక్రాంతికి వస్తే ఖచ్చితంగా ఆ వైబ్ పెరుగుతుంది. ఫ్యామిలీ అందరూ కలిసి వెళ్లి థియేటర్స్‌లో చూస్తే చాలా మంచి హ్యాపీనెస్ వస్తుంది.

## బిల్లుల కాపీలు దహనం

**(మొదటి పేజీ తరువాయి)**

వ్యాప్తంగా జిల్లా కేంద్రాలల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా వెల్లడించింది. హైదరాబాద్,విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో 'నిరసన ధర్నాలను జయప్రదం చేయండి' అనే వాల్‌పోస్టర్‌ను సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్, బి.రాము, మామిడాల బిక్షపతి, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, సదానందం, భాస్కర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని నల్ల జెండాలను,,నల్ల బ్యాడ్జీలతో జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గత 11 సంవత్సరాలుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలారాయడంతో పాటు రాష్ట్రాల హక్కులను హరించే చట్టాలను చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వైపున ప్రజాసంక్షేమం వల్లిస్తూనే. మరో వైపున కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలను దోచిపెడుతున్నదని, మోదీ పాలనలో కార్పొరేట్ సంస్థలకు రూ.18 లక్షల కోట్లు రాయితీలు కల్పించిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కూడా అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నదని, అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్లను అమలు చేసి కార్మికుల హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిందని, కార్మిక సంఘాలను ఏర్పాటు చేసేందుకు ఆంక్షలను విధించిందని, వృత్తి రక్షణ, ఆరోగ్యం, పని పద్ధతులు, కార్మికుల హక్కులు లేకుండా చేస్తోందన్నారు. 'వికసిత్ భారత్ జి రామ్ జీ' చట్టాన్ని రద్దు చేయాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. వామపక్షాల పోరాట ఫలితంగా సాధించిన మహాత్మా గాంధీ పేరుతో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ చట్టానికి గాంధీ పేరును తొలగించి, ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. నూతన విద్యుత్ సవరణ చట్టం అమలు జరిగితే విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ బాధ్యతలు కేంద్రమే చూస్తుందని, విద్యుత్ చార్జీలను కూడా విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్' ద్వారా కేంద్రమే నిర్ణయిస్తుందని, స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి టారిఫ్‌ను ముందుగానే వసూలు చేస్తారని వారు తెలిపారు. ఉచిత విద్యుత్‌తో పాటు, రాష్ట్రంలో అమలు జరుగుతున్న ఉచిత విద్యుత్, సబ్సిడీ తదితర వాటిని రద్దు చేస్తారన్నారు. లాభాల్లో ఉన్న ఎల్‌ఐసి ప్రభుత్వ రంగ సంస్థలో వంద శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ కేంద్రం నిర్ణయించిందని,తద్వారా ఈ సంస్థను విదేశీ బహుళ జాతి కంపెనీలకు అప్పగించడమేనని అన్నారు.
ఉపాధి హామీ చట్టంలో 26 కోట్ల మందికి ఉపాధి దక్కుతుందని, ఇందులో 18 శాతం దళితులు, 15 శాతం గిరిజనులు ఉపాధి అవకాశాలు పొందుతున్నారని పశ్యపద్మ వివరించారు. కార్మిక కోడ్‌ల వల్ల కార్మికులకు హక్కులు ఉండబోవని, కంపెనీలు, పరిశ్రమలు ఎంత వేతనం ఇస్తే అంతే తీసుకోవాలని, వారికి ఒక బానిసలుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె ఎం నాయకులు బి.ప్రసాద్, మూడ్ శోభన్ విజయ్, ఆర్. ఆంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు నూతన చట్టాలు

చలానాలు తగ్గించే ప్రసక్తేలేదు
ఇక నుంచి చలానాలు బ్యాంక్ అకౌంట్లు నుంచే కట్
మైనర్లు వాహనం నడిపితే తల్లిదండ్రులపై కేసులు
'అరైవ్ అలైవ్' ప్రచార కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హత్యలకంటే ఎక్కువ ప్రాణాలు పోవడానికి కారణమౌతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు నూతన చట్టాలు తీసుకువస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైడ్రా, ఈగల్, సైబర్ క్రైమ్ విభాగాలను బలోపేతం చేసినట్టే ట్రాఫిక్ నియంత్రలోనూ పోలీస్ వ్యవస్థను సిద్ధం చేయాల్సి ఉందని సిఎం అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్లవిజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో సోమవారం రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంతో చేపట్టిన 'అరైవ్ అలైవ్' ప్రచార కార్యక్రమాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో ప్రతి నిమిషం ఓ రోడ్డు ప్రమాదం జరుగుతుంటే.. ప్రతి 3 నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వడం, డ్రంగ్ అండ్ డ్రైవ్ వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న రవాణా విధివిధానాలను ప్రక్షాళన చేసి నూతన చట్టం తీచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టంపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నేర్పించాల్సిన అవసరం ఉందని సిఎం అన్నారు. వాహనాల స్పీడ్ ఆధారంగా చలాన్లు విధిస్తున్నా డిస్కౌంట్ ఇచ్చి ఎలాగూ తగ్గిస్తారనే ఆలోచన ఓ పెద్ద సమస్యగా మారిందన్నారు.అందువల్ల ఇకపై ట్రాఫిక్ చలాన్లపై ఎలాంటి డిస్కౌంట్లు ఇవ్వొద్దని సూచించారు. ఏ వాహనమైనా ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తే యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఆటోమెటిక్గా డబ్బులు కట్ అయ్యేలా విధానం ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే యజమాని బ్యాంకు ఖాతాకు లింక్ చేయాలని సూచించారు. ఈ విషయంలో బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. మైనర్లు ప్రమాదాలకు కారకులైతే వారి తల్లిదండ్రులపై కేసులు పెట్టాలన్నారు.
రవాణా శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువకులే మృతి చెందుతున్నారన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటి నుంచి 31వ తేదీ వరకు రోడ్డు భద్రత ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అంతకుముందు అరైవ్ అలైవ్ సాగ్‌తోపా టు ప్రచార కార్యక్రమం పోస్టర్‌ను సిఎం ఆవిష్కరించారు. డిజిపి బి.శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రానున్న రోజుల్లో రోడ్డు ప్రమాదాలను నివారిస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర రాజధాని వరకు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో సుమారు 30 వేల కిలోమీటర్ల మేర విస్తరించిన రహదారి నెట్‌వర్క్ ఉందని, వీటిపై ప్రతి ఏడాది దాదాపు 27వేల రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా సుమారు 7,500 మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. గత ఏడాది 800మంది హత్యలకు గురైతే, అదే కాలంలో రోడ్డు ప్రమాదాల్లో 7,500 మంది మరణించారని, అంటే హత్యలకన్నా 9–10 రెట్లు ఎక్కువ మంది రోడ్లపై ప్రాణాలు కోల్పోతున్నారన్నది తీవ్ర ఆందోళనకరమన్నారు.
ఈ కార్యక్రమంలో హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సివి ఆనంద్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్, ఎంఎల్ఏలు నవీన్‌యాదవ్ తాగూరులతో పాటు సీనియర్ ఐపిఎస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉద్యమాలను నడిపేది కలాలే

**(మొదటి పేజీ తరువాయి)**

కోరారు. కమ్యూనిస్టులంటే సమాజ మార్పును కోరుకునే వారని పీడిత తాడిత ప్రజల పక్షాన, కార్మికుల పక్షాన నిలబడి హక్కుల కోసం పోరాడేవారని ఓట్లు, నోట్ల కోసం కమ్యూనిస్టు పార్టీ పుట్టలేదన్నారు. శ్రీశ్రీ చెప్పినట్లుగా దొంగ ఓట్లు దొంగ నోట్లు ఇచ్చు రాజ్యము రాజ్యమా అని మారిన పరిస్థితుల్లో ఓట్లు, సీట్లతో కమ్యూనిస్టుల బలాన్ని అంచనా వేయలేమన్నారు. వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో అనేక పోరాటాలను చేశారని ఆ పోరాటాల వెనక త్యాగాలు ఉన్నాయని ఆ త్యాగాలకు కూడా వందేళ్లు నిండాయని మరో వేయ్యేళ్లయినా కమ్యూనిస్టుల రాజీలేని పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమాజం కోసం ఏదైనా చేస్తే అది కమ్యూనిస్టులేనని ఆయన తేల్చి చెప్పారు. హృదయాన్ని తాకే సాహిత్యం కావాలని ఆ సాహిత్యం ఆలోచింపజేయాలన్నారు. భావోద్వేగం పొంది ఇతరులకు భావోద్వేగానికి గురి చేయడం సాహిత్యంతోనే సాధ్యమన్నారు. మారిన పరిస్థితులకనుగుణంగా నూతన పద్దతుల్లో ప్రజలను చైతన్యపరిచేవిధంగా సాహిత్యం రావాలన్నారు. ప్రజా చైతన్యానికి ప్రధాన ఆయుధం పాటేనని ఆ పాటను పోరాటాన్ని సంయుక్తంగా నడిపిన వారు కమ్యూనిస్టులని అశోక్‌తేజ తెలిపారు.

### పాటకు పదునెక్కువ : కూనంనేని

ఉపన్యాసాల కంటే పాటకు పదునెక్కువ అని వంద ఉపన్యాసాల కంటే ఓ పాట ప్రజలను ఎక్కువగా ఆలోచింపజేస్తుందని కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించేది కళా రూపాలేనన్నారు.కమ్యూనిస్టు భావాలను ప్రజల్లోకి తీసుకుపోయేది పాటేనని, సాహిత్యం ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా ఉండాలన్నారు. అనేక మంది అభ్యుదయ కవులు తమ రచనలతో కమ్యూనిజానికి ఒక రూపును, ఊపును ఇచ్చారని కూనంనేని తెలిపారు. అభ్యుదయ భావాలను అణిచే శక్తి ఎవరికి లేదని స్పష్టం చేశారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం అనేక ఒడుదొడుకులను ఎదుర్కొన్నదని అనేక విజయాలను సాధించిందని ఆయన తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు ఖమ్మంలో జరుగుతున్న సందర్భంగా కవులు, కళాకారులు, అభ్యుదయవాదులు ఇస్తున్న సహకారం మరువలేనిదన్నారు. నూరేళ్ల అరుణ కేతనం కవితా సంపుటికి కవితలు రాసిన కవులను మెమెంటోలతో సత్కరించారు. ఈ సభలో ఆవిష్కరణ కమిటీ కన్వీనర్ లెనిన్ శ్రీనివాస్ స్వాగతం పలుకగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అరసం బాధ్యులు పల్లెర్ల వీరస్వామి, రాపోలు సుదర్శన్, నిధి, కవులు సాధనాల వెంకట స్వామినాయుడు, రౌతు రవి, మువ్వా శ్రీనివాసరావు, సునంద, కోంపెల్లి రామయ్య, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, సిపిఐ సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం హరిస్తోంది

**(మొదటి పేజీ తరువాయి)**

ఎదుర్కొంటున్న ఈ పరిస్థితి ఒక ప్రజాస్వామ్య దేశంలో ఎప్పుడూ జరగకూడదన్నారు. సంపూర్ణ అధికారాన్ని చలాయిస్తున్న కేంద్ర పాలకులు, ఏకపక్షంగా, వివక్షాపూరితంగా తమ హక్కులను హరిస్తున్నారని మండిపడ్డారు. ఇవి రాజ్యాంగ హక్కులని, వాటిని పరిరక్షించుకోవడానికే తాము వీధుల్లోకి రావాల్సి వస్తోందని కేరళ ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం రుణ పరిమితిని తగ్గించిందని, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఏడాది చివరిలో ముప్పు కలిగిస్తుందని కేరళ ముఖ్యమంత్రి ఆరోపించారు. జనవరి నుండి మార్చి వరకు రాష్ట్ర వినియోగం కోసం అందుబాటులో ఉన్న నిధులను కేంద్ర ప్రభుత్వం చివరి నిమిషంలో సగానికి పైగా తగ్గించిందన్నారు. కేరళకు రూ.12,000 కోట్లు రావాల్సి ఉందన్నారు. కేవలం రెవెన్యూ ఆదాయంపై ఆధారపడి ముందుకు సాగడం సాధ్యం కాదు; ముఖ్యంగా ఏడాది చివరి ఖర్చులను తీర్చడానికి రుణాలు కూడా అవసరమని చెప్పారు. రూ.12,000 కోట్ల రుణ పరిమితిలో రూ.5,900 కోట్లను ఎటువంటి కారణం లేకుండా నిరాకరించిందని, ఇది మాత్రమే కాదు... దేశంలో, కేరళతో సహా అమలు చేస్తున్న కేంద్ర ప్రాయోజిత పథకాల కింద, రాష్ట్రం మొదట తన సొంత నిధులను ఖర్చు చేస్తుందని విజయన్ పేర్కొన్నారు. కేంద్రం చర్యలు కేవలం రాష్ట్ర ప్రభుత్వంపై మాత్రమే కాకుండా, సమాజంలోని అన్ని వర్గాలను ప్రభావితం చేస్తూ, యావత్ కేరళను బలహీనపరిచే విస్తృత ప్రయత్నంలో భాగమని ముఖ్యమంత్రి విజయన్ అన్నారు. ఈ చర్యలను కేవలం రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నవిగా చూడలేమన్నారు. కేంద్ర చర్య ఉద్దేశపూర్వక, సునిశితంగా ప్రణాళిక వేసిన విధానంలో భాగమని, ప్రణాళిక అనేది ఒక రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించడానికి ఉద్దేశించబడాలి, కానీ కేంద్ర ప్రభుత్వం కేరళను బలహీనపరచడానికి, దెబ్బతీయడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కేరళ దేశానికి గర్వించదగిన రీతిలో ఎన్నో సేవలు అందించిన రాష్ట్రమని చెప్పారు. ఆరోగ్యం, విద్య, సంక్షేమ రంగాలలో సాధించిన తమ విజయాలను నాశనం చేయడానికి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్ కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ప్రధానమంత్రి పేరుతో ఎంతో ఆర్భాటంగా పథకాలు ప్రారంభిస్తారు... కానీ కేరళకు మాత్రం అడ్డంకులు, నిరాకరణే ఎదురవుతున్నాయన్నారు. కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలు, కేరళ పట్ల కొనసాగుతున్న ఆర్థిక వివక్షకు నిరసనగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలో సోమవారం జరిగిన ఎల్‌డిఎఫ్ సత్యాగ్రహం మధ్య ఈ వ్యాఖ్యలు వచ్చాయి. కాగా, కేంద్ర ప్రభుత్వం దేశ సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసే ఆంక్షలను విధిస్తోందని కేరళ రెవెన్యూ మంత్రి కె.రాజన్ కూడా ఆరోపించారు. సమాఖ్య వ్యవస్థలో అమలు చేయకూడని అత్యంత కఠినమైన చర్యలను కేంద్రం బలవంతంగా రుద్దుతోందని ఆయన అన్నారు. రాష్ట్రం అన్ని రుణ హక్కులను దెబ్బతీసిన తర్వాత, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో అందుబాటులో ఉండాల్సిన రూ.12,000 కోట్ల నుండి దాదాపు రూ.6,000 కోట్లను కేరళ పొందకుండా కేంద్రం అడ్డుకుంటోందని, దీనికి కారణం ఏమిటి? కేరళకు గానీ, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు గానీ ఎటువంటి వివరణ ఇవ్వలేదు. ఇది కేరళను ఏకాకిని చేయాలనే రాజకీయ లక్ష్యాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది, దీనిని కేంద్ర ప్రభుత్వం కూడా హేతుబద్ధమైన వాదనలతో సమర్థించుకోలేదు అని రాజన్ ఆయన అన్నారు.
కేరళ తమ పార్టీకి ఓట్లు వేయలేదని, రాష్ట్ర ప్రజలు ఇబ్బంది పడుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం వ్యాఖ్యానించారు. సత్యాగ్రహంలో మంత్రులు కె కృష్ణంకుట్టి, కదన్నపల్లి రామచంద్రన్, పిఎ మహమ్మద్ రియాస్, ఎంబి రాజేష్, పి రాజీవ్, కెఎన్ బాలగోపాల్, సాజి చెరియన్, రోషి అగస్టిన్, జె చింజురాణి, వి.శివన్‌కుట్టి, ఆర్.బిందు, ఎకె శశీంద్రన్, పి.ప్రసాద్, జిఆర్ అనిల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి విఎన్ వాసవన్ కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి విఎన్ వాసవన్ కుమార్ బినోయ్ విశ్వం, ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టిపి.రామకృష్ణన్, ఎమ్మెల్యేలు జి.స్టీఫెన్, కెకె.శైలజ, కెటి.జలీల్, తదితరులున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com